


# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - గురువారం 5 జూన్ 2025 | సంపుటి: 9 | సంచిక: 158 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA






## విజయోత్సవాల్లో విషాదం

# 11 మంది మృతి

చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాటలో మరో పది మందికి సీరియస్

50 మందికి గాయాలు

మృతుల సంఖ్య మరింత పెరగొచ్చు

క్షమాపణలు చెప్పిన డిప్యూటీ సీఎం శివకుమార్ 2

ఆస్పత్రిలో బాధితులను పరామర్శించిన సీఎం సిద్ధరామయ్య





## 2027 మార్చి 1 నుంచి జనగణన

దానితో పాటే కులగణన కూడా చేపడతారు

రెండు దశల్లో వివరాల సేకరణ కార్యక్రమం

CASTE CENSUS



ఢిల్లీ, జూన్ 4: ఎప్పుడెప్పుడా అని దేశమంతా ఎదురు చూస్తున్న కులగణనపై కేంద్ర ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. చాలా కాలంగా వాయిదా పడుతూ వస్తోన్న ఈ కులగణనకు కేంద్రం షెడ్యూల్ ను ప్రకటించింది. ప్రభుత్వ వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. 2027 మార్చి 1 నుంచి దేశ వ్యాప్తంగా జనాభా గణనతో పాటు కుల గణన కూడా ప్రారంభంకానున్నది. కాగా, జమ్మూకశ్మీర్, లడఖ్, ఉత్తరాఖండ్ లో 2026 అక్టోబర్ నుంచే ఈ ప్రక్రియ ప్రారంభం కావచ్చని ఆ వర్గాలు తెలిపాయి.

ప్రతి పదేండ్లకోసారి జాతీయ జనగణన నిర్వహించి జాతీయ జనాభా రిజిస్టర్ (ఎన్పీఆర్)ను అప్డేట్ చేస్తారు. 2011లో జరిగిన చివరి జనాభా గణన జరిగింది. ఈ క్రమంలోనే తదుపరి 2021లో జనాభా గణన చేపట్టాల్సి ఉన్నది. కరోనా మహమ్మారి కారణంగా ఇది వాయిదా ...మిగతా 2లో



# ఉద్యోగుల సమస్యల పరిష్కారం మా బాధ్యత

క్యాబినెట్‌కు నివేదిక సమర్పిస్తాం • అవసరమైతే నేరుగా ఉద్యోగ సంఘాలతో చర్చిస్తాం • ఉద్యోగ సంఘాల జేఏసీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క 2

## రేవంత్‌తో ట్రైనీ ఐఏఎస్‌ల భేటీ

బాధ్యతల నిర్వహణపై సీఎం దిశానిర్దేశం



## నేడు కేబినెట్

కాళేశ్వరంపై విజిలెన్స్ కమిషన్, ఎన్‌డీఎస్ నివేదికపై చర్చ

డీఏ పెంపు, పదవీ విరమణ వయసు పొడిగింపుపై స్పష్టత

రాజీవ్ యువ వికాసం, వానా కాలం పంటలు, ఇందిరమ్మ ఇండ్ల పంపిణీపై నిర్ణయం

## జులై 21 నుంచి పార్లమెంట్ సమావేశాలు

ఆపరేషన్ సిందూర్‌పై తక్షణమే ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను పట్టించుకోని ప్రభుత్వం

ఢిల్లీ, జూన్ 4: జులై 21 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు బుధవారం ప్రకటించారు. ఓ పక్క విపక్షాలు ఆపరేషన్ సిందూర్, పహల్గాం ఉగ్రదాడిపై పార్లమెంట్ ను ప్రత్యేకంగా సమావేశ పర్చాలని డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రిజిజు స్పందిస్తూ.. వర్షాకాల సమావేశాల్లో అన్ని అంశాలను పార్లమెంట్ నిబంధనల ప్రకారం చర్చిస్తామని చెప్పారు. ఇక ఆపరేషన్ సిందూర్ తదితర అంశాలపై చర్చించేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని మంగళవారం ఇండియా కూటమికి చెందిన 16 ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తూ ప్రధానికి లేఖ రాశాయి. బడ్జెట్ సమావేశాలు ఈ ఏడాది జనవరి 31న మొదలై.. ఏప్రిల్ 4న ముగిసిన విషయం పాఠకులకు విదితమే.

# కాళేశ్వరం విచారణ కక్ష సాధింపే

కేసీఆర్‌కు నోటీసులివ్వడంపై కవిత తీవ్ర ఆగ్రహం

ధర్నా చౌక్‌లో నిరసన చేపట్టిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు

అది కాళేశ్వరం కమిషన్ కాదు.. కాంగ్రెస్ కమిషన్ అని విమర్శ

రైతుల సంక్షేమం కోసమే ప్రాజెక్టు కట్టినమని వ్యాఖ్య



హైదరాబాద్, మనం ప్రతినిధి: కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై జరుగుతున్న విచారణను కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యగా మార్చిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆరోపించారు. రాజకీయ దురుద్దేశంతోనే మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారని ఆమె విమర్శించారు. ఈ ప్రాజెక్టులో జరిగినట్లు చెబుతున్న ఆర్థిక అవకతవకలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్.. కేసీఆర్‌కు ఇటీవల నోటీసులు జారీ చేయడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం అంటే... మొత్తం తెలంగాణ ప్రజలకు నోటీసులు ఇచ్చినట్లే అని ఆమె పేర్కొన్నారు. ఈ చర్యను నిరసిస్తూ బుధవారంనాడు హైదరాబాద్ ఇందిరాపార్క్‌లో ధర్నా చౌక్‌లో కవిత నిరసనకు దిగారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ... 'ఈ కమిషన్‌ను ఏర్పాటు చేసింది జవాబుదారీతనం కోసం కాదు?.. కేవలం రాజకీయంగా పరువు తీయడం కోసమేనన్నారు. ఇది కాళేశ్వరం కమిషన్ కాదు?.. కాంగ్రెస్ కమిషన్ అని విమర్శించారు. కేసీఆర్ ఏం తప్పు చేశారు? ఆయనకు నోటీసులు ఇస్తే, ...మిగతా 2లో

## కాంగ్రెస్ దేవాలయం గాంధీ భవన్

ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

మంత్రులతో ముఖాముఖీలో పొన్నం ప్రభాకర్



2

## మధుయాష్కీ ఇంట్లో విందు రాజకీయం

హాజరైన ఉద్యమ కాలం నాటి ఎంపీలు

## ఎర్రగడ్డ ఆస్పత్రి ఘటనపై సర్కార్ సీరియస్




హైదరాబాద్, జూన్ 4: ఎర్రగడ్డలోని మానసిక ఆరోగ్య కేంద్రంలో కలుషితాహారం ఘటనపై రేవంత్ ప్రభుత్వం సీరియస్ అయింది. ఆసుపత్రిలో ఆహార పదార్థాల సరఫరా కాంట్రాక్టర్ జైపాల్ రెడ్డిని తొలగిస్తూ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆదేశాలు జారీ చేశారు. ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రభుత్వం ఆర్ఎంవో డాక్టర్ పద్మజను సస్పెండ్ చేసింది. కలుషిత ...మిగతా 2లో

## న్యాయ వ్యవస్థ విశ్వసనీయతకే ప్రమాదకరం

- జస్టిస్ యశ్వంత్ వర్మ వ్యవహారంపై సీజేఐ
- యూకే సుప్రీంకోర్టులో బీఆర్ గవాయ్ ప్రసంగం



హైదరాబాద్, మనం ప్రతినిధి: అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో భారీగా నగదు స్వాధీనమైనట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో, న్యాయవ్యవస్థలో అవినీతి, దుష్ప్రవర్తన వంటివి ప్రజా విశ్వాసాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇది మొత్తం న్యాయ వ్యవస్థ విశ్వసనీయతకే ...మిగతా 2లో

## మలేసియాలో పాక్ పాచిక పారలేదు

దాయాదిపై దౌత్య యుద్ధంలో మనం సాధించిన మరో గెలుపు

ఢిల్లీ, జూన్ 4: పాక్ ప్రాయోజిత తీవ్రవాదం, ఆపరేషన్ సిందూర్ పై వివిధ దేశాలకు వివరించడానికి పార్లమెంటు సభ్యులతో కూడిన ప్రతినిధి బృందాలు ఆయా దేశాల్లో పర్యటిస్తోన్న సంగతి తెలిసిందే. భారత్ చేస్తోన్న ఈ ప్రయత్నాలను అడ్డుకునేందుకు దాయాది వేసిన పాచికలు ఫలితమివ్వకపోగా రివర్స్ అయ్యాయి.. జనతాదళ్(యూ)కు చెందిన పార్లమెంటు సభ్యుడు సంజయ్ ఝా నేతృత్వంలోని అఖిలపక్ష దౌత్య ప్రతినిధి బృందం మలేసియా లో నిర్వహించాలనుకున్న కార్యక్రమాలన్నింటిని రద్దు చేయాలంటూ ...మిగతా 2లో

# చరిత్రను చెరిపేస్తున్న యూనస్ ప్రభుత్వం

జాతిపితగా ముజిబుర్ రహ్మాన్ పేరు తొలగింపు

మొన్న కరెన్సీపై బంగబంధు చిత్రాలను తీసేసి కొత్త నోట్లను విడుదల చేసిన సర్కార్

బంగ్లాదేశ్ హిస్టరీని వక్రమార్గం పట్టిస్తున్న తాత్కాలిక ప్రభుత్వం





ఢాకా, జూన్ 4: బంగబంధు ముజిబుర్ రహ్మాన్, మాజీ ప్రధాని షేక్ హసీనా కుటుంబాన్ని చరిత్ర నుంచి కనుమరుగు చేసేందుకు బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం నిర్ణయించుకుంది. దానిలో భాగంగా బంగబంధు షేక్ ముజిబుర్ రహ్మాన్ కున్న 'ఫాదర్ ఆఫ్ నేషన్' బిరుదును తొలగించింది. అలాగే స్వాతంత్ర్య సమరయోధులు అనే పదానికి కొత్త అర్థాన్ని ఇచ్చింది. ఈ మేరకు నేషనల్ ఫ్రీడమ్ ఫైటర్స్ కౌన్సిల్ చట్టాన్ని సవరించిందని స్థానిక మీడియా కథనాలు పేర్కొన్నాయి. దీనికి సంబంధించి మంగళవారం రాత్రి న్యాయశాఖ ఆర్డినెన్స్ జారీ చేసిందని ఆ కథనాలు తెలియజేశారు. 'యూనస్ ప్రభుత్వం జాతిపిత బంగబంధు షేక్ ముజిబుర్ రహ్మాన్ పదాలు, చట్టంలో ఆయన ...మిగతా 2లో

# మాకు ఎప్పుడూ ఎదురుదెబ్బలే

పాక్ చవిచూస్తున్న వరుస పరాభవాల విషయాన్ని బయటపెట్టిన బిలావల్ భుట్టో



న్యూయార్క్, జూన్ 4: అంతర్జాతీయ వేదికలపై తమ దేశానికి తగిలిన ఎదురుదెబ్బల గురించి పాక్ నేత బిలావల్ భుట్టో వెల్లడించారు. కశ్మీర్ అంశాన్ని ఐరాసలో లేవనెత్తేందుకు చేసిన ప్రయత్నాలకు ఫలితం దక్కలేదని వాపోయారు. ఆపరేషన్ సిందూర్ పై ఏర్పాటైన భారత అఖిలపక్షం తరహాలో పాక్ కూడా తన విదేశాంగశాఖ మాజీ మంత్రి బిలావల్ భుట్టో ఆధ్వర్యంలో ఓ ఎంపీల బృందాన్ని న్యూయార్క్‌లోని ఐరాస కేంద్రంలో మాట్లాడింది. ''కశ్మీర్ అంశానికి సంబంధించినంతవరకు పాకిస్తాన్ ఎదుర్కొంటున్న అడ్డంకులు ఇప్పటికీ ఉన్నాయి. దీంతోపాటు ఇతర వేదికలపై ఎదురుదెబ్బలు తగిలాయి'' అని బిలావల్ వ్యాఖ్యానించారు. 'రెండు అణ్వస్త్ర దేశాల మధ్య వివాదాల పరిష్కార వ్యవస్థను తీసుకురావడం అసాధ్యం. మా రెండు దేశాలకు చెందిన నిఘాసంస్థలు ఐఎస్ఐ, రా.. కలిసి కూర్చొని, ఈ ఉగ్రవాద శక్తులపై పోరాటం కోసం కలిసి పనిచేస్తే, ఉగ్రవాద కార్యకలాపాలు తగ్గిపోతాయని నేను భావిస్తున్నాను' అని అన్నారు. రెండు దేశాల ...మిగతా 2లో

## తొక్కిసలాటలో

# 11 మంది మృతి.. పది మందికి సీరియస్

బెంగళూరు, జూన్ 4ః ఐపీఎల్ టైటిల్ గెలుచుకున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్ సీబీ) టీమ్ విజయోత్సవాల్లో పెను విషాదం చోటు చేసుకుంది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్దకు అభిమానులు బారీ సంఖ్యలో తరలిరావచ్చారు. స్టేడియం గేట్లు, సమీపంలోని గోడలు, చెట్లు ఎక్కారు. గేట్-2 నుంచి స్టేడియంలోకి వెళ్లేందుకు ఒక్కసారిగా దూసుకెళ్లారు. వీరిని అదుపు చేసేందుకు పోలీసులు లాఠీఛార్జి చేయాల్సి వచ్చింది. ఈ క్రమంలో ఒక్కసారిగా తోపులాట జరిగింది. ఈ తొక్కిసలాటలో 11 మంది దుర్మరణం పాలయ్యారు. మరో 50 మందికి తీవ్ర గాయాలైనాయి. వారిలో 10 మంది పరిస్థితి విషమంగా ఉంది. మృతుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదముంది.

18 ఏండ్ల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం తర్వాత ఆర్సీబీ టీమ్ ఐపీఎల్ కప్పు గెలుచుకుంది. ఎన్నో పరాభవాల తర్వాత ఆర్సీబీ కల నెరవెరడంతో దేశవ్యాప్తంగా బెంగళూరు టీమ్ అభిమానులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే విజయోత్సాహంతో బెంగళూరుకు వచ్చిన టీమ్‌కు చిన్నస్వామి స్టేడియంలో విజయోత్సవ సంబురాలు, టీమ్ సభ్యులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వీటిలో పాల్గొనేందుకు



అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కొందరు బారికేడ్లను, పోలీసులను తోసుకుని స్టేడియం వైపు దూసుకెళ్లారు. దాంతో వారిని పోలీసులు వారిని అదుపు చేయలేకపోయారు. దీనితో అభిమానులు గుంపులు గుంపులుగా స్టేడియంలోకి పరుగులు తీశారు. దాంతో తొక్కిసలాట జరిగింది.

మృతుల్లో ఆరుగురు పురుషులు, నలుగురు మహిళలు ఉన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్.. ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. తొక్కిసలాట ఘటనతో ఆర్సీబీ క్రీడాకారులకు సన్మాన కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. చిన్నస్వామి స్టేడియంవైపు వెళ్లే మెట్రో, ఇతర వాహనాలను నిలిపేశారు.

### స్వాగతం చెప్పిన డీకే..

ఆర్సీబీ టీమ్ ట్రోఫీతో బెంగళూరు రాగా ఫ్యాన్స్ ఘన స్వాగతం పలికారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ విమానాశ్రయానికి వెళ్లి స్వాగతం పలికారు. అనంతరం బెంగళూరు జట్టు ప్రత్యేక బస్సులో విధాన సౌధకు చేరుకుంది. ఈ క్రమంలో వేలాది అభిమానులు ఆర్సీబీ జెండాలు చేతబూని విధాన సౌధ వద్దకు చేరుకున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా 'ఎర్రసముద్రాన్ని' తలపించింది. ఆర్సీబీ ఆటగాళ్లు బస్సులో వస్తున్న రోడ్డుకు రెండు వైపులా నిలబడి ఫ్యాన్స్ గ్రాండ్ గా వెల్ కమ్ చెప్పారు.

### తప్పు మాదే క్షమించండి..

విషాద ఘటనపై కర్ణాటక ప్రభుత్వం క్షమాపణలు చెప్పింది. తొక్కిసలాట ఘటన దురదృష్టకరమని వ్యాఖ్యానించింది. ఘటనలో మృతిచెందిన వారి కుటుంబాలకు ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం 'ఆర్సీబీ అభిమానులు బారీగా తరలిరావడంతో అదుపు చేయలేకపోయామని, వైఫల్యం తమదేనం'టూ క్షమాపణలు చెప్పారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఈ ఘటనలో ఎంతమంది చనిపోయారో ఇప్పుడే చెప్పలేం. ప్రజలంతా సంయమనంతో ఉండాలి. ఆర్సీబీ విజయోత్సవ కార్యక్రమాన్ని పది నిమిషాల్లోనే ముగించాం. లక్షలాది మంది అభిమానులు వచ్చారు. పరిస్థితిని సాధారణ స్థితికి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం'' అన్నారు. మరో వైపు, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య బౌరింగ్ ఆస్పత్రికి వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. బాధిలందరికీ సరైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

# 2027 మార్చి 1 నుంచి జనగణన

(మొదటి పేజీ తరువాయి)

పడింది. అయితే, ఎప్పుడు నిర్వహిస్తారనేదాని పైనా స్పష్టత లేకుండా పోయింది. సరైన సమయంలో నిర్వహిస్తామని 2024లో ఒక సందర్భంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. తాజా జనాభా గణనలో కుల గణనను కూడా చేర్చడానికి రాజకీయ వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపిందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ఏప్రిల్ నెలలో ప్రకటించిన విషయం పాఠకులకు విదితమే. దీనితో 16 ఏండ్ల తర్వాత జనాభా లెక్కలు, దానితో పాటే కులగణన కూడా చేపట్టడానికి మార్గం సుగమమైంది. దానితో జనభా వివరాల సేకరణ ప్రక్రియ ప్రారంభమైనట్లు సమాచారం.

### రెండు దశల్లో గణన..

కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలోని 'రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ ఆఫ్ ఇండియా' పర్యవేక్షణలో జరిగే ఈ జనాభా గణనను రెండు దశల్లో నిర్వహిస్తారు. మహిళలు, పురుషుల లెక్కింపుతో పాటు కులం, ఉపకులాలను లెక్కించి జాబితా రూపొందిస్తారు. తద్వారా 1931 తర్వాత మొదటి సారి కులగణన జరిగినట్లవుతుంది. స్వతంత్ర భారత దేశంలో కూడా కులగణన చేం తొలిసారే కావడం విశేషం.

# చరిత్రను చెరిపేస్తున్న యూనస్ ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

పేరు ఉన్న భాగాలను తొలగించింది' అని ఓ మీడియా కథనం పేర్కొన్నది. ఇటీవల ముజిబుర్ చిత్రం ఉన్న కరెన్సీ నోట్ల స్థానంలో హిందూ, బౌద్ధ ఆలయాల ఫొటోలు గల కరెన్సీ నోట్లను 1వ తేదీ నుంచి అమలు ప్రారంభించిన విషయం విదితమే. భారత్ మద్దతుతో తూర్పు పాకిస్తాన్ నుంచి విడివడి బంగ్లాదేశ్ గా పేరు మార్చుకున్న తర్వాత 1972లో కరెన్సీ నోట్లపై ఓ మ్యాప్ ను ముద్రించారు. అనంతరం షేక్ హసీనా తండ్రి ముజిబుర్ రెహమాన్ చిత్రంతో కూడిన నోట్లను విడుదల చేశారు. గతేడాది ఆగస్టులో షేక్ హసీనా దేశం విడిచి వెళ్లిపోయిన తర్వాత తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడినప్పటికీ ఆమె తండ్రి ఫొటో ఉన్న కరెన్సీ నోట్లను కొనసాగించారు. తాజాగా వాటిని రద్దుచేసి కొత్తవాటిని విడుదల చేశారు.

ఆ దేశ పాఠ్యపుస్తకాల్లో బంగబంధు ముజిబుర్ రహ్మాన్ ప్రాధాన్యం తగ్గించేలా గతంలో సవరణలు చేపట్టిన సంగతి తెలిసిందే. 1971 బంగ్లా విముక్తి పోరాటం సందర్భంగా స్వాతంత్ర్య ప్రకటన తొలిసారిగా జియావుర్ రహ్మాన్ చేసినట్లు మార్పులు చేశారు. గతంలో ఈ ప్రకటన షేక్ ముజిబుర్ రెహ్మాన్ చేసినట్లు ఉండేది. ఈ పరిణామాలపై గతంలో నేషనల్ కరికులమ్ టెక్స్ట్ బుక్ బోర్డ్ ప్రొఫెసర్ ఏకేఎం రియాజుల్ హుస్సేన్ స్పందిస్తూ.. కొత్త పుస్తకాలను 2025 కోసం సిద్ధం చేశామని చెప్పారు. 1971 మార్చి 26న జియావుర్ రహ్మాన్ స్వాతంత్ర్య ప్రకటన చేశారని.. మార్చి 27న ఆయనే బంగబంధు ముజిబుర్ రెహ్మాన్ తరఫున కూడా ఇలాంటి ప్రకటనే వెలువరించినట్లు మార్చారన్నారు. పాఠ్యపుస్తకాల్లో ఈ విషయాన్ని పొందుపర్చినట్లు సమాచారం.

# మాకు ఎప్పుడూ ఎదురుదెబ్బలే

(మొదటి పేజీ తరువాయి)

మధ్య నిరంతర ఘర్షణ విద్రోహశక్తులను బలోపేతం చేస్తుందని ఆందోళన వ్యక్తంచేయడం గమనార్హం. ఉగ్రవాద సంస్థలతో పాకిసాన్ కు సంబంధాలు నిజమేనంటూ బిలావల్ ఇటీవల వెల్లడించిన విషయం తెలిసిందే.'పాక్ కు గతం ఉందనేది రహస్యం కాదని నేను భావిస్తున్నా. ఫలితంగా మనం బాధపడ్డాం. ఎంతో నష్టపోయాం. ఆ పరిణామాల నుంచి పాఠాలు నేర్చుకున్నాం. ఈ సమస్య పరిష్కారానికి అంతర్గత సంస్కరణలు చేపట్టాం. పాకిస్తాన్ తీవ్రవాద చరిత్ర తిరస్కరించలేనిది. అయితే, అది ముగిసిన అధ్యాయం. అది మన చరిత్రలో ఒక దురదృష్ట భాగం' అని ఆనాడు స్థానిక మీడియాతో భుట్టో వెల్లడించారు.

# మలేసియాలో పాక్ పాచిక పారలేదు

(మొదటి పేజీ తరువాయి)

పాక్ చేసిన అభ్యర్థనను పట్టించుకోలేదు. ముందుగా నిర్ణయించిన ప్రకారమే సంజయ్ బృందం పాల్గొనాలనుకున్న 10 కార్యక్రమాల రద్దు కోసం పాక్ ఎంబసీ మలేసియా ప్రభుత్వాన్ని కోరింది. ఈ సమయంలో మతం అంశాన్ని ముందుపెట్టింది. 'మనవి ఇస్లాం దేశాలు. భారత ప్రతినిధుల మాటలు వినకండి. ఆ దేశ బృందం కార్యక్రమాలను రద్దు చేయండి' అని అభ్యర్థించింది. దీంతోపాటు కశ్మీర్ అంశం ఐక్యరాజ్యసమితి పరిశీలనలో ఉందని కొన్ని దేశాలను భారత్ కు దూరం చేసే ప్రయత్నాలు చేసింది. కానీ మలేసియా మాత్రం ఇవేవీ పట్టించుకోలేదు. తమ దేశంలో భారత ఎంపీలు కార్యక్రమాలు ఏర్పాటుచేసుకోవడానికి అనుమతించింది. దాంతో మన బృందం పాక్ ప్రేరేపిత తీవ్రవాదంపై అక్కడి ప్రభుత్వానికి అవగాహన కల్పించడంతోపాటు భారత్ తీసుకుంటున్న చర్యల్ని వివరించింది. ఆ సమావేశాల దృశ్యాలను సంజయ్ ఎక్స్ వేదికగా షేర్ చేశారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారం మా బాధ్యత

హైదరాబాద్, మనం బ్యూరో: ఉద్యోగుల సమస్యల పరిష్కారం ప్రభుత్వ బాధ్యత.. వాటిపై సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసమే సీఎం రేవంత్ రెడ్డి మంత్రులు అధికారులతో కమిటీలను నియమించారని వెల్లడించారు. బుధవారం సచివాలయంలో క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు కేశవరావుతో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై సీఎం నియమించిన త్రిసభ్య కమిటీ ఉద్యోగ సంఘాలతో పలుమార్లు సమావేశమై విజ్ఞప్తులను స్వీకరించిందనీ, ఆ సమాచారాన్ని పలు దఫాలుగా కమిటీని వివరించారని తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా బకాయిలు పేరుకుపోవడం వల్ల అన్నీ ఒకేసారి చేయలేకపోయామనీ, ఇక ఎక్కువ కాలం పెండింగ్‌లో పెట్టకుండా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నదే ప్రభుత్వ ఆలోచన అని స్పష్టం చేశారు. గురువారం జరుగనున్న క్యాబినెట్ సమావేశంలో అధికారుల నివేదికతో పాటు నేరుగా ఉద్యోగ సంఘాలతో చర్చించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఉద్యోగులను ప్రభుత్వంలో భాగస్వాములుగా భావిస్తామనీ, ప్రజలకు చేయాల్సిన పనులు, అందించాల్సిన సంక్షేమ కార్యక్రమాలు, ప్రభుత్వ ఆదాయం, వ్యయం వీటన్నింటితో పాటు ఉద్యోగ వ్యవస్థకు ఇవ్వాల్సినవి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత అంశంగా భావిస్తుందన్నారు. ప్రజలకు, ఉద్యోగులకు ఇబ్బందులు కలుగకుండా ముందుకు పోవాలన్న ఆలోచనతోనే క్యాబినెట్ సమావేశానికి ముందు ఉద్యోగ సంఘాలతో సమావేశమైనట్లు వెల్లడించారు. గత పదేళ్ల పాలనలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయనీ, అయినప్పటికీ ఉద్యోగులకు సాధ్యమైనంత వరకు మేలు చేయాలన్న ఉద్దేశంతో తమ ప్రభుత్వం రాగానే మొదటి తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని తెలిపారు. గురువారం క్యాబినెట్ సమావేశం ఉన్న నేపథ్యంలో ఉద్యోగ సంఘాల సమస్యలపై అధికారులతో ఏర్పాటు చేసిన త్రీమెన్ కమిటీ ఆర్థిక శాఖ, ఇతర అధికారులతో చర్చించి ఒక నివేదిక రూపొందించి క్యాబినెట్‌కు నివేదిక రూపంలో సమర్పిస్తామని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు.



## ఆపరేషన్ సిందూర్ దాడుల తీవ్రతను వెల్లడించిన

న్యూయార్క్, జూన్ 4ః ఆపరేషన్ సిందూర్లో భాగంగా భారత్ ప్రయోగించిన బ్రహ్మోస్ క్రూయిజ్ క్షిపణి వంటి కచ్చితత్వంతో కూడిన ఆయుధాలు పాకిస్థాన్లోని అనేక ప్రాంతాల్లో విధ్వంసం సృష్టించినట్టు ఆ దేశం తాజాగా విడుదల చేసిన పత్రాలు వెల్లడించాయి. ఖైబర్ పఖ్తుంఖ్వా రాష్ట్రంలోని పంజాబ్ లోని గుజ్రాత్, ఝంగ్ ప్రాంతాలపై భారత్ దాడి చేసినట్లు అవి పేర్కొన్నాయి. ఆపరేషన్ సిందూర్కు ప్రతిగా పాకిస్థాన్ చేపట్టిన 'ఆపరేషన్ బున్యన్ ఉమ్ మర్సూస్'పై విడుదల చేసిన పత్రాల్లో ఈ వివరాలు ఉన్నాయి. గతనెల 8, 9, 10 తేదీల్లో భారత్ జరిపిన డ్రోన్ దాడుల వివరాలను కూడా పాకిస్థానీ మీడియాకు అందించిన ఈ పత్రంలో ప్రస్తావించారు.



# రేవంత్‌తో ట్రైనీ ఐఏఎస్‌ల భేటీ

హైదరాబాద్, మనం బ్యూరోః సీఎం రేవంత్ రెడ్డిని ట్రైనీ ఐఏఎస్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంసిహెచ్ఆర్‌డీలో శిక్షణ పొందుతున్న ట్రైనీ ఐఏఎస్‌లు సౌరభ్ శర్మ, సలోని ఛబ్రా, హర్ష చౌదరి, కరోలిన్ చింగ్తియన్మయి, కొయ్యడ ప్రణయ్ కుమార్ సీఎంను కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ట్రైనీ ఐఏఎస్‌లను అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి బాధ్యతల నిర్వహణపై వారికి దిశానిర్దేశం చేశారు. సీఎంను కలిసిన ట్రైనీ ఐఏఎస్‌ల వెంట ఎంసిహెచ్ఆర్‌డీ వైస్ చైర్పర్సన్ శాంతికుమారి, కోర్సు డైరెక్టర్ ఉషారాణి ఉన్నారు. కాగా, మహిళా నిరసనకారుల కోసం హైదరాబాద్ సీపీ కొత్తగా ఏర్పాటు చేసిన స్వాట్ టీంలను అభినందిస్తూ ప్రజాస్వామ్య స్ఫూర్తితో సరికొత్త ఆలోచనతో మహిళా పోలీసులతో స్వాట్ ఏర్పాటు చేయడాన్ని స్వాగతించారు. నిరసనను పరిగణిస్తాం, నినాదాన్ని అలరిస్తాం, ఆవేదనను పరిష్కరిస్తాం, ఆడబిడ్డను గౌరవిస్తాం అంటూ 'ఎక్స్' వేదికగా సీఎం రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు.

# నేడు కేబినెట్

హైదరాబాద్,మనం బ్యూరోః సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన నేడు మంత్రి మండలి సమావేశం కానుంది. సచివాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు జరుగనున్న ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై రాష్ట్ర విజిలెన్స్ కమిషన్, ఎన్‌డిఎస్ఏ నివేదికలపై చర్చించనున్నట్లు సమాచారం. అలాగే, భారీ స్థాయిలో ఇంజనీర్లపై క్రిమినల్ చర్యలతో పాటు రికవరీ చేయాలని కమిషన్ సూచించిన విషయంపై కూడా చర్చ జరిగే అవకాశం ఉన్నట్లు తెలిసింది. అలాగే, వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో ఆదర్శ రైతులను నియమించే అంశంపై నిర్ణయం తీసుకోనున్నారు. అలాగే, రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి ఇటీవల మంత్రులు జిల్లాల్లో పర్యటించిన సమయంలో వచ్చిన అభిప్రాయాలపై చర్చిస్తారు. పథకం ఎంపికలో ఎలాంటి పారదర్శకత పాటించాలనే అంశంతో పాటు ఈ పథకం లబ్దిదారులకు ఎప్పటి నుంచి నిధులు అందించాలనే అంశంపై సైతం మంత్రి మండలి సమావేశంలో స్పష్టత ఇవ్వనున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఆందోళన బాటలో ఉన్న సమయంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ నేతృత్వంలో లోకేశ్ కుమార్, కృష్ణ భాస్కర్‌ల ఆధ్వరంలో ప్రభుత్వం కమిటీని నియమించిన విషయం విదితమే. ఐదు కరువు భత్యాలు పెండింగ్‌లో ఉన్నాయనీ, వాటిని క్లియర్ చేయాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో కనీసం ఒక డీఏ, అలాగే, ఉద్యోగుల పదవీ విరమణ వయసును ఒకటి లేదా రెండేళ్లు పెంచుతూ ప్రభుత్వం క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. మరోవైపు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మంత్రులు రెండు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి నివేదిక అందజేశారు. ఎంత మంది అర్హులకైనా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి కానీ, ఒక్క అనర్హునికి కూడా లబ్ది చేకూరొద్దని సీఎం మంత్రులకు స్పష్టం చేశారు. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కనీసం వంద ఇళ్లను ప్రారంభిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే, ఇది వాయిదా పడింది. ఈ ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ఎప్పుడు ప్రారంభించాలనే అంశంపై సైతం క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

## ఎర్రగడ్డ ఆస్పత్రి ఘటనపై సర్కార్ సీరియస్

(మొదటి పేజీ తరువాయి)

ఆహారం ఘటనలో ఒక రోగి మృతి చెందగా, 92 మంది అస్వస్థతకు గురయ్యారు. వారిలో 18 మందిని మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించినట్టు సమాచారం. డిశ్చార్జి కమిటీ (డీసీ) వార్డులో ఉంటున్న భూపాలపల్లికి చెందిన కరణ్ (30) అనే వ్యక్తి తీవ్ర అస్వస్థతతో మంగళవారం ఉదయం చనిపోవడంతో ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. ఉస్మానియా నుంచి ప్రత్యేక బృందాన్ని రప్పించి పర్యవేక్షిస్తున్నారు. మిగిలిన బాధితుల పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. సోమవారం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆసుపత్రిలో ప్రత్యేకంగా చక్కెర పరమాన్నం చేశారు. దీంతోపాటు అన్నం, కూర, అరటి పండ్లు, గుడ్లను రోగులకు వడ్డించారు. సాయంత్రం డీసీ వార్డు, కోర్టు వార్డుల్లో మొత్తం 71 మంది రోగులకు వాంతులు, విరేచనాలు కావడంతో వైద్యాధికారులు వారికి చికిత్స అందించారు. డీసీ వార్డులో ఉన్న కరణ్ జ్వరం, ఇతర సమస్యలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఎర్రగడ్డ ఆసుపత్రిలో నల్లా నీటిని ఆర్వో ప్లాంట్లకు పంపి.. వాటి ద్వారా రోగులకు సరఫరా చేస్తున్నారు. స్టీలు బిందెల్లో పట్టిన ఆ నీటిని రోగులు గ్లాసులతో ముంచుకుని తాగుతుంటారని అధికారులు తెలిపారు. ఇలా తాగునీరు కలుషితమైందా అనే కోణంలోనూ పరిశీలిస్తున్నారు. ఈ సంఘటనకు కారణాలు తెలుసుకునేందుకు నమూనాలను పరీక్షలకు పంపామని ఆసుపత్రి సూపరింటెండెంట్ తెలిపారు.



## న్యాయ వ్యవస్థ విశ్వసనీయతకే ప్రమాదకరం

(మొదటి పేజీ తరువాయి)

ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. బ్రిటన్ సుప్రీంకోర్టులో 'న్యాయవ్యవస్థ చట్టబద్ధత, ప్రజా విశ్వాసాన్ని కాపాడుకోవడం' అనే అంశంపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో జస్టిస్ గవాయ్ ప్రసంగించారు. 'ఏ వ్యవస్థలోనైనా దుష్ప్రవర్తన సమస్యలు తలెత్తవచ్చు. విచారకరంగా, న్యాయవ్యవస్థలోనూ అవినీతి ఘటనలు వెలుగుచూశాయి. ఇవి ప్రజల విశ్వాసంపై ప్రతికూల ప్రభావం చూపుతాయి, వ్యవస్థ సమగ్రతపై నమ్మకాన్ని దెబ్బతీస్తాయి' అని ఆయన అన్నారు. ఇలాంటి సమస్యలను పరిష్కరించడానికి వేగవంతమైన, నిర్ణయాత్మకమైన, పారదర్శకమైన చర్యలు అవసరమని, తద్వారానే కోల్పోయిన నమ్మకాన్ని తిరిగి పొందగలమని అభిప్రాయపడ్డారు. ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయమూర్తుల నియామకాలకు కొలీజియం వ్యవస్థను సీజేఐ సమర్థించారు. న్యాయవ్యవస్థ స్వతంత్రతను దెబ్బతీసేలా ఏ పరిష్కారమైనా ఉండకూడదని, న్యాయమూర్తులు బాహ్య నియంత్రణల నుంచి విముక్తులై ఉండాలని స్పష్టం చేశారు.



## కాంగ్రెస్ దేవాలయం గాంధీ భవన్

హైదరాబాద్,మనం బ్యూరోః ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర రవాణా, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం ఏఐసీసీ రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సూచలన మేరకు పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ మంత్రులతో ముఖాముఖి కార్యక్రమాన్ని పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ పార్టీకి గాంధీభవన్ దేవాలయం లాంటిదనీ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కారణమైన దేవాలయంలో కాంగ్రెస్ కార్యకర్తలు తమ సమస్యలు తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు. న భూతో న భవిష్యత్ అన్న తరహాలో కాంగ్రెస్ పాలన సాగుతోందనీ, గ్రామాల్లో హనుమంతుడి గుడి లేని ఊరు ఎలా ఉండదో అలాగే, ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామం కూడా ఉండదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే బీఆర్ఎస్ నేతలు పిల్లి శాపనార్థాలు పెడుతున్నారనీ, ఉనికి కోసమే బీఆర్ఎస్ పార్టీ డ్రామాలాడుతోందని ఈ సందర్భంగా పొన్నం ఎద్దేవా చేశారు.

## కాళేశ్వరం విచారణ కక్ష సాధింపే

(మొదటి పేజీ తరువాయి)

యావత్ తెలంగాణ ప్రజలకు నోటీసులు ఇచ్చినట్లే అని కవిత అన్నారు. తెలంగాణ వ్యాప్తంగా లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించిన ఒక పరివర్తనాత్మక కార్యక్రమంగా కాళేశ్వరం ప్రాజెక్టును కవిత పేర్కొన్నారు. 21 పంప్ హౌస్‌లు, 15 రిజర్వాయర్లు, 200 కిలోమీటర్ల సొరంగాలు, 1500 కిలోమీటర్ల కాలువలతో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుందని ఆమె గుర్తుచేశారు. 'కాళేశ్వరాన్ని రైతుల సంక్షేమం, భవిష్యత్ తరాల కోసం నిర్మించారు కానీ, రాజకీయాల కోసం కాదు. ఈరోజు, ఈ అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం, తెలంగాణ పోరాడి సాధించుకున్న ప్రగతిని నాశనం చేస్తోంది. ఎలాంటి కక్ష సాధింపు చర్యలు తీసుకున్నా, ఏ ప్రభుత్వం కూడా కేసీఆర్ వారసత్వాన్ని తగ్గించలేదు' అని కవిత పేర్కొన్నారు.అయితే, నిజం ఎప్పటికైనా కచ్చితంగా బయటకొస్తుందని, తెలంగాణ ప్రజలకు నిజంగా ఎవరు సేవ చేశారో చరిత్ర గుర్తుంచుకుంటుందని ఆమె తెలిపారు. గోదావరి జలాల్లో తెలంగాణ హక్కులను కాపాడాలని డిమాండ్ చేసిన కవిత, కాంగ్రెస్, బీజేపీలు సాగునీరు, రాష్ట్ర సంక్షేమం విషయంలో విఫలమయ్యాయని ఆరోపించారు. ఇది కాంగ్రెస్ చేస్తున్న ఒక ప్రణాళికాబద్ధమైన రాజకీయ కుట్ర అని ఆమె విమర్శించారు. కాగా, కేసీఆర్‌తో పాటు మరో ఇద్దరు మాజీ మంత్రులకు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సమన్లు జారీ చేసిన విషయం తెలిసిందే.

# మధుయాష్కీ ఇంట్లో విందు రాజకీయం

- హాజరైన ఉద్యమ కాలం నాటి ఎంపీలు
- కేసీఆర్‌కు దగ్గర కావడానికే కవిత ధర్నా : మధుయాష్కీ

హైదరాబాద్, మనం బ్యూరోః మాజీ ఎంపీ, సీనియర్ కాంగ్రెస్ నేత మధుయాష్కీ విందు రాజకీయం నెరుపుతున్నారు. బుధవారం ఆయన ఇంట్లో ఏర్పాటు చేసిన లంచ్ మీటింగ్‌కు 2009-14 మధ్య కాలంలో ఎంపీలుగా పని చేసిన వారంతా హాజరయ్యారు. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కొట్లాడిన కాంగ్రెస్ పార్టీ నేతలు మాజీ ఎంపీ కేశవరావు, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ విజయశాంతితో పాటు ఆనాడు కీలకంగా వ్యవహరించిన మాజీ మంత్రి జానారెడ్డి సైతం ఈ సమావేశానికి హాజరయ్యారు. కాగా, ఈ సమావేశంలో నాటి ఉద్యమ సమయంలో చేసిన పోరాటంతో పాటు ఆ పోరాటాన్ని డాక్యుమెంటరీగా చేయాలనే ప్రతిపాదన వచ్చినట్లు సమాచారం. అలాగే, నాటి పోరాటాన్ని అతి త్వరలోనే ఒక పుస్తకంగా తీసుకు రావాలన్న ప్రతిపాదన కూడా వచ్చినట్లు తెలిసింది. కాగా, ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రివర్గ విస్తరణపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం. సమావేశం అనంతరం మధుయాష్కీ మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వరం పేరుతో కల్వకుంట్ల కుటుంబం సర్వం దోచుకుందనీ, కమిషన్ అధికారులు ఇచ్చిన ఆధారాలతోనే అప్పటి సీఎం కేసీఆర్, ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్, నీటి పారుదల శాఖ మంత్రి హరీష్ రావుకు నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. కేసీఆర్, కేటీఆర్ జైలుకు వెళ్లడం ఖాయమనీ, కేసీఆర్‌కు కమిషన్ నోటీసులు ఇవ్వడానికి వ్యతిరేకంగా కవిత చేసిన ధర్నా అంతా డ్రామాగా పేర్కొన్నారు. కేసీఆర్‌కు దగ్గర కావడం కోసమే కవిత ధర్నా చేశారని వ్యాఖ్యానించారు.

# మావోయిస్టులతో శాంతియుత చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలి

- ఆదివాసి ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలిపివెయ్యాలి
- సిపిఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య



**తుర్కయంజాల్, జూన్ 04( మనం న్యూస్):** ఆపరేషన్ కగార్ పేరుతో నరేంద్ర మోధీ నాయకత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వం మావోయిస్టులు, ఆదివాసి గిరిజన ప్రజలపై సాగిస్తున్న హత్యాకాండను వెంటనే నిలిపివేయాలని మావోయిస్టులతో శాంతియుత చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని సిపిఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సభ్యులు పగడాల యాదయ్య అన్నారు. బుధవారం రాగన్నగూడలోని సిఐటియు కార్యాలయంలో సిపిఎం తుర్కయంజాల్ మున్సిపల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిపిఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను మరిచి దేశంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుండా సమస్యలతో సతమతమయ్యే ప్రజలు అసంతృప్తితో చేసే ఉద్యమాలపై కేంద్ర ప్రభుత్వం ఉక్కు పాదం మోపుతుందని అందులో భాగంగానే ఆపరేషన్ కగారు పేరుతో మావోయిస్టులను బూటకపు ఎన్కౌంటర్ల పేరుతో హతమారుస్తుందని అన్నారు. వెంటనే ఈ దుష్ట చర్యలను ఆపి ప్రజాస్వామ్య పద్ధతుల్లో మావోయిస్టులు ఆదివాసి గిరిజన ప్రజలతో శాంతియుత చర్చలు జరిపి వారు లేవనెత్తిన అంశాలను పరిష్కరించాలని అన్నారు. సమస్యలు ఉన్నంతకాలం ప్రభుత్వాలకు ఉద్యమకారులు ప్రజల నుండి ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు రాష్ట్రంలో భూభారతి పేరుతో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయిలో భూ సమస్యలను అన్నింటిని పరిష్కరించాలని అన్నారు. అనేక మంది ప్రజల అసైన్డ్ ప్రభుత్వ భూములను ఇప్పటికీ ధరణిలో ఎక్కించక పోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అలాంటి వారిని గుర్తించి వెంటనే ఆన్లైన్లో ఎక్కించే వారికి పాస్ పుస్తకాలు ఇవ్వాల్సిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా పట్టణ ప్రాంతాల్లో భూముల ధరలు విపరీతంగా పెరగడంతో భూ కబ్జాదారులు ప్రభుత్వ భూములను యదేచ్ఛగా కబ్జా చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని అలాంటి వాటిని గుర్తించి ప్రభుత్వ భూములను కాపాడాలని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం పార్టీ, ఇతర ప్రజా సంఘాల కార్యకర్తలు పెద్ద ఎత్తున ప్రజా పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ తుర్కయంజాల్ మున్సిపల్ కార్యదర్శి డి కిషన్ కమిటీ సభ్యులు ఎం సత్యనారాయణ, కే అరుణ్ కుమార్, కే శ్రీ రామ్ మూర్తి, కే శారద, బి శంకరయ్య, పి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర వికారాబాద్ నియోజకవర్గ శాసనసభాపతి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కి బుధవారం శాలువా కప్పి హార్దిక జన్మదిన శుభాకాంక్షలు. తెలియజేసిన ఆలేరు. శాసనసభ్యులు. బీర్ల ఐలన్న (ప్రభుత్వ విప్) మరియు తుర్కయంజాన్ మున్సిపాలిటీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కొత్త కుర్మ శివకుమార్, ఎరుకలి రవి, పాల్గొన్నారు.
**తుర్కయంజాల్, మనం న్యూస్**



చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి ( చందు) జన్మదినము సందర్భంగా వి3 ఛానెల్, విశ్వంబర దినపత్రిక చైర్మన్ డా. కాచం సత్యనారాయణ శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో శ్రీధర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.
**రంగారెడ్డి, మనం న్యూస్**

# ప్రజా సమస్యలను పట్టించుకోవడంలో ప్రభుత్వం విఫలం

**రంగారెడ్డి, జూన్ 4 (మనం న్యూస్) :** ప్రజా సమస్యలను పట్టించుకోవడంలో ప్రభుత్వము, జిహెచ్ఎంసి విఫలమైందని కొత్తపేట సరూర్ నగర్ కార్పొరేటర్లు నాయి కోటి పవన్ కుమార్, ఆకుల శ్రీవాణి అంజన్ కుమార్ లు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిహెచ్ఎంసి కౌన్సిల్ సమావేశాల సందర్భంగా ప్లాకార్డులతో కార్పొరేటర్లు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువును తలపిస్తున్న చెరువులు, ట్రాఫిక్ జామ్ లతో వాహన చోదకుల ఇక్కట్లు, వెలగని వీధి దీపాలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే జిహెచ్ఎంసి ఏం చేస్తుందని ప్రశ్నించారు. కాంగ్రెస్, టిఆర్ఎస్, ఎంఐఎం దోస్తీ చేసి ప్రజలకు పొంగనామాలు పెడుతున్నారని ఆరోపించారు. పేరుకే విశ్వనగరం అని వీధులన్నీ అంధకారంగా మారాయని, కోట్ల అధిరూపాయలు ఖర్చు చేసిన ఎక్కడా రోడ్లు కనిపించడం లేదని అన్నారు.




# ఫలితాలు ఆశించకుండా ప్రజల్లో పని చేస్తే ప్రత్యేక గుర్తింపు



- ఎమ్మెల్సీ శంకర్ నాయక్

**నల్లగొండ, జూన్ 4 ( మనం న్యూస్) :** ఫలితాలు ఆశించకుండా ప్రజల్లో పనిచేస్తే ప్రత్యేక గుర్తింపు వస్తుందని అప్పుడే పదవులు దానంతట అవే వస్తాయని ఎమ్మెల్సీ శంకర్ నాయక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మనోరమ హోటల్లో ఆల్ ఇండియా బంజార సంఘ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీ శంకర్ నాయక్ కు ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించి ఎమ్మెల్సీని ఏ ఐ బీ ఎస్ ఎస్ జిల్లా గౌరవ అధ్యక్షులు అంగోత్ ప్రవీణ్ నాయక్ సభ్యులతో కలిసి పూలమాలలతో సాల్వాలతో ఘనంగా సన్మానించారు.అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ కష్టాన్ని నమ్ముకుని నమ్మిన పార్టీకి పదవులు ఉన్నా లేకున్నా ప్రజల్లో ఉంటూ పని చేశానని అందుకు పార్టీ గుర్తించి పదవి ఇచ్చిందని అన్నారు. పార్టీ అనేక పదవులు ఇస్తూ ఎమ్మెల్సీ పదవి ఇచ్చిన పార్టీకి సహకరించిన మంత్రులకు ఎమ్మెల్యేలకు నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ వారికి రుణపడి ఉంటారని అన్నారు. జాతి కోసం, సంఘ భవనం కోసం అన్ని విధాలుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మనమందరం ఏకతాటిగా ఉండి వచ్చే స్థానిక ఎన్నికల్లో గ్రామపంచాయతీ ఉన్న తండాలను ఏకగ్రీవం కావడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని అప్పుడే తండాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఉన్నత స్థానంలో ఉన్న ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారేనని అందుకే ప్రతి ఒక్కరు కష్టపడి చదువుతూ ఉన్నత స్థానాలకు ఎదిగితే వారు ఉన్న ప్రాంతాలు అన్ని విధాలుగా మార్పు వస్తాయని అన్నారు. ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ సామాన్య నాయకుడు శంకర్ నాయక్ కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడం జాతికే గర్వకారణమని అన్నారు.ఈ సందర్భంగా సబండ వర్గాలు గర్వపడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా తిరుమలగిరి మాజీ ఎంపీపీ ఆంబోతు భగవాన్ నాయక్, మాజీ జెడ్పిటిసి భాస్కర్ నాయక్, ధరావత్ నర్సింగ్ నాయక్, పెద్దవూర ఎంపీపీ శంకర్ నాయక్, మాజీ కౌన్సిలర్ అంగోత్ ప్రదీప్ నాయక్, రవి నాయక్, సంఘ నాయకులు తదితరులు సన్మానించారు.

# యాదగిరిగుట్ట దేవస్థానం అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం

- యాదగిరిగుట్ట దేవస్థానంలో 100 కోట్లతో అభివృద్ధి పనులు
- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**యాదగిరిగుట్ట, జూన్ 4 (మనం న్యూస్) :** యాదగిరిగుట్ట దేవస్థానం కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 100 కోట్ల రూపాయలు నిధులను విడుదల చేయనున్న సందర్భంగా యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ ఆలయ అభివృద్ధి పనులపై దేవస్థానం కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, జిల్లా కలెక్టర్ హనుమంతరావు, దేవాదాయశాఖ డైరెక్టర్ ఆలయ ఈఓ వెంకట్రావు, స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, దేవస్థాన, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధి పనులపై సమీక్ష పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్ష సమావేశాన్ని అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఐలయ్య మాట్లాడుతూ తెలంగాణలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుండి వేల సంఖ్యలో భక్తులు వస్తున్నారని వారి కోసం ప్రత్యేక ఏర్పాటు చేయాలని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వారికి మౌలిక వసతులను కల్పించే విధంగా కృషి చేయాలని అధికారులను కోరారు.



# అనిశా వలలో మండల సర్వేయర్ మంజుల

### 100000 రూపాయలు లంచం డిమాండ్
### ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు
### దాడులు నిర్వహించిన అనిశా డీఎస్పి విజయ్ కుమార్

**మంచిర్యాల రూరల్, జూన్ 4 ( మనం న్యూస్) :** మంచిర్యాల మండల తహసీల్దార్ కార్యాలయంలో సర్వేయర్ గావిధులు నిర్వహిస్తున్న మంజుల భూ సర్వే కోసం ఒక రైతు వద్దనుండి సుమారు లక్ష రూపాయల వరకు లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు బుధవారం మంచిర్యాల తహసీల్దార్ కార్యాలయం లో విచారణ నిర్వహించిన డీఎస్పి విజయ్ కుమార్ సర్వేయర్ మంజుల రైతు వద్ద మొదటి విడుదల 15 వేల 500 రూపాయలు, రెండవ విడతగా 10 వేల 500 రూపాయలు, మరో విడతలో 5000 రూపాయలు లంచం రూపంలో చైన్ మెన్ ఉదయ్ సహాయంతో తీసుకున్నట్లుగా అనిశా అధికారులకు వాయిస్ రికార్డ్ ఇతర ఆధారాలు సేకరించి విచారణ జరిపామని, గత పది రోజుల క్రితం బాధితుడు సర్వేయర్ మంజులకు పూర్తిస్థాయిలో 26 వేల రూపాయలు లంచం ముట్ట చెప్పినట్లు ఆధారాలు ఏసీబీ అధికారులకు లభించాయని డీఎస్పీ తెలిపారు. అదేవిధంగా రైతు దగ్గర నుండి సర్వేయర్ మంజుల మరికొంత లంచం కోసం ప్రలోభ పెట్టగా సహనం క్షీణించిన రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. సర్వేయర్ రైతు భూమిని పూర్తిస్థాయిలో సర్వే నిర్వహణకై లక్ష రూపాయలు లంచం అడిగినట్లు ఆధారాలు లభించడంతో సర్వేయర్ మంజుల, చైన్ మెన్ ఉదయ్ కి ఈరోజు రిమాండ్ విధించి గురువారం రోజు ఏసీబీ కోర్టులో ప్రవేశపెడతామని అనిశా డీఎస్పీ విజయకుమార్ తెలిపారు. ఈ మధ్యకాలంలోనే అవినీతికి పాల్పడిన నస్పూర్ ఎస్సై అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కాడు. ఆ ఘటన మరువకముందే కూతవేటు దూరంలో ఉన్న మంచిర్యాల తహసిల్దార్ కార్యాలయంలో అవినీతి నిరోధశాఖకు మరో అవినీతి అధికారి చిక్కడం జిల్లాలో సంచలనం సృష్టించింది.




# చిన్న సినిమాలను ప్రజలు ఆదరించాలి

- సార్ జాంబి సినిమా టీజర్ విడుదల చేసిన ఎమ్మెల్సీ

**రంగారెడ్డి, జూన్ 4 (మనం న్యూస్) :** సందేశాత్మకంగా వస్తున్న చిన్న సినిమాలను ప్రజలందరూ తప్పక ఆదరించాలని సార్ జాంబి సినిమా టీజర్ ముఖ్యఅతిథిలుగా హాజరైన వక్తలు అన్నారు. మంగళవారం సరూర్ నగర్ డివిజన్లోని ఓ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, టూరిజం అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, వి3 ఛానెల్, విశ్వంబర దినపత్రిక చైర్మన్ డా.కాచం సత్యనారాయణ గుప్తా,మా అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పసునూరి శ్రీనివాస్ లు హాజరై టీజర్ ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సినిమా కథలో బలముంటే ప్రజలు తప్పక చూస్తారని అన్నారు. చిన్న సినిమాలతోనే నటీనటులు సినీ రంగానికి పరిచయం అవుతారని అన్నారు. చిన్న సినిమాలకు ప్రభుత్వం నుండి ఆదరణ ప్రోత్సాహం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. సినిమా అనేది వినోదం కోసం చూసేదని, ఇండస్ట్రీలో కొద్దిమంది వందల కోట్లు వెచ్చించి సినిమాలు నిర్మించడంతో ప్రేక్షకుల ఆదరణ కరువైతుందని అన్నారు. తక్కువ బడ్జెట్ తో మంచి సినిమాలు తీయాలని అన్నారు. సార్ జాంబి సినిమాలో హీరోగా నటిస్తున్న గుడుగుండ్ల మహేష్ కు అభినందనలు తెలియజేశారు. అనంతరం గుడుగుండ్ల మహేష్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాఘవేంద్ర గుప్తా, అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# వ్యక్తి మరణానికి కారణమైన వ్యక్తి అరెస్ట్

**రంగారెడ్డి జూన్ 4 (మనం న్యూస్) :** పార్కింగ్ గొడవ విషయంలో ఓ వ్యక్తి మరణానికి కారణమైన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం మే 21వ తేదీన కొత్తపేట డివిజన్ న్యూ మారుతి నగర్ కాలనీ వైష్ణవి మోక్షిత అపార్ట్మెంట్లో నివాసం ఉండే గంద్ర నాగిరెడ్డి, ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం నారాయణపురం కు చెందిన కృష్ణ నాగోల్ డివిజన్ జైపూరి కాలనీ కాంక్రీట్ అపార్ట్మెంట్స్ లో నివాసం ఉంటున్నాడు. పార్కింగ్ విషయంలో నాగిరెడ్డి, జవాజి కృష్ణల మధ్య పార్కింగ్ విషయంలో గొడవ జరిగింది.



తన కారుకు గీతలు పడ్డాయని నాగిరెడ్డి తన కారు వెనక పార్కు చేసిన కారు వల్లే ఇలా జరిగిందని కృష్ణ గొడవకు దిగాడు. ఇరువురి మధ్య జరిగిన గొడవలో నాగిరెడ్డికి బలమైన గాయాలు తగలడంతో ఆసుపత్రికి తరలించగా పరీక్షల నిర్వహించిన వైద్యులు నాగిరెడ్డి మృతిచెందినట్లు నిర్ధారించారు. తన భర్త మరణానికి జవాజి కృష్ణ కారణం అని మృతుడి భార్య గంద్ర అన్నపూర్ణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అన్నపూర్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టి బుధవారం నిందితుడు జవాజి కృష్ణ (33) ను అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి వోక్స్వ్యాగన్ పోలో కారును స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్ కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

# జేఈఈ లో నారాయణ విద్యార్థుల ప్రతిభ

- ఉత్తమ బోధనతోనే మంచి ఫలితాలు

**రంగారెడ్డి, జూన్ 4 (మనం న్యూస్) :** ఉత్తమ బోధన ద్వారానే విద్యార్థులు మంచి ఫలితాలు సాధించగలుగుతున్నారని నారాయణ కళాశాల కోర్ డీన్ వెంకటరెడ్డి, జిఎం గోపాల్ రెడ్డి, డీన్



మదనాచారి, ఏజీఎం సదా శివుడు, ప్రిన్సిపల్ సురేష్ పేర్కొన్నారు. జేఈఈ అడ్వాన్స్ 2025 ఫలితాలలో నారాయణ ఎల్బీనగర్ స్టార్ సూపర్ సీవో స్కూల్ విద్యార్థులు ఫలితాలలో ఎల్బీనగర్ సిఓ స్కూల్ నారాయణ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా ఓపెన్ క్యాటగిరి 20వ ర్యాంక్ సాధించిన అనిరుద్ రెడ్డి, ఆలిండియా ఓపెన్ క్యాటగిరి 131 వ ర్యాంకు సాధించిన రిత్విక్ మణి సాయి మాట్లాడుతూ ప్రణాళిక బద్ధమైన స్టార్ సూపర్ సీఓ స్కూల్ ప్రోగ్రామ్ వల్ల ఇంటర్మీడియట్ సులభతరమైందన్నారు. అత్యుత్తమ బోధన ద్వారానే మంచి ర్యాంకు సాధించగలిగామన్నారు. ఉత్తమ ఫలితాలు రావడంతో విద్యార్థు లు భారీ ప్రదర్శన నిర్వహించారు. అదేవిధంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులను ఘనంగా సన్మానించారు.

# కమలంలో కారు... లాభం ఎవరికో?



స్కాములు, కేసులతో ప్రాంతీయ పార్టీలను లొంగదీసుకుని రాజకీయాలు చేయడంలో ప్రస్తుత బిజెపి నాయకత్వం ఆరితేరిందని చెప్పవచ్చు. అయితే పొత్తు పెట్టుకోవడమో.. లేదా వ్యూహాత్మకంగా వ్యతిరేకంగా ఉంటూనే తాము చెప్పింది లోపాయకరంగా ఒప్పుకునేలా చేయడమో.. అనే రెండు వ్యూహాలతో ప్రాంతీయ పార్టీలను తమ చెప్పు చేతల్లో పెట్టుకోవడం ఆయా రాష్ట్రాల్లో బిజెపి అనుసరిస్తున్న విధానంగా భావించవచ్చు. దీనికి దేశంలో బిజెపికి లొంగిపోయి షరతులకు అనుగుణంగా నడుచుకున్న ప్రాంతీయ పార్టీల అధినాయకుల జాబితా భారీగానే ఉంది. అందుకు గత జగన్ సర్కార్ కూడా ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. కేంద్రం మెడలు వంచుతా.. రాష్ట్రానికి స్పెషల్ స్టేటస్ తీసుకువస్తా అని ఎన్నికల ప్రచారాల్లో బీరాలు పలికిన జగన్.. తీరా అధికారంలోకి వచ్చాక.. స్పెషల్ స్టేటస్ మాట దేవుడు ఎరుగు.. తన అవినీతి కేసుల్లో జైలు పాలు కాకుంటే చాలు అన్నట్టుగా పాలన సాగించారు. తనను తాను రక్షించుకుంటూ కేంద్రం తీసుకువచ్చిన దాదాపు అన్ని బిల్లులకు, చట్టాలకు మద్దతు పలుకుతూ జి హుజూర్ అన్నట్టుగా సెంట్రల్ తో సత్సంబంధాలు మెయింటెన్ చేస్తూ పాలన కొనసాగించారు. అలాగే ఏపీలో చంద్రబాబు టిడిపి అధికారంలో ఉన్నప్పుడు సైతం.. చంద్రబాబు కొన్ని కేసుల్లో ఆయనను కేంద్రంలోని బిజెపి టార్గెట్ చేసి తమ మాట వినాల్సిందే అన్నట్టుగా ఒత్తిడి తీసుకొచ్చిన విషయాలు విదితమే.. ఈ క్రమంలో కేంద్రంలోని బిజెపికి పలు బిల్లుల విషయంలో అప్పటి టిడిపి సర్కారు మద్దతు తెలిపిన విషయం కూడా తెలిసిందే. అయితే కేంద్రంలోని బిజెపి అధినాయకత్వం చంద్రబాబుపై తీవ్ర ఒత్తిడి తీసుకురావడంతో.. చంద్రబాబు తనకు దేశవ్యాప్తంగా ఉన్న పలుకుబడితో కేంద్రం నిధులు ఇవ్వకపోయినా పర్వాలేదు అని బిజెపితో దోస్తీ కట్ చేసుకుని సెంట్రల్ పై మాటలు యుద్ధానికి దిగారు. ఇక తెలంగాణలోని కెసిఆర్ సర్కార్ గురించి చెప్పాల్సి వస్తే.. ఇక్కడ కాస్త డిఫరెంట్‌గా బిజెపితో బిఆర్ఎస్ బంధం కొనసాగిందని చెప్పవచ్చు. ఢిల్లీలో దోస్తీ గల్లీలో కుస్తీ అనే వ్యూహంతో రెండు పార్టీలు కూడబలుక్కుని రాజకీయాలు చేశాయి. బిజెపి ఎదుగుదలకు బిఆర్ఎస్ ఎంతగా సహకరించిందంటే.. పదేళ్ల క్రితం ఒక్క ఎంపీ స్థానానికే పరిమితమైన బిజెపిని ప్రస్తుతం ఎనిమిది ఎంపీ స్థానాలు, 8 అసెంబ్లీ స్థానాలకు ఎదిగేలా చేసిందని చెప్పవచ్చు. ఈ మధ్య జరిగిన రెండు ఎమ్మెల్సీ స్థానాలను కూడా బిజెపికి అప్పనంగా కట్టబెట్టడానికి బిఆర్ఎస్‌కు మంచి పట్టున్న స్థానాల్లో కనీసం కంటెస్టు కూడా చేయలేదంటే.. బిఆర్ఎస్ బిజెపి మధ్య బంధం ఎంత స్ట్రాంగ్‌గా కొనసాగుతోందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన స్కాములే.. బిజెపికి బిఆర్ఎస్ లొంగేలా చేశాయని కూడా ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ముఖ్యంగా కేటీఆర్, హరీష్ రావు, జోగినపల్లి సంతోష్ రావులపై అవినీతి ఆరోపణలు చిన్న పిల్లవాడికి కూడా తెలిసే విధంగా తెలంగాణలో కోడై కూశాయి. ఆయా ఆరోపణలకు సంబంధించిన పూర్తి ఆధారాలు కేంద్రం చేతిలో ఉండటంతో బిజెపి అధినాయకత్వం ఎప్పుడు తమను విమర్శించాలో.. ఎప్పుడు గమ్మున ఉండాలో.. చెప్పినప్పుడు చెప్పింది చెప్పినట్టు చేసుకువచ్చారు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్. దాదాపు పది సంవత్సరాలు బిజెపి బీఆర్ఎస్ మధ్యనే రాజకీయ వాతావరణం ఉండేలా రెండు పార్టీల మధ్యనే విమర్శలు, ప్రతి విమర్శలు చోటు చేసుకునేలా.. మీడియా స్పేస్ అంతా ఈ రెండు పార్టీల మధ్యనే ఉండేలా వ్యూహాత్మకంగా పొలిటికల్ వార్ డిజైన్ చేసుకొని మరి రాజకీయాలు చేశారు. అయితే బిఆర్ఎస్ నాయకులపై వచ్చిన అవినీతి ఆరోపణలే కాంగ్రెస్‌లో చేరిన రేవంత్ రెడ్డికి అనుకూలంగా మారి రేవంత్ చివరికి అధికారం చేపట్టేలా పరిస్థితులు మారాయి.

ఇక బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కేటీఆర్, హరీష్ రావు, జోగినపల్లి సంతోష్ రావులు అందిన కాడికి దోచుకుంటున్నారని తెలంగాణ వ్యాప్తంగా ఆరోపణలు గుప్పుమంటున్న క్రమంలో.. కెసిఆర్ కూతురు కవిత కూడా.. అధికారంలో, అక్రమ సంపాదనలో తన వంతు భాగస్వామ్యాన్ని షేర్ చేసుకునే విధంగా తండ్రి వద్ద మొరపెట్టుకున్నారని పలువురు చెవులు కొరుక్కున్నారు. ఈ క్రమంలోనే తెలంగాణలో కవిత ప్రభావాన్ని సైడ్ చేసేందుకు వ్యూహాత్మకంగా సెంట్రల్ పాలిటిక్స్‌కు కవితను పరిచయం చేసే విధంగా పావులు కదిపినట్టు.. తద్వారా ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌తో పరిచయాలు ఏర్పడటం అది కాస్త లిక్కర్ స్కామ్‌లో భాగస్వామ్యం ఉన్నట్టుగా కేంద్రం గుర్తించటం.. తగిన ఆధారాలను సంపాదించడం.. లిక్కర్ స్కామ్‌లో కవితను జైలుకు పంపించడం ఇవన్నీ చకచకా జరిగిపోయాయనీ పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ముఖ్యంగా కూతురు, కొడుకును కేసుల బారి నుంచి కాపాడుకునేందుకు కెసిఆర్ బిజెపి అధినాయకత్వం చేతిలో రిమోట్ కంట్రోల్ గా మారిపోయారని గత రెండు మూడు సంవత్సరాల పరిణామాలను గమనిస్తే అర్థమవుతుంది. ఈ రాజకీయ లొంగుబాటు ఎంత స్థాయికి దిగజారుతోందంటే.. బిజెపి చెప్పిన స్థానంలో బిఆర్ఎస్ డమ్మీ క్యాండిడేట్లను అభ్యర్థులుగా ప్రకటించి బిజెపి అభ్యర్థి గెలుపునకు బిఆర్ఎస్ పరోక్షంగా పూర్తిగా సహకరించే వరకు వచ్చిందని చెప్పవచ్చు.

ఇక ఈ బంధాన్ని ప్రస్తుతం కేసిఆర్ కూతురు కన్ఫర్మ్ చేయడంతో అసలు చర్చ మొదలైంది. అంతేకాదు బిజెపి బీఆర్ఎస్ బంధంపై ఓ అడుగు ముందుకేసి బిఆర్ఎస్ బిజెపిలో విలీనం కాబోతోందని అది 100కు 100 శాతం జరిగి తీరుతుందని కుండ బద్దలు కొట్టారు కవిత. అయితే బిజెపి రాష్ట్ర నాయకత్వం ఈ ప్రతిపాదనను సున్నితంగా ఖండిస్తోంది. అయితే, విలీనం కావాల్సి వచ్చినా.. మద్దతు తెలిపాల్సి వచ్చినా.. ఆ నిర్ణయాధికారం రాష్ట్ర నాయకత్వంపై ఆధారపడి ఉండదు అనే విషయం అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. బిజెపిలో బిఆర్ఎస్ విలీనం అవుతుంది అన్న కవిత వ్యాఖ్యలపై క్లారిటీ ఇవ్వాల్సింది ఇటు బిఆర్ఎస్ అధినాయకుడు కేసిఆర్, అటు కేంద్ర బిజెపి అధినాయకత్వం మాత్రమే.. ప్రస్తుతం ఈ రెండు పార్టీల అధినాయకత్వాలు ఈ ఆరోపణలపై ఏ విధంగా స్పందించలేదు. అంటే కవిత వాదనలో ఎంతోకొంత నిజం ఉందనే అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ బిజెపిలో బిఆర్ఎస్ విలీనం అయితే ఆ పరిణామం బిజెపికి కానీ. బిఆర్ఎస్‌కు కానీ.. లాభమా? నష్టమా? రెండు పార్టీలు విడివిడిగా ఉండి గత పది సంవత్సరాలు ఢిల్లీలో దోస్తీ గల్లీలో కుస్తీ అనే వ్యూహాన్ని



అనుసరించడం ద్వారా లాభమా? నష్టమా? ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి.

**విడివిడిగా ఉంటే లాభమెంత?**

ఈ విషయంలో ముందుగా రెండు పార్టీలు విడివిడిగా ఉండి ఢిల్లీలో దోస్తీ గల్లీలో కుస్తీ అనే వ్యూహం అమలు చేయడం ద్వారా ఎలాంటి ఫలితాలు వచ్చాయి? బిజెపి ఎంత మేర లాభపడింది? అనే విషయాన్ని ఒకసారి పరిశీలించినట్లయితే.. రాష్ట్ర అవతరణకు ముందు ఉమ్మడి రాష్ట్రంలో బిజెపి అంటే గ్రామస్థాయిలో కూడా కనీస పరిచయం లేని పార్టీగానే ఉండేది. కనీసం జిల్లా స్థాయి నాయకత్వం కూడా ప్రజలకు తెలిసేది కాదు అంటే అతిశయోక్తి కాదేమో. అలాంటి బిజెపి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి కెసిఆర్ ముఖ్యమంత్రిగా బీఆర్ఎస్ ప్రభుత్వం గద్దెనెక్కిన తర్వాత క్రమక్రమంగా బలపడుతూ వచ్చింది. 2014 సాధారణ ఎన్నికల్లో బిజెపి 5 ఎమ్మెల్యే స్థానాలు ఒక ఎంపీ స్థానాన్ని గెలుచుకుంది. అప్పుడు బిజెపి ఓట్ షేర్ చాలా చిన్న స్థాయి పార్టీలు.. అప్పుడే రాజకీయాల్లోకి అడుగుపెట్టిన పార్టీలకు సమానంగా ఉండేది. ఆ తర్వాత 2018 అసెంబ్లీ ఎన్నికల్లో గతం కంటే ఒక అసెంబ్లీ స్థానం తగ్గి ఒకే ఒక్క ఎమ్మెల్యే స్థానం మాత్రమే గెలుచుకున్నప్పటికీ.. ఓటు షేర్ మాత్రం 7.10 శాతం వరకు నమోదు చేసుకోగలిగింది. అనంతరం జరిగిన 2019 ఎంపీ ఎన్నికల్లో బిజెపి గత ఒక స్థానం నుంచి ఏకంగా నాలుగు స్థానాలకు ఎగబాకింది. అప్పుడు ఓటింగ్ షేర్ ఏకంగా 19.45 శాతంగా నమోదయింది. ఇక తాజా 2023 అసెంబ్లీ ఎన్నికల విషయానికొస్తే బిజెపి ఏకంగా 8 అసెంబ్లీ స్థానాలను గెలుచుకొని 13.90 శాతం ఓట్ షేర్ నమోదు చేసింది. ఇది గత బీజేపీ అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్ షేర్ కు చాలా అత్యధికం అని చెప్పవచ్చు. కాగా 2024 ఎంపీ ఎన్నికల్లో తెలంగాణలో ఉన్న సగం స్థానాలను అంటే ఏకంగా 8 స్థానాలను కైవసం చేసుకుని అనూహ్యంగా 35.08 శాతం ఓట్ షేర్ ను నమోదు చేసుకుంది. అంటే గత పదేళ్లలో తెలంగాణలో బిజెపి ఎదుగుదల కేవలం 5, 6 శాతం ఓట్ షేర్ నుండి ఏకంగా 35.08 శాతం వరకు ఎదిగిందని చెప్పవచ్చు. ఇదంతా బిఆర్ఎస్ బిజెపికి లొంగిపోయి పరోక్షంగా రాష్ట్రంలో మద్దతు తెలుపుతూ బిజెపి ఎదుగుదలకు సహకరించడం వల్లనే అనేది ఎవరు కాదనలేని వాస్తవం. రెండు పార్టీలు విడివిడిగా ఉండి ఢిల్లీలో దోస్తీ గల్లీలో కుస్తీ అనే వ్యూహాన్ని అనుసరించడం ద్వారా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభావాన్ని గణనీయంగా తగ్గించి.. బిజెపి ప్రధాన పార్టీగా ఎదిగి భారీగా లాభ పడిందని ఈ గణాంకాలను చూస్తే అర్థమవుతుంది. ఇక మునుముందు కూడా ఇలాంటి వ్యూహాన్ని అనుసరిస్తే కాంగ్రెస్ సైడ్ అయి అధికార, ప్రతిపక్ష హోదాలు ఈ రెండు పార్టీలే షేర్ చేసుకునే విధంగా పరిస్థితులు తయారయిపోవచ్చు అనే భావన కలుగక తప్పదు. ఒకవేళ ఈ రెండు పార్టీలు పొత్తు పెట్టుకుంటే అధికార పీఠాన్ని ఈజీగా కైవసం చేసుకునే వరకు పరిస్థితులు వచ్చాయి.

**విలీనం అయితే పరిస్థితులు ఎలా ఉంటాయి?**

అయితే రెండు పార్టీలు పొత్తు వ్యూహాన్ని అనుసరించకుండా బిజెపిలో బిఆర్ఎస్ విలీనం అయితే పరిస్థితులు ఎలా ఉంటాయి అనేది పరిశీలించినట్లయితే.. గత పది ఏళ్లలో బిఆర్ఎస్, కాంగ్రెస్ వ్యతిరేక ఓటును బిజెపి క్యాష్ చేసుకుంటూ రాష్ట్రంలో మూడో ప్రత్యామ్నాయ పార్టీగా ఎదిగిందని చెప్పవచ్చు. అయితే ఇప్పటికీ జిల్లా స్థాయిలో బిజెపికి సరైన నాయకత్వం లేదనే విషయం అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో బిఆర్ఎస్ కు జిల్లా స్థాయి నుండి గ్రామం, తండా, గూడెం లాంటి స్థాయిల్లో కూడా నాయకత్వం పటిష్టంగా ఉందని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అయితే బిఆర్ఎస్ బిజెపిలో విలీనం అయినంత మాత్రాన బిఆర్ఎస్ గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు దాని కేడర్ అంతా బిజెపిలోకి గంపగుత్తగా వచ్చేస్తుందని భావించడం మాత్రం మూర్ఖత్వమే అని భావించాల్సి ఉంటుంది. ఎందుకంటే.. ప్రజలకు జాతీయ పార్టీలకంటే ప్రాంతీయ పార్టీలపైనే ఎక్కువ నమ్మకం ఉంటుంది. నిన్నటి వరకు తెలంగాణ ప్రజలు తమ వాడు అనుకున్న కెసిఆర్.. తన పార్టీని బిజెపిలో విలీనం చేస్తే.. కేసుల నుంచి విముక్తి పొందేందుకు.. స్వార్థ ప్రయోజనాల కోసం.. పార్టీని చంపేసిన వాడిగా చరిత్రలో నిలిచిపోతారు.. రాష్ట్ర ఏర్పాటు నుంచి ఇప్పటివరకు తెలంగాణ ప్రజలు తమ వాడు అనుకున్న కేసీఆర్.. వెళ్లిన నిర్ణయంతో ప్రజలకు దూరమై పరాయి వాడు అయిపోతాడనే విషయం సుస్పష్టం. ఇక బీఆర్ఎస్ విలీన నిర్ణయాన్ని బిఆర్ఎస్ లోని మెజారిటీ నాయకత్వం, ఎమ్మెల్యేలు, ఎంపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు సైతం ఒప్పుకునే పరిస్థితిలు మాత్రం కనిపించడం లేదు. అలాంటి పరిస్థితుల్లో గులాబీ కేడర్ మనోభావాలకు వ్యతిరేకంగా కేసీఆర్ విలీన నిర్ణయమే తీసుకొని ముందుకు సాగితే.. అప్పుడు గులాబీ కేడర్ కు కెసిఆర్ కూతురు కవిత స్థాపించబోయే కొత్త పార్టీనే కొంత మేర దిక్కుగా మారుతుంది. అయితే కెసిఆర్, కేటీఆర్, హరీష్ రావు లాంటి మాస్ లీడర్షిప్‌ను బిలీవ్ చేసినంతగా కవిత నాయకత్వాన్ని గులాబీ కేడర్ విశ్వసించలేని పరిస్థితులు అధికంగానే ఉన్నాయి. బిఆర్ఎస్ బిజెపిలో విలీనం అయితే అత్యధిక శాతం గులాబీ కేడర్ కవిత నాయకత్వానికి కాకుండా.. బిజెపికి వ్యతిరేకంగా ఉండే కాంగ్రెస్ గూటికి చేరే అవకాశాలను కూడా కొట్టి పారేయలేం. అప్పుడు విడివిడిగా కూడబలుక్కొని రాజకీయాలు చేయడం ద్వారా పదేళ్లుగా లాభపడ్డ బిజెపి.. తెలంగాణ తెచ్చిన.. సమగ్ర అభివృద్ధిని చేసి చూపించిన.. బలమైన ప్రాంతీయ పార్టీని నిర్వీర్యం చేసి.. తమకు దూరం చేసిందని అభిప్రాయం ప్రజల్లో కలిగి.. బిజెపికి ప్రజలు మరింత దూరం అయ్యే అవకాశాలు.. అదే ప్రజలు కేసీఆర్ కూతురు కవిత పెట్టే కొత్త పార్టీకి దగ్గర అయ్యే అవకాశాలను కూడా కొట్టి పారేయలేనిది. అప్పుడు బిజెపి అంటే తెలంగాణకు ద్రోహం చేసిన పార్టీగా చరిత్రలో మిగిలిపోతుందేమో.. ఎందుకంటే గత పది ఏళ్లలో బిజెపిని ఆదరిస్తున్న తెలంగాణ ప్రజలకు బిజెపి ఇచ్చిన వరాలు మాత్రం పెద్దగా చెప్పుకునే స్థాయిలో లేవని చెప్పవచ్చు. అదీగాక తెలంగాణలో రాజకీయ పెనుమార్పులకు బిజెపి పూనుకొని బిఆర్ఎస్‌ను తమ పార్టీలో విలీనం చేసుకుంటే.. నిన్నటి వరకు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుల అవినీతిని ప్రశ్నించిన బిజెపి విశ్వసనీయత రాష్ట్రంలో ప్రశ్నార్థకంగా మారుతుంది. తాము అవినీతి పార్టీగా.. అవినీతి నాయకులుగా ముద్ర వేసిన వాళ్లనే తిరిగి పార్టీలో విలీనం చేసుకోవడం ద్వారా బిజెపి విశ్వసనీయతపై ప్రజల్లో చులకన భావం ఏర్పడుతుంది. ఈ క్రమంలో రాష్ట్రంలో బిజెపికి ఆదరణ తగ్గిపోయే అవకాశాలు ఉన్నాయి. ఇక వెళ్ళిన నిర్ణయం ద్వారా తెలంగాణలో కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుల ప్రతిష్ట కూడా భారీగా దెబ్బతింటుందని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఎందుకంటే 25 సంవత్సరాల చరిత్ర కలిగిన తెలంగాణ తెచ్చిన పార్టీని రాజకీయ ఒత్తిడిలకు లొంగి.. నిన్నటి వరకు పరుష పదజాలంతో తీవ్ర విమర్శలు ఎక్కుపెట్టి అదే పార్టీలో విలీనం చేస్తే ఆ నాయకులకు రాష్ట్రంలో ఆదరణ ఎలా ఉంటుంది? అనే విషయాలను అర్థం చేసుకోవలసిన అవసరం ఉంది. మొత్తం మీద బీజేపీ బీఆర్ఎస్ బంధం గత పదేళ్లుగా ఎలా ఉందో అలా కొనసాగిస్తేనే ఇరు పార్టీలు లాభపడతాయని.. పొత్తుతో ముందుకు సాగినా.. పెద్దగా నష్టం ఉండదని చెప్పవచ్చు. అలా కాకుండా విలీనం జరిగితేనే చెరిపేసుకోలేని చారిత్రక తప్పిదానికి నాంది పలికినట్లు అయి.. రాష్ట్రంలో అటు కెసిఆర్, ఇటు బిజెపి ప్రతిష్ట కోల్పోయి ప్రజాదరణ తగ్గి అది.. ఇరు పార్టీల ఓటు బ్యాంకు దెబ్బతిని.. ప్రత్యామ్నాయ బలమైన శక్తిగా మారెందుకు మళ్ళీ కాంగ్రెస్ కు అవకాశం ఇచ్చినట్టే అవుతుందని చెప్పవచ్చు.

- శ్రీనివాస్ గుండోజు
99851 88429

## మేఘం చెట్టు . . .

పైన పెద్ద మేఘం! కింద చిన్ని మొలక!
మొలకను చూస్తే మేఘానికి పులకరింత
చినుకు సంత!
మబ్బు వాన వానగా మొలక చుట్టూ మడుగు
నీరు మబ్బు మొక్కా రెండూ కలిసి వృక్షంగా
ఊడలు ఊడలుగా నీడలు
పెరుగుతుంటే మైదానం చాలటం లేదు!
ఎక్కడి పక్షులైన ఈ వృక్షం పైనే టికానా!
కొమ్మల పై గానా బజానా!
విదేశీ పక్షులకు ఈ చెట్టు గ్రీన్ కొమ్మ ఇచ్చేసింది -
ఎన్ని కొమ్మలో అన్ని గూళ్లు
గూళ్ల నిండా గుడ్లు అంతా వృక్ష సంతానం!
అందరికీ తల్లి చెట్టు!
కనిపించే చెట్లన్నీ నీటి మబ్బులే!
ఒక వృక్షం పెరగాలంటే ఎన్నెన్నో వాన కాలాల
కారు మేఘాలు వేర్లు వేర్లుగా మట్టిలోకి ఇంకి పోవాలి
ఔను! మేఘం భూమి పై కురిస్తే చెట్టౌతుంది
అందుకే ఆకాశం భూమి పైకి వంగినట్లుంటుది

- కందాళై రాఘవాచార్య
8790593638

## రష్యా, ఉక్రెయిన్‌ల యుద్ధం ఆగదా?

రష్యా,ఉక్రెయిన్ దేశాధినేతలు వ్లాదిమిర్ పుతిన్, జెలెన్స్కీలు ఇద్దరు యుద్ధం వైపే మక్కువ చూపుతున్నట్లు ఉన్నారు. ఒకరి అంగీకారం మరొకరికి సమ్మతం కావడం లేదు. ఒకరు నెల రోజులు కాల్పుల విరమణ అంటే, మరొకరు కేవలం రెండు, మూడు రోజులే అంటుంది. ఇలా పరస్పర బేషాజాలు పోతే ఎవరికైనా విసుగు వస్తుంది. అందుకే నేమో ఉక్రైన్ మునుపెన్నడు లేని దాడులు చేసింది. ఆ దాడిలో రష్యా నష్టపోయినా సరైన వివరణ ఇవ్వడం లేదు.రష్యా ను కోలుకోలేని దెబ్బ తీశామని జెలెన్ స్కి వ్యాఖ్యానించాడు. ఈ దిశలో ఆ దేశ సెక్యూరిటీ సర్వీస్ చీఫ్ మాలిక్ ను అభినందించాడు. రష్యా పై అతి పెద్ద దాడి చేసిన ఉక్రైన్ ఇది తమ అతి పెద్ద విజయం అని పేర్కొంది. ఇలా ఒకరి భూభాగాల నుంచి మరొకరు దాడి చేసుకుంటున్న తరుణంలో ఇస్తాంబుల్ లో శాంతి చర్చలు ఫలితాలు ఇవ్వలేదు. ఉక్రైన్ ముప్పై రోజులు కాల్పుల విరమణ అంటే రష్యా ససేమిరా అంటోంది.అయితే ఒక అంగీకారం కుదరడం యుద్ధం ఆగిపోతుందనే ఆశ మిణుకు, మిణుకు మంటోంది. అదేమంటే యుద్ధ ఖైదీల మార్పిడి, యుద్ధంలో మరణించిన వారి మృత శరీరాలను అప్పగింత లో ఒక్కటే అంగీకారం కుదిరింది.ఈ విషయం ఉక్రైన్ రక్షణ మంత్రి ఉమెరోవ్ చెప్పడం ముదావహం. కాని ఆదివారం ( జూన్ 1) నాటి దాడులలోఆపరేషన్



స్పైడర్ వెబ్ కు ప్రతిగా రష్యా భీకర దాడులు చేస్తోంది. అందుకు ఉక్రైన్ మేము ఆదివారం చేసిన దాడులలో దాదాపు ఒక వెయ్యి మంది కి పైగా రష్యా సైనికులు మరణించారని చెప్పటం గమనార్హం. దీనిపై రష్యా పెదవి విప్పక పోవటం అనుమానాలకు తావిస్తోంది. ఇలా కాల్పులు, ప్రతి కాల్పుల తో ఇక శాంతి చర్చలకు అవకాశం ఎక్కడ ఉంటుంది? రెండు దేశాల మధ్య యుద్ధం ఆగిపోతుంది అనేది ఇప్పట్లో జరిగేది కాదు. ఏదయినా అద్భుతం జరిగితే తప్పా. అటు ఉక్రైన్ కు ఇటు రష్యాకు ఎవరు శాంతి చర్చలు జరిపిన ఫలితం శూన్యం. ఒక వేళ భారత్ మాత్రం నడుం బిగిస్తే యుద్ధం ఆగిపోయే అవకాశం ఉండొచ్చు. కాని భారత్, పాక్ మధ్య పొరా పొచ్చలు రావడంతో భారత్ మిన్న కుండి పోయింది. భారత్ చెబితే రష్యా వినాల్సిందే. ఎందుకంటే ఇరు దేశాల మధ్య మైత్రి అటువంటిది. నేను అధికారంలోకి వస్తే ఒక్క రోజులోనే రష్యా, ఉక్రైన్ యుద్ధం ఆపుతానని చెప్పిన అమెరికా అధ్యక్షుడి మాటలు నీటి మూటలే అయ్యాయ్. ఇక భారత్ అలస్యం చేయకుండా రంగం లోకి దిగాలి. రష్యా, ఉక్రైన్ శాంతి చర్చలలో ప్రధాన భూమిక పోషించాలి. అంతర్జాతీయ పరంగా భారత్ పేరు మర్మోగుతుంది. పాక్ పై నిఘా పెట్టే భారత్,రష్యా, ఉక్రైన్ యుద్ధం తీవ్రం కాకుండ నిరోధించవలసిన ఆవశ్యకత ఉంది. యుద్ధం త్వరలోనే ఆగుతుందని భారత్ విజయం సాధిస్తుందని ఆశీద్దాం.లేకపోతే దేవుడే యుద్ధం ఆపాలి.

- కనుమ ఎల్లారెడ్డి
93915 23027

## అవసరం

అవసరమే జగతిని నడిపిస్తుంది...
ఆ అవసరమే మనిషిని బ్రతికిస్తుంది...
కూడు, గూడు, గుడ్డ,
కనీస అవసరాలు...
అయినా మనుషులకు
ఇంకేదో అవసరం...
అదేమిటో వాళ్ళకే తెలియదు...
నవ్వుతూ పలకరించారంటే..
ఏదో అవసరం పడే ఉంటుంది...
బాగోగులు విచారించారంటే
చాట భారతమంత అవసరమేదో ఉండే ఉంటుంది...
మనిషికి మనిషి తోడుండాలి...కానీ
మనీ తోడుంటేనే తోవ కనిపిస్తుంది...
ఎప్పుడో అప్పుడు అవసర పడతాడనుకుంటేనే
బంధాలైనా బంధుత్వాలైనా...
స్నేహాలైనా... సాయాలైనా...
ధనం మూలం మిదం జగత్ పాత మాట, అవసరం
మూలం మిదం జగత్ సరికొత్త పాట.

- ఆశన్న గారి ఆనందీశ్వర రెడ్డి
8179191999

# కాలుష్యాన్ని అరికట్టండి



విశ్వంలో జీవరాశుల మనుగడకు. మూలాధారం అయిన గాలి, నిప్పు,నీరు, నింగి, నేల అనే పంచ భూతాలను ప్రకృతే ఈ విశ్వానికి అందించింది. పంచ భూతాల నిష్పత్తి లో సమతౌల్యత లోపించి మానవ జీవనం అస్తవ్యస్తమౌతుంది. మానవాళి పలు విపత్తులకు గురౌతుంది . ప్రకృతి వాతావరణ పర్యావరణ సమతుల్యత మానవ మనుగడకు అవసరం.ఆధునికీకరణ, పారిశ్రామికీ కరణ, పట్టణీకరణ, శీఘ్రంగా విస్తరిస్తున్న కార్పొటీకరణ, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో సంభవిస్తున్న పరిణామాలు మానవుని స్వార్థపరత్వం ప్రకృతి విధ్వంసం దిశగా కొనసాగడం శోచనీయం.

ప్రకృతి పరిరక్షణ కోసం చేపట్టాల్సిన చర్యల గురించి చర్చించడానికి ప్రపంచ దేశాలన్నీ ఒకచోట చేరి నష్ట నివారణ చర్యల గురించి చర్చలు జరపడానికి ప్రతి ఏడాది జూన్ 5వ తేదీ ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకుంటారు. ప్రపంచ ప్లాస్టిక్ కాలుష్యని అంతం చేయడం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ విధానాలు తగ్గించడం పైన దృష్టి పెట్టాలి స్థిరమైన ప్రత్యామ్నాయాలను స్వీకరించడాన్నీ ప్రోత్సహించాలి.

మానవుడు తన భౌతిక అవసరాల కోసం తరతరాల ప్రకృతిని విధ్వంసం చేస్తున్నాడు. ప్రకృతి మీద ఆధిపత్యం సాధిస్తున్ననానే మాయలో పడి మానవ మనుగడకు ఆధారమైన ప్రకృతి రక్షిస్తే అది మనలను రక్షిస్తుంది అన్న వాస్తవాన్ని మరిచిపోవడం వల్ల మానవ జాతి అనేక విపత్తులు ఎదుర్కోవడం గమనార్హం.

19వ శతాబ్దం నుండి మానవ తప్పిదాల వల్ల ప్రకృతి విధ్వంసానికి గురౌతుంది. ప్రకృతిలో మానవుడు తప్ప మిగతా జీవులు ప్రకృతి చెప్పినట్లు ప్రవర్తిస్తున్నాయి. ప్రకృతికి భిన్నంగా నడిచే మానవుడు చేసే ప్రతికూల చర్యల వలన ఏపాపం ఎరుగని మూగ జీవాలు భారీమూల్యం చెల్లించవలసి వస్తుంది. జీవావరణ రంగాల్లో మానవుడు సాధించిన శాస్త్ర, సాంకేతికత.. దానివల్ల కలిగిన మార్పులు మాత్రం ప్రకృతి స్వచ్ఛతకు ఉనికికి ముప్పుగా పరిమించాయి. ఒక పక్క వ్యవసాయ రంగములో హరిత విప్లవం తర్వాత అధిక దిగుబడులు పెంచేందుకు అధిక ఉత్పాదకత పేరున విచ్చలవిడిగా వినియోగించిన రసాయనిక ఎరువులు, క్రిమిసంహరక మందుల వాడకం ఎక్కువైంది దీనివల్ల పంట దిగుబడి పెరిగింది కాని ప్రకృతి మాత్రం కలుషితమైందని పలు అధ్యయనాలు వెల్లడించాయి. వ్యవసాయ రంగంలో ఉపయోగిస్తున్న క్రిమి సంహారక మందులు ప్రజారోగ్యనికి ప్రమాదకరంగా పరిణమించింది. మరోపక్క అతి నీల లోహిత కిరణాల నుండి మానవులను కాపాడే 'ఓజోన్' పొరలో ఏర్పడిన రంధ్రాలు రాను రాను విస్తరిస్తున్నాయి. మానవ మనుగడకు వీటికి తోడు పట్టణీకరణ,పారిశ్రామిక విప్లవం, జనాభా పెరుగుదల, రియల్ ఎస్టేట్ వ్యాపారం,అడవుల నరికివేత సహజ వనరుల విధ్వంసం, ఇసుక మాఫియా మితి మీరిన ప్లాస్టిక్ వాడకం ప్రకృతిని నాశనం చేస్తున్నాయి.

కేంద్ర, రాష్ట్ర,స్థానిక ప్రభుత్వాలు అభివృద్ధి పేరున భారీ ప్రాజెక్టులను కాలుష్య కారక పరిశ్రమలను స్థాపిస్తూ పర్యావరణ విధ్వంసానికి పాల్పడడం గమనార్హం. దీనివల్ల అనేక సంఖ్యలో వృక్ష జాతులు జంతు జాతులు అంతరించాయి. మరికొన్ని అంతరించి పోతున్న జాబితాలోకి చేరాయి. మానవుడు ఉన్నన్ని రోజులు ప్రకృతి వనరులను ఉపయోగించుకోవాలి. తర్వాత తరానికి అందించాలి. ప్రకృతి వనరు



లు తరతరాల వారసత్వ సంపద వాటిని రక్షించాలి. భావి తరాల కోసం వీటిని భద్రపరచాలి. విధ్వంసం చేయ కూడదు. వనరులను అనుభవించే హక్కు మాత్రమే వుంది. సమస్త జీవకోటితో నిండిన ప్రకృతిని సమిష్టిగా పంచుకోవాలి.

గడచిన తరాలు ప్రకృతి వనరులను పొదుపుగా వాడుకున్నారు. ప్రకృతి పర్యావరణాన్ని సంతులిన పద్ధతిలో ఉపయోగించారు. ఆధునికీకరణ పేరుమీద ప్రకృతి సహజ వనరులను విచక్షణ రహితంగా అపరిమితంగా వినియోగిస్తూ పరిమిత వనరులను కాలుష్యం చేస్తూ భావి తరాల వారికి ఆర్థిక, ఆరోగ్య సమస్యలను కానుకగా ఇస్తున్నాం. వారసులకు సంపద ఇవ్వాలని పోటీ పడుతున్న సమాజంలో ప్రకృతి పర్యావరణాన్ని ఇవ్వాలన్న స్పృహ లోపించింది.

విచక్షణా రహితంగా అటవీ సందను ధ్వంసం చేయడం కొల్ల గొట్టడం వల్ల33 శాతం వుండాల్సిన అడవులు నేడు దేశంలో 21 శాతానికి మించి లేవు. సగటున రోజుకు 333 ఎకరాల అటవీ భూమి అదృశ్యమై పోతున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. విచక్షణ రహితంగా అటవీ సంపదను విధ్వంసం చేయటం వల్ల ప్రకృతి విపత్తులు, అకాల వర్షాలతో అపారమైన ఆస్తినష్టం ప్రాణ నష్టం సంభవిస్తుంది. గాలి కాలుష్యం వల్ల ప్రతి యేటా 70లక్షల మంది మృత్యువాత పడుతున్నారని వరల్ హెల్త్ ఆర్గనైజేషన్ తన నివేదికలో వెల్లడించింది. వరదలు,వానల వల్ల కలుషితమైన నీరుతాగి రోగాల బారిన పడి యేటా 2లక్షల మంది చనిపోతున్నరాని నీతి ఆయోగ్ గణాంకాలు తెలియ చేస్తున్నాయి. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల విస్తరణ వల్ల 85 శాతం చిత్తడి నేలలను ప్రపంచం కోల్పోయింది. 75 శాతం భూఉపరితలం మార్పుకు లోనయ్యింది. 66 శాతం సముద్ర విస్తీర్ణం ప్రభావితమైందన్న అధ్యయనాంశాలు ఆందోళన కలిగిస్తున్నాయి.

ఆధునిక సౌకర్యాల పేరు మీద మానవుడు విలాస జీవితానికి అలవాటుపడి కాలుష్య కారకమైన వస్తువులను ఉపయోగిస్తూ పర్యావరణానికి హాని చేస్తున్నాడు. పారిశ్రామికీకరణ పట్టణీకరణ విస్తరణ ఫలితంగా వాతావరణంలోకి అపరిమిత కర్బన ఉద్గారాలు విడిచి పెట్టడంవల్ల భూగోళం అగ్నిగోళంగా మారి ఓజోన్ పొర క్షీణతకు ప్రత్యక్షంగా కారణం కావడం అంతే గాకుండా మనకు ఊపిరిని ఇచ్చే వాయువును కూడ కాలుష్య భరితం చేశాం. నదీ జలాలు కలుషితమై తాగునీటి కోరత ఏర్పడింది. పంటల దిగుబడి లోకీలకపాత్ర పోషించే తేనెటీగలు, ఊరపిచ్చుకలు అంతరిస్తున్నాయి. పంటల దిగుబడి తగ్గి ఆహారోత్పత్తి కొరత ఏర్పడి ఆహార విపత్తు ఏర్పడే ప్రమాదం ఉందని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. ప్రస్తుత పరిస్థితులను పరిశీలించిన ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్సర్వేషన్ ఆఫ్ నేచర్ అనే అంతర్జాతీయ సంస్థ పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యతులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. ప్రకృతి పర్యావరణం పట్ల జరుగుతున్న నిర్లక్ష్యం విధ్వంసం ఇలాగే కొనసాగితే ప్రపంచంలోని ప్రతి నాలుగు జీవజాతుల్లో ఒకటి అంతరించిపోయే దశలో ఉన్నట్లు అభిప్రాయపడింది.

మానవుడు తన మేధస్సు ద్వారా అనేక పరిశోధనలు చేశాడు. ఆధునిక శాస్త్ర సాంకేతిక విజ్ఞానం ద్వారా అనేక ఆవిష్కరణలు చేశాడు. ఆధునిక టెక్నాలజీ వల్ల ఎంతో ప్రగతి' పురోగతి అభివృద్ధి సాధించాడు. సాధించిన ప్రగతి ప్రకృతి పర్యావరణ వినాశన కరంగా పరిణమించింది. ప్రకృతిని రక్షించుకునే స్థితి రోజు రోజుకు క్షీణిస్తుంది.దీనివల్ల ప్రకృతి వైపరీత్యాలు సంభవించి ఋతువులు గతి మారుతున్నాయి. ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగి పోతున్నాయి.వరదలు తుఫానులు, భూకంపాలు అగ్నిపర్వతాలు,సునామీలు మానవ జాతిని భయ పెడుతున్నాయి .కరోనా లాంటి ప్రాణాంతక వైరస్లు సులువుగా విజృంభించి మానవ జాతిని మృత్యు కుహరంలోకి నెట్టినప్పటికి ప్రకృతి విధ్వంసాన్ని అదుపు చేయక పోవడం శోచనీయం.

పర్యావరణ రక్షణ ప్రతివ్యక్తి జీవనంలోఅంతర్భాగం కావాలి. ప్రకృతి రక్షణే మానవాళి రక్షణ అన్నది నినాదం కాకుండా ప్రజల జీవన విధానం కావాలి.భావి తరానికి స్వచ్ఛమైన ప్రకృతిని బహుమతిగా ఇద్దాం. ప్రకృతి రక్షణ మనందరి కోసం.. భావి తరాల కోసం.. మనిషి మనుగడ కోసం.

**(జూన్5 ప్రపంచ పర్యావరణ దినోత్సవం)**

- నేదునూరి కనకయ్య
9440245771

# ఆత్మగౌరవానికి ప్రతీక సొంత ఇల్లు



- నిరుపేద వారి చిరకాల స్వప్నం సాకారం దిశగా ఇందిరమ్మ ఇండ్లు...
- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిన ప్రజా ప్రభుత్వం...
- పేదవారికీ అండగా నిలబడిన ప్రజా ప్రభుత్వం
- శరవేగంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు
- మాట నిలబెట్టుకున్న ప్రజా ప్రభుత్వం
- ఇచ్చిన హామీ మేరకు దశలవారీగా నగదు జమ
- లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రూ. కోటి 36 లక్షల సాయం జమ
- ఆనందం వ్యక్తం చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు
- ఇండ్ల మంజూరు పత్రాల జారీలో రాష్ట్రంలో రాజన్నసిరిసిల్ల జిల్లా ఫస్ట్

రాజన్న సిరిసిల్ల, జూన్ 4 ( మనం ప్రతినిధి): పేదవారి ఆత్మగౌరవానికి ప్రతీక సొంత ఇల్లు ఈ చిరకాల స్వప్నం సాకారం దిశగా ప్రజా ప్రభుత్వం సహకారంతో అడుగులు వేగంగా పడుతున్నాయి. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు శరవేగంగా ముందుకు సాగుతున్నాయి. లబ్దిదారులకు ఇసుక ఉచితంగా అందిస్తోంది ప్రభుత్వం. మొదటి దఫాలో ఇండ్లు పూర్తి చేసుకుంటున్న వారి బ్యాంకు ఖాతాల్లో రూ. కోటికి పైగా మంజూరు చేసి రాష్ట్ర ప్రభుత్వం భరోసాగా నిలుస్తున్నది. ఇండ్ల మంజూరు పత్రాల జారీలో రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో నిలిచింది.సొంత ఇల్లు నిర్మించుకోవాలని ప్రతి ఒక్కరి చిరకాల స్వప్నం. ఈ కల సాకారానికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకానికి రూపకల్పన చేసింది. మొదటి విడుతలో ఇంటి స్థలాలు ఉన్న వారికి రూ. ఐదు లక్షల ఆర్థిక సహాయాన్ని నాలుగు దశల్లో అందజేస్తున్నది. 400 చదరపు అడుగుల నుంచి 600 చదరపు అడుగులలోపు ఇంటి నిర్మాణం చేసుకోవాల్సి ఉంటుంది. 4 దశల్లో గ్రీన్ చానల్ ద్వారా ఆర్థిక సహాయం అందు తుంది. బేస్మెంట్ నిర్మాణం పూర్తైన తర్వాత లక్ష రూపాయల, గోడలు నిర్మిస్తే లక్ష రూపాయలు, స్లాబ్ నిర్మించిన తరువాత 2 లక్షల రూపాయలు, ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మరో లక్ష రూపాయలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతాయి.

**నిర్మాణాలకు ఇసుక ఉచితం..**

ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుంది. నిర్మాణానికి అవసరమైన ఇసుక అందుబాటులో పెట్టి ఉచితంగా అందిస్తుంది. ఇంటి నిర్మాణానికి ఒక్కో దశలో అవసరమైన ఇసుక కోసం సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శి/ మున్సిపాలిటీల పరిధిలో వార్డ్ ఆఫీసర్స్ తమ తహసీల్దార్ దృష్టికి ముందస్తుగా తీసుకెళ్లాలి. ఇసుక ఉచితం.. రవాణా ఛార్జీలు నిర్మాణదారులు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే సిమెంటు, స్టీల్ ధరలు తగ్గించాలని ఆయా కంపెనీల యాజమాన్యాలతో రాష్ట్ర ప్రభుత్వం చర్చిస్తోంది. దీంతో లబ్దిదారుల నిర్మాణ ఖర్చు మరింత తగ్గనుంది. నిరుపేదలకు పెట్టుబడి లేని పక్షంలో స్వయం సహాయక మహిళా సంఘాలు, మెప్మా ద్వారా లక్ష రూపాయల రుణం అందించే ఏర్పాట్లు చేసారు

**11 మండలాల్లో మోడల్ హౌస్ లు..**

రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ఇండ్ల నిర్మాణం, గదులు తదితర అంశాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ముందుగా జిల్లాలోని ఆయా చోట్ల మోడల్ హౌస్ లు నిర్మించాలని ఆదేశాలు జారీ చేసింది.జిల్లాలోని 11 మండలాల్లో మోడల్ నిర్మాణాలను మొదలు పెట్టారు గృహ నిర్మాణ శాఖ అధికారులు. ఆయా ఇండ్లు తుది దశకు చేరుకున్నాయి.

**రూ. కోటి 36 లక్షలకు పైగా సాయం మంజూరు...**

జిల్లాకు మొదటి విడుత కింద 1061 ఇండ్లు గ్రౌండింగ్ పూర్తి అయింది. వీటిలో బేస్మెట్ లెవెల్ లో 105, రూఫ్ లెవెల్ లో 31లో ఉన్నాయి. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించు కుంటున్న లబ్దిదారుల బ్యాంక్ ఖాతాల్లో ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని ఎవరి ప్రమేయం లేకుండా జమ చేసింది. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల జారీలో రాష్ట్రంలో జిల్లా ఫస్ట్.....ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల జారీలో రాజన్న సిరిసిల్ల జిల్లాను ప్రథమ స్థానంలో నిలిచింది. జిల్లాకు మంజూరు అయిన 7862 ఇండ్లకు గాను 7828 అలాట్మెంట్ ఆర్డర్లు లబ్దిదారులకు అందజేశారు. వేములవాడ నియోజకవర్గంలో ఫేజ్-1,2 లో కలిపి 2575 ఇండ్లు, సిరిసిల్ల నియోజకవర్గంలో ఫేజ్-1,2 లో కలిపి 3608 ఇండ్లు, చొప్పదండి నియోజకవర్గంలోని బోయినపల్లి మండలంలో ఫేజ్-1,2 లో కలిపి 820 ఇండ్లు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మేడిపల్లి సత్యంతో కలిసి, మానకొండూర్ నియోజకవర్గంలోని ఇల్లంతకుంట మండలంలో ఫేజ్-1,2లో 805 ఇండ్ల మంజూరు పత్రాలు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి కలెక్టర్ పంపిణీ చేశారు. ఇటీవల కరీంనగర్ ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశాన్ని కరీంనగర్ లో నిర్వహించగా, జిల్లా ఇంచార్జ్ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు హాజరై ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల జారీలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపేలా విశిష్ట సేవలు అందించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝాను అభినందించారు.

**రాష్ట్ర ప్రభుత్వం అందించే సాయంతో: కత్తెర లక్ష్మి, 8వ వార్డ్ పెద్దూర్, సిరిసిల్ల మున్సిపాలిటీ**



చాలా ఏండ్లుగా సొంత ఇల్లు కట్టుకోవాలి అనేది చూస్తున్న. మాకు రేకుల ఇల్లు ఉండేది. ఇల్లు కట్టుకునే పరిస్థితి లేక ఆగినం. రాష్ట్ర ప్రభుత్వం అందించే సాయంతో నేను ఇల్లు కట్టుకుంటున్న. బేస్మెంట్ కట్టిన రూ. లక్ష రూపాయలు నా బ్యాంక్ ఖాతాలో పడ్డయి. సీఎం రేవంత్ రెడ్డి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు కృతజ్ఞతలు.

**రెండు లక్షలు పడ్డయి: ద్యావ సూర్యమ్మ, వెంకటాంపల్లి, వేములవాడ మండలం**



నా గూనల ఇల్లు కూలింది. మస్తు ఇబ్బంది పడ్డం. శీనన్నను కలిసి ఇల్లు అడిగినం. ఇందిరమ్మ ఇల్లు ఇప్పించిండు. ముగ్గు పోసి.. కట్టుకుంటున్న. బేస్ మీట్ అయి, గోడలు లేసినయి. నా బ్యాంక్ అకౌంట్ల రెండు లక్షల రూపాయలు పడ్డయి. నా ఇల్లు కట్టుకునేందుకు సాయం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కి కృతజ్ఞతలు.

**పైరవీ అవసరం లేదు: సందీప్ కుమార్ ఝా, కలెక్టర్ రాజన్నసిరిసిల్ల...**



జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల కోసం ఎవరి పైరవీ అవసరం లేదు. నాలుగు దశల్లో లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా ఆర్థిక సహాయం జమవుతుంది. వీటి కోసం ఎవరినీ సంప్రదించవద్దు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణదారులకు పూర్తి సహకారం అందిస్తాము. ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తిచేసుకుని రానున్న దసరా దీపావళి పండుగలను నూతన గృహాలలో జరుపుకోవాలని లబ్ధిదారులను కోరుతున్నాను

**ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి: ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**



ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణదారులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే ఈ ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. సొంత ఇంటి కలను సాకారం చేసుకోవాలి. గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇటీవల పర్యటనలో జిల్లాకు అదనంగా 1750 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశారు. దీంతో మరింత మందికి ఇందిరమ్మ ఇండ్లు కట్టుకునే అవకాశం వచ్చింది.

## రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు వెనువెంటనే పరిష్కరించాలి

- కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



హుజురాబాద్, జూన్ 4 (మనం న్యూస్): జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాలలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులపై విచారణ జరిపి వెనువెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. హుజురాబాద్ మండలం కనుకులగిద్దె గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన భూభారతి నూతన రెవెన్యూ చట్టం గ్రామ రెవెన్యూ సదస్సుకు జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భూభారతి నూతన రెవెన్యూ చట్టం ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుందని అన్నారు. భూ సమస్యలు ఉన్న ప్రజలు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను రెవిన్యూ అధికారులు పక్కాగా రికార్డు నమోదు చేయాలని అన్నారు. తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించదగిన దరఖాస్తులను వెనువెంటనే పరిష్కరించాలని అన్నారు. జూన్ 20వ తేదీ వరకు అన్ని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నామని, భూ సమస్యలున్న ప్రజలు ఈ రెవెన్యూ సదస్సులకు హాజరై దరఖాస్తు సమర్పించాలని సూచించారు. కనుకులగిద్దె గ్రామానికి చెందిన అర్జీదారుల సమస్యలను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు, అధికారులకు కొన్ని సూచనలు సలహాలు ఇచ్చారు. స్వీకరించిన దరఖాస్తులకు రసీదులు ఇవ్వాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సులో హెల్ప్డెస్క్, రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించారు. సమస్యల వారీగా అర్జీలను విభజించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి రమేష్ బాబు, తహసిల్దార్ కనకయ్య, రెవెన్యూ సిబ్బంది, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

## బాలికలు జీవితంలో గొప్ప స్థాయికి చేరుకోవాలి

- 120 మంది బాలికలకు నెల రోజులు పైగా ఎన్టిపిసి ద్వారా వర్క్ షాప్ నిర్వహణ
- ఎన్టిపిసి సంస్థ చేసే మంచి పనులు ప్రజలకు చేరేలా కార్యాచరణ
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష





రామగుండం, జూన్ 4 (మనం న్యూస్): బాలిక సాధికారత వర్క్ షాప్ లో పాల్గొన్న 120 మంది బాలికలు జీవితంలో గొప్ప స్థాయికి చేరుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆకాంక్షించారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి జిల్లా ఎన్టిపిసి ఈడిఎం ఆడిటోరియంలో నిర్వహించిన బాలికా సాధికారత మిషన్ వర్క్ షాప్ 2025 ముగింపు వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, పెద్దపల్లి జిల్లా పరిధిలో ఎన్టిపిసి సంస్థ ఏర్పాటు చేసి 50 సంవత్సరాల పాటు నిర్విరామంగా ప్రజలకు అవసరమైన విద్యుత్ ఉత్పత్తి విజయవంతంగా చేస్తూ దేశ అభివృద్ధికి బాటలు వేయడం పట్ల తనకు పెద్దపల్లి జిల్లా కలెక్టర్ గా ఎంతో గర్వంగా ఉందని అన్నారు. ఎన్టిపిసి సంస్థను సమర్థవంతంగా నిర్వహిస్తున్న యాజమాన్యానికి, ఉన్నత అధికారులు, సిబ్బందికి కలెక్టర్ అభినందనలు తెలిపారు. బాలికా సాధికారత మిషన్ వర్క్ షాప్ 2025 క్రింద 120 మంది బాలికలకు 30 రోజుల పాటు శిక్షణ అందించారని తెలిపారు. బాలికలు శిక్షణ ముగిసిన తర్వాత మంచి ఆత్మవిశ్వాసం స్పష్టంగా తెలుస్తోందని, ఇట్టి మార్పు సాధ్యం చేసిన ఎన్టిపిసి సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. బాలికా సాధికారత మిషన్ వర్క్ షాప్ 2025 ను పూర్తి చేసుకున్న బాలికలు ఇతరులకు ఆదర్శంగా నిలవాలని, రాబోయే 5,10 సంవత్సరాల తర్వాత 120 మంది బాలికలు గొప్ప స్థాయికి ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. బాలికలు తమ జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు చిత్తశుద్ధితో కృషి చేయాలని, ప్రతి రోజూ రెగ్యులర్ గా లక్ష్యం వైపు కొంత సమయం సాధన చేయాలని అన్నారు వర్క్ షాప్ విజయవంతం చేయడంలో కీలకపాత్ర పోషించిన సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. ఎన్టిపిసి సంస్థ అనేక మంచి పనులు చేస్తుందని, వీటికి విస్తృత ప్రచారం కల్పించాలని, అదే విధంగా ప్రజలలో ఎన్టిపిసి ఏం చేయడం లేదు అనే అభిప్రాయాన్ని తొలగించేందుకు కృషి చేయాలని, మనం చేసే మంచి పని ప్రజలకు చేరడం కూడా అంతే ముఖ్యమని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్టి.పి.సి.ఈ.డి చందన్ కుమార్ సామంత, రాఖీ సమంత బిజొయ్ కుమార్ సిక్దర్ ,సింగ రాయ్, బాబర్ సలీం పాషా, ప్రవీణ్ చౌదరి వేముగంటి యుగేందర్ రావు జి ఎస్ ఆర్- హెచ్ ఆర్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ త్రాగు నీటి సరఫరా కలుషితం కావడం లేదు



- కబ్జాకు గురైన 70 ఎకరాల రికవరీకి చర్యలు
- అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన చేపల చెరువు నిర్మూలిస్తాం
- మోటార్లకు విద్యుత్ సరఫరా నిలిపి వేయాలని ఎన్.పి.డి.సి.ఎల్. కు ఆదేశం
- ఎల్లంపల్లి ప్రాజెక్టును పరిశీలించిన అదనపు కలెక్టర్ డి.వేణు

పెద్దపల్లి, జూన్ 04 (మనం ప్రతినిధి): ఎల్లంపల్లి నుంచి హైదరాబాద్ మహా నగరానికి సరఫరా చేసే త్రాగు నీటిలో ఎటువంటి కలుషిత పదార్థాలు లేవని అదనపు కలెక్టర్ డి.వేణు అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ డి.వేణు, హెచ్.ఎం.డబ్ల్యూ.ఎస్ సైట్ ఇంజనీర్ , సంబంధిత అధికారులతో కలిసి ఎల్లంపల్లి ప్రాజెక్టు పరిసర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి.వేణు మాట్లాడుతూ హైదరాబాద్ నగరానికి సరఫరా చేసే త్రాగు నీటి ముందుగా హెచ్.ఎం.డబ్ల్యూ.ఎస్ సైట్ ఇంజనీర్ తో కలిసి పరిశీలించి అవసరమైన పరీక్షలు నిర్వహించి, హైదరాబాద్ కు పంపే త్రాగు నీటిలో ఎటువంటి కలుషిత పదార్థాలు కల్వడం లేదని సైట్ ఇంజనీర్ రిపోర్ట్ ఇచ్చారని, శుభ్రమైన త్రాగునీటి సరఫరా హైదరాబాద్ నగరానికి ఎల్లంపల్లి నుంచి సరఫరా చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. నీటిపారుదల శాఖ కు సంబంధించి సుమారు 70 ఎకరాల అసైన్డ్ భూమి కబ్జా కు గురైనట్లు, ఇక్కడ ఎటువంటి అనుమతులు లేకుండా చేపల చెరువు (ఫిష్ పాండ్) వేసినట్లు గమనించామని, ప్రభుత్వ భూముల కబ్జా చేసి చేపల చెరువు వేసిన వారి పై పోలీస్ కేస్ నమోదు చేశామని, 70 ఎకరాల ప్రభుత్వ భూమిని మళ్ళీ స్వాధీనం చేసుకోవాల్సిందిగా ఈఈ నీటి పారుదల శాఖ అధికారికి ఆదేశాలం జారీ చేశామని అదనపు కలెక్టర్ తెలిపారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మోటార్ల ద్వారా నీటి లిఫ్ట్ చేసి చేపల చెరువులో కలుపుతున్నారని, మోటార్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయాలని మత్స్య శాఖ అధికారులు ఎన్.పి.డి.సి.ఎల్.కు సమాచారం అందించారని, అక్రమంగా జరుగుతున్న నీటి ఎత్తిపోతల వ్యవస్థ పూర్తి స్థాయిలో తొలగించేందుకు నీటి పారుదల శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ వెంట పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి గంగయ్య, అంతర్గాం తహసిల్దార్, మత్స్య శాఖ సహాయ సంచాలకులు, ఈఈ నీటిపారుదల శాఖ. రామగుండం, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రి వచ్చే రోగులతో మన ప్రవర్తన మర్యాదగా ఉండాలి

- ఆసుపత్రి నందు పారిశుధ్య పనులు మరింత మెరుగ్గా నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి, జూన్ 04 (మనం ప్రతినిధి): ఆరోగ్య సమస్యలతో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులు వారి సహాయకులతో మన సిబ్బంది ప్రవర్తన మర్యాదగా ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో మంథని ఆసుపత్రి పని తీరు పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, మంథని ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణ ఆశించిన స్థాయిలో ఉండటం లేదని కలెక్టర్ తెలిపారు. మాతా శిశు ఆసుపత్రి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు పారిశుధ్య నిర్వహణ మెరుగు పర్చాలని లేని పక్షంలో. పారిశుధ్య కాంట్రాక్టర్ చెల్లింపులు నిలిపి వేయడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు.ఆసుపత్రి వచ్చే రోగులతో సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలని, ప్రజల తో సిబ్బంది చాలా దురుసుగా మాట్లాడుతున్నట్లు సమాచారం అందుతుందని, పని తీరు మార్చుకొని పక్షంలో వేటు వేయడం జరుగుతుందని అన్నారు. ఆసుపత్రి విధులకు డాక్టర్లు సకాలంలో విధులకు హాజరు కావాలని అన్నారు. బయో మెట్రిక్ అటెండెన్స్ విధానం అమలు చేయాలని, రెగ్యులర్ గా వైద్యుల హాజరు వివరాల నివేదికను సమర్పించాలని అన్నారు. మంథని ఆసుపత్రి వచ్చే ఔట్ పేషెంట్ సంఖ్య పెరగాలని అన్నారు. మాతా శిశు ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని, చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలో విశ్వాసం కల్పించేలా మనం పని చేయాలని కలెక్టర్ సూచించారు.

మంథని పట్టణంలో 26 కోట్లతో చేపట్టిన 50 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాలని, ఆసుపత్రి అవసరమైన భూమి వైద్య శాఖకు బదలాయింపు పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. పెద్దపల్లి పట్టణంలో 100 పడకల ఆసుపత్రి పనులు వర్షా కాలం లోపు ఒక బ్లాక్ పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో డి సి హెచ్ ఓ. శ్రీధర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ కాలనీలుగా తీర్చిదిదెందుకు ప్రజలు సహకరించాలి




- సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్ మమ్మద్ నియాజ్

పెద్దపల్లి/సుల్తానాబాద్ జూన్ 4 (మన ప్రతినిధి): సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని ప్రతి కాలనీలు స్వచ్ఛ కాలనీలుగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ నియాజ్ పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని పలు వార్డులలో 100 రోజుల ప్రణాళికలో భాగంగా 14వ వార్డు పూసాల లో సానిటేషన్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ, స్వచ్ఛత పై తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ప్రజలందరూ కాలనీలను పరిశుభ్రంగా చూసుకుంటే ఎలాంటి రుగ్మతలు దరి చేరవని తద్వారా ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. నిత్యం కాలనీలకు వచ్చే మున్సిపల్ చెత్త సేకరణ వాహనాలకు విధిగా తడి, పొడి చెత్తను అందించాలని రోడ్లపై మురుగు కాలువలలో వేయవద్దని తెలిపారు. అనంతరం మున్సిపల్ పరిధిలో నిర్వహిస్తున్న నర్సరీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటేషన్ సిబ్బందితో పాటు పలువురు పాల్గొన్నారు.

## రేకొండ ఎల్లమ్మ తల్లి ఆలయంలో చోరీ

- చోరీ జరిగిన ఆలయాన్ని పరిశీలించిన పోలీసులు





చిగురుమామిడి, జూన్ 4 మనం న్యూస్: జనసంచారం లేని,గ్రామ శివారుల్లో ఉన్న ఆలయాలను, అలాగేవిద్యుత్ ట్ర న్స్ఫార్మర్ లను టార్గెట్ చేస్తూ చిల్లర దొంగలు రెచ్చిపోతున్నారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రేకొండ గ్రామ శివారులో గల శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో గుర్తుతెలియని దొంగలు మంగళవారం అర్ధరాత్రి ఆలయంలోకి చొరబడి ఆలయంలో దాదాపు 6సంవత్సరాలుగా అమ్మవారి మీద ఉంటున్న 25తులాల వెండి, సంవత్సరం కాలంగా హుండీలో భక్తులు వేసిన కానుకలు దాదాపు 10, 20వేల రూపాయలతోపాటు అర్థతులం బంగారు బొట్టు బిల్లలను ఎత్తుకెళ్లినట్లు గౌడ సంఘం నాయకులు తెలిపారు, దొంగతనం జరిగిన తీరును గమనించిన గౌడ సంఘం అధ్యక్షుడు పాకాల రమేష్ గౌడ్ వెంటనే చిగురుమామిడి పోలీసులకు సమాచారం అందించారు.ఆలయానికి చేరుకున్న పోలీసులు పలుకోణాల్లో విచారణ చేపట్టారు. ఆలయం వద్ద సీసీ కెమెరాలు లేకపోవడంతో ఇదే అదునుగా భావించిన దొంగలు చోరీకి పాల్పడ్డారు.ఇటీవల మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ పొలాల వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ల ను టార్గెట్ చేసి అందులో ఉన్న కాపర్ వైర్ ను చోరీచేసి లక్షలాది రూపాయల నష్టం చేస్తున్నారు.చోరీ చేసిన దొంగలను పట్టుకొని తమకు న్యాయం చేయాలని గౌడ సంఘం అధ్యక్షుడు పాకాల రమేష్ గౌడ్,గోపగోని సత్యనారాయణ,గోపగోని సంపత్,పడాల శ్రీనివాస్ గౌడ్, ఏరుకొండ కుమార్,పరకాల కొండయ్య గ్రామ ప్రజలు,తదితరులు పోలీసులను కోరారు.

# రేపే రైతు మహోత్సవం




## హుస్నాబాద్‌లో మూడు రోజుల పాటు కార్యక్రమాల నిర్వహణ
## 10 వేల మంది రైతులకు అవగాహన
## రైతులను తీసుకురావడానికి 100 బస్సులు
## 15 మంది శాస్త్రవేత్తలతో రైతులకు అవగాహన
## 108 స్టాల్స్ ఏర్పాటు
## హాజరవ్వనున్న పలువురు మంత్రులు



**హుస్నాబాద్,జూన్ 4,(మనం న్యూస్):** హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో రేపు రైతు మహోత్సవం(కిసాన్ మేళా)ను హుస్నాబాద్‌లో మూడు రోజుల పాటు కార్యక్రమాన్ని నిర్వహించేందుకు వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేస్తుంది. హుస్నాబాద్ పట్టణ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగే రైతు మహోత్సవానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రవాణా, బీ.సీ.సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు హజరై ప్రారంభించనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమంలో తొలి రోజు 6 వ తేదీన ఐదు వేల మంది రైతులను అధికారులు ప్రైవేట్ స్కూల్ బస్సుల్లో తీసుకురానున్నారు. తొలిరోజు హుస్నాబాద్ డివిజన్‌లోని కోహెడ, హుస్నాబాద్, హుస్నాబాద్ పట్టణం, అక్కన్నపేట, చిగురుమామిడి, సైదాపూర్, భీమదేవరపల్లి, వేలేరు, బెజ్జంకి మండలాల రైతులు పాల్గొనేటట్టు చర్యలు చేపట్టారు. రెండవ రోజు సిద్దిపేట డివిజన్ నుంచి 2500 మంది రైతులు పాల్గొంటారన్నారు. మూడోరోజు దుబ్బాక డివిజన్ నుంచి మరో 2500 మంది రైతులు పాల్గొనేటట్టు అధికారులు చర్యలు తీసుకున్నారు. మూడు రోజుల్లో 10 వేల మంది రైతులకు అవగాహన కల్పించేలా వ్యవసాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అక్కడే భోజనం, స్నాక్స్, మంచినీటి సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. బస్సులోనే రైతులను తీసుకువచ్చి మళ్లీ రైతులకు బస్సులోనే పంపే విధంగా ప్రణాళికలు చేసుకున్నారు. ప్రతి రోజు ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రైతులతో శాస్త్రవేత్తలు ముఖాముఖీలో పాల్గొంటారు. అగ్రికల్చర్, వెటర్నరి, హర్టికల్చర్ సైంటిస్టులు ఈ రైతు మహోత్సవంలో 15 మంది శాస్త్రవేత్తలు పాల్గొననున్నారు. ఎల్కతుర్తికి 8 బస్సులు, భీమదేవరపల్లికి 12 బస్సులు, వేలేరు నుంచి 4 బస్సులు, హుస్నాబాద్ నుంచి 9 బస్సులు, కోహెడ నుంచి 18 బస్సులు, అక్కన్నపేట నుంచి 12 బస్సులు, బెజ్జంకి నుంచి 13 బస్సులు, సైదాపూర్ నుంచి 12 బస్సులు, చిగురుమామిడి నుంచి 12 బస్సులు మొత్తం 100 బస్సులను కేటాయించినట్లు వ్యవసాయ శాఖ అధికారి ఏడిఏ శ్రీనివాస్ తెలిపారు. ప్రతి బస్సుకి ఇంచార్జీగా వ్యవసాయ విస్తరణ అధికారులను నియమించామన్నారు. వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తలు వ్యవసాయం, వ్యవసాయ ఉత్పత్తులు, సాంకేతికతల పై సమాచారం రైతులకు తెలియజేయనున్నారు. రైతులకు కొత్త వ్యవసాయ పద్ధతులు, సాంకేతికతలను తెలుసుకోవడానికి, వ్యవసాయ పనులను మెరుగుపరుచుకోవడానికి ఒక వేదిక కానుంది.

**108 స్టాల్స్ ఏర్పాటు...**

సుమారు 108 స్టాల్స్‌ను ఏర్పాటు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్యశాఖ విభాగాలు, వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక , మత్స్యశాఖ విశ్వవిద్యాలయాలు, బ్యాంకులు, ఎఫ్‌పిఓలు, స్టార్టప్ కంపెనీలు, వ్యవసాయ అనుబంధ రంగాల ప్రైవేట్ కంపెనీలకు సంబంధించిన 108 స్టాల్స్‌ను ఏర్పాటు చేసారు. వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్, వ్యవసాయాన్ని మెరుగుపరచడం, వ్యవసాయ ప్రదర్శనలు, రైతు-శాస్త్రవేత్త సమావేశాలు, ఉద్యాన పంటల్లో మెలకవులు, రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

**రైతు మహోత్సవానికి భారీ బందోబస్తు....**

**హుస్నాబాద్ ఏసిపి సదానందం**

హుస్నాబాద్‌లో రేపటి నుంచి జరగనున్న రైతు మహోత్సవం(కిసాన్ మేళా)కు భారీ బందోబస్తు నిర్వహించనున్నట్లు హుస్నాబాద్ ఏసిపి సాదారాపు సదానందం ఒక ప్రకటనలో తెలిపారు. సి.ఐ.కొంద్ర శ్రీను, హుస్నాబాద్ ఎస్.ఐ.తోట మహేష్, ట్రైనీ ఎస్.ఐ.నవీన్‌లతో కలిసి ఏర్పాట్లను ఏసిపి సదానందం బుధవారం పరిశీలించారు. రైతులందరూ పోలీసుల సూచనలు పాటించాలన్నారు. విఐపి, రైతుల గ్యాలరీలు, వాహన పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. కార్యక్రమానికి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

## అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థినికి నగదు పురస్కారం



**మిరుదొడ్డి, జూన్ 4( మనం న్యూస్):** నిరుపేద విద్యార్థులను ప్రోత్సహించడానికి మిరుదొడ్డి టీచర్ అసోసియేషన్ సభ్యులు ఎల్లవేళలా కృషి చేయడం జరుగుతుందని అన్నారు. బుధవారం మిరుదొడ్డి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు పొంది మొదటి స్థానంలో నిలిచిన మిరుదొడ్డికి చెందిన నంద్యాల రాంచంద్రారెడ్డి కవిత దంపతుల కుమార్తె శృతిని సన్మానించి రూ.5 వేల నగదు ప్రోత్సాహకం అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు అందె రాంచంద్రం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన, గుణాత్మకమైన విద్య అందుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థులను ప్రోత్సహించడానికి మిరుదొడ్డి టీచర్ అసోసియేషన్ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రాజు, నరేష్, మల్లేశం, కృష్ణ, సాయిలు, శ్రీకాంత్, దశరథం, మహేష్ తోపాటు తదితరులు ఉన్నారు.

## పర్యావరణ పరిరక్షణ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి




- జిల్లా కలెక్టర్ మను చౌదరి

**సిద్దిపేట, జూన్ 4(మనంప్రతినిధి):** పర్యావరణ పరిరక్షణ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని తద్వారా పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని సూచించారు. ప్లాస్టిక్ నివారించడం ద్వారా భావితరాలకు మంచి గాలి, నీరు, నేల అందించిన వారిమవుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయ ఆర్ సి పురం సహాయ పర్యావరణ శాస్త్రవేత్త టి. రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లెల్ల చెక్ పోస్ట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ మహేష్ బి.గీతే



**రాజన్న సిరిసిల్ల, జున్ 4 (మనం ప్రతినిధి):** బక్రీద్ పండుగ సందర్భంగా గోవుల అక్రమ రవాణా అరికట్టడానికి జిల్లెళ్ల వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ ని ఆకస్మిక తనిఖీ చేసి సిబ్బంది నిర్వహించే వాహనాల ఎంట్రీ రికార్డ్ లను పరిశీలించి,చెక్ పోస్ట్ లో గల సిబ్బందికి తగు సూచనలు చేసిన జిల్లా ఎస్పీ అనంతరం ఎస్పీ గారు మాట్లాడుతూ బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందిగా చర్యలు తీసుకోవడం జరిగిందని, గోవుల అక్రమ రవాణా గోవధనివారించేందుకు జిల్లా సరిహద్దుల జిల్లెళ్ల, పెద్దమ్మ, మానాల క్రాస్ రోడ్ వద్ద చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.చెక్ పోస్ట్ ల వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని,తనిఖీల్లో సరైన పత్రాలు ఉన్న రైతులకు సంబంధించిన లేదా వ్యవసాయనికి సంబంధించిన పశువుల రవాణాకు ఆటంకం కలిగించకుండా సిబ్బంది విధులు నిర్వహిచాలని తెలియజేశారు. చెక్‌పోస్టు వద్ద ఎలాంటి వివాదాలకు తావు లేకుండా ఇతర డిపార్ట్మెంట్ సిబ్బంది మరియు జిల్లా పోలీస్ యంత్రాంగామంతా సమన్వయముతో విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎస్పీ వెంట ఎస్.ఐ శంకర్ నాయక్ , పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## మయూరా హోటల్ కూరలో ఈగలు...
### ఈగే కదా!- హోటల్ సిబ్బంది నిర్లక్ష్యపు సమాధానం..
### స్పందించని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్...




**కరీంనగర్, జూన్ 4(మనం ప్రతినిధి):** కరీంనగర్ బస్టాండ్ సమీపంలోని ప్రముఖ మయూరా హోటల్ పరిశుభ్రతపై మరోసారి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. ఉదయం టిఫిన్కి హోటల్లోకి వెళ్లిన భగత్ నగర్కు చెందిన భాస్కర్ శ్రీను కుటుంబంతో కలిసి పూరీ ఆర్డర్ చేయగా, పూరీ క్రరిలో చనిపోయిన ఈగలు దర్శనం ఇచ్చాయి. ఈ దృశ్యాన్ని చూసి కంగుతిన్న కస్టమర్లు హోటల్ సిబ్బందిని నిలదీయగా, ఈగే కదా! అంటూ నిర్లక్ష్యంగా స్పందించారు.ఈ ఘటనను మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ జక్కుల సువార్త దృష్టికి తీసుకెళ్లిన కస్టమర్లకు, ఈ విషయాన్ని పత్రికలో వేయించండి అంటూ ఆమె చెప్పినట్టు సమాచారం. ప్రజల ఆరోగ్యాన్ని ఉద్ధరంగా తీసుకుంటున్న అధికారుల వైఖరిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఇక ఇదే అంశంపై ఫిర్యాదు చేసేందుకు మున్సిపాలిటీ కార్యాలయానికి వెళ్లిన యువకులు ఉదయం 11:30 అయినా అక్కడ ఒక్క సిబ్బంది కనిపించకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యానికి హాని చేసే సంఘటనలపై తక్షణ చర్యలు తీసుకోవాల్సిన సమయంలో మునిసిపల్ సిబ్బంది అప్రమత్తంగా లేకపోవడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. అధికారుల నిర్లక్ష్యం, హోటల్ నిర్వాహకుల బాధ్యతారాహిత్యంపై ప్రజలు తీవ్రమైన ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. హోటల్ యజమాని శివరాం ని వివరణ కోరగా వారు వచ్చి మమ్మల్ని డబ్బులు డిమాండ్ చేశారని అవి ఇవ్వనందుకు ఈగలను వాళ్లే వేశారని నిర్లక్ష్యపు సమాధానం చెప్పారు.

## రైతుల భూ సమస్యల పరిష్కారానికి భూభారతి సదస్సులు




- తొగుట ఎమ్మార్వో శ్రీకాంత్
- పెద్దమాసాంపల్లి, ఎల్లారెడ్డిపేట గ్రామాల్లో భూభారతి సదస్సులు

**తొగుట, జూన్ 4(మనం న్యూస్):** రైతులకు తమ భూముల్లో ఉన్న సమస్యలను పరిష్కరించడం కోసమే ప్రభుత్వం భూభారతి సదస్సులు నిర్వహిస్తుందని ఎమ్మార్వో శ్రీకాంత్ తెలిపారు. బుధవారం పెద్దమాసాంపల్లి, ఎల్లారెడ్డిపేట గ్రామాల్లో ఎమ్మార్వో శ్రీకాంత్, డిప్యూటీ ఎమ్మార్వో బి.శ్రావణి ఆద్వర్యంలో భూభారతి సదస్సులు నిర్వహించి రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో శ్రీకాంత్ మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ భూములపై ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే భూ భారతి సదస్సులో పరిష్కారం చేసుకోవాలని, తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని వచ్చిన భూభరతి పోర్టల్ పై అవగాహన కల్పించడంతో పాటు, రైతుల సందేహాలను నివృత్తి చేయడానికి ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సులో ఆయా గ్రామాల రైతులు తమ భూముల సమస్యలపై పెద్దమాసాంపల్లిలో 55, ఎల్లారెడ్డిపేటలో 76 దరఖాస్తులు రావడం జరిగిందని, ఈ దరఖాస్తులో మిస్సింగ్ సర్వే నంబర్లు, ముటేశన్ పెండింగ్, డిజిటల్ సైన్, విస్తీర్ణ సవరణ, కలసిఫికేశన్ సవరణ, పేర్లు మార్పు, లింగ సవరణ, అసైండ్ భూ సమస్యలు, వారసత్వ పేరు మార్పిడి, ఇనాం, తదితర సమస్యలపై 131 దరఖాస్తులు రావడం జరిగిందని తెలిపారు. భూభారతి ద్వారా రైతులకు ఇబ్బందులు లేకుండా భూదార్ హక్కును అందించడం జరుగుతుందని, గతంలో లాగే రైతులు భూములు అమ్మకాలు, కొనుగోళ్లు ఎలాంటి సమస్యలు లేకుండా మండల రెవెన్యూ కార్యాలయంలో జరుపుకోవచ్చన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన భూ భారతి సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## పైరవీలకు తావులేదు.. అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు

- రెండు నెలల్లోనే రెండో విడత
- అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు
- జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ కేడం లింగమూర్తి



**హుస్నాబాద్,జూన్ 04,(మనం న్యూస్):** ప్రజాప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఎలాంటి పైరవీలకు తావు లేకుండా లబ్ధిదారులను ఎంపిక చేసారని జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. అక్కన్నపేట మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరీ పత్రాలను బుధవారం ఆయన పంపిణీ చేసారు. ఈ సందర్భంగా కేడం లింగమూర్తి మాట్లాడుతూ మండలానిక తొలి విడతలో 334 ఇండ్లు మంజూరయ్యాయని తెలిపారు. అర్హులై ఉండి రాని వారు ఏ మాత్రం అందోళన చెందవద్దు అని ఇందిరమ్మ ఇండ్లు నిరంతర ప్రక్రియ అని రెండవ జాబితాలో వారికి ఇండ్లు వస్తాయన్నారు. రెండు నెలల్లోనే రెండో విడత ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపారు. గత పదేండ్ల కాలంలో పేద ప్రజలకు డబుల్ బెడ్‌రూమ్ ఇవ్వని బీఆర్ఎస్ నాయకులు ఇందిరమ్మ ఇండ్ల పై మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి పొన్నం కృషి చేస్తున్నారని కొనియాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలను అందజేస్తామని స్పష్టం చేసారు. గ్రామాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను మంత్రి పొన్నం త్వరలోనే పరిశీలిస్తారని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు త్వరతగతిన ముగ్గు పోసుకుని నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలోహుస్నాబాద్ సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు, డిసిసి ప్రధాన కార్యదర్శి చిత్తారి రవీందర్, నాయకులు వెన్న రాజు, చిత్తారి పద్మ, ముత్యాల సంజీవరెడ్డి, తదితరులున్నారు.

## విత్తనాల కొనుగోలులో రైతులు జాగ్రత్తలు పాటించాలి

పంటకాలం ముగిసే వరకు బిల్లును భద్రంగా ఉంచుకోవాలి ● డ్రోన్ల వినియోగం పై అవగాహన పెంచుకోవాలి ● ఎన్.ఏ.ఏ.ఆర్.ఎం.డైరెక్టర్ గోపాల్‌రావు



**హుస్నాబాద్,జూన్ 4,(మనం న్యూస్):** విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రైతులు జాగ్రత్తలు పాటించాలని ఎన్.ఏ.ఏ.ఆర్.ఎమ్.డైరెక్టర్ గోపాల్‌రావు అన్నారు. అక్కన్నపేట మండలం గండిపల్లి గ్రామంలో వ్యవసాయ విస్తరణ అధికారిని శ్రీలత ఆధ్వర్యంలో బుధవారం ఐసిఏఆర్ శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ గోపాల్‌రావు మాట్లాడుతూ విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నాణ్యమైన విత్తనాలు ఎంచుకోవడం ద్వారా పంట దిగుబడి పెరుగుతుందన్నారు. విత్తన ప్యాకెట్ మీద తయారైన తేదీ, కాలం ముగిసిన తేదీలు సరిగ్గా ఉన్నాయో లేదో చూసుకోవాలన్నారు. మంచి నాణ్యత, మొలకెత్తే శక్తి కలిగిన విత్తనాన్ని ఎంపిక చేసుకోవాలన్నారు. విత్తనాలు ఉన్న సంచులు సరైన సీలుతో, ధృవీకరణ పత్రంతో ఉన్న వాటినే కొనుగోలు చేయాలన్నారు. అధికారిక విత్తన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. ఇలా కొనుగోలు చేయడం ద్వారా పంట నష్టం జరిగితే వ్యవసాయ ఉన్నత అధికారులను సంప్రదించి నష్టపరిహారం పొందవచ్చు అన్నారు. విత్తనాలు కొనుగోలు చేసినపుడు బిల్లు తీసుకోవాలన్నారు. బిల్‌లో విత్తన కంపెనీ పేరు, విత్తన రకం, బ్యాచ్ నంబర్, లాట్ నంబర్, ఖరీదు వివరాలు ఉండాలన్నారు. పంటకాలం ముగిసే వరకు బిల్లును భద్రంగా ఉంచుకోవాలన్నారు. విత్తన ప్యాకేట్లు నిల్వ ఉంచేటపుడు తేమశాతం చేసుకోవాలన్నారు. నేల యొక్క ఆరోగ్యం, మట్టి నమునా సేకరణ, మట్టి పరీక్షల వలన కలిగే లాభాలు వివరించారు. సమగ్ర పోషక యజమాన్య పద్ధతులు, సమగ్ర సస్యరక్షణ పద్ధతుల ద్వారా రైతులకు కలిగే లాభాలు చెప్పారు. ప్రకృతి, సేంద్రియ, వ్యవసాయ పద్ధతుల పై అవగాహన కల్పించారు. కిసాన్ యాప్ ద్వారా వాతావరణ సూచనలు పొందవచ్చు అన్నారు. డ్రోన్ల వినియోగం పై రైతులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు వివరించారు. వ్యవసాయ సమాచారం పొందడానికి కిసాన్ సారథి పోర్టల్ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం తునికి శాస్త్రవేత్త డా.గోపాల్ లాల్, సిఆర్ఐడిఏ శాస్త్రవేత్తలు, రైతులు, తదితరులున్నారు.

## భూ భారతితో రెవెన్యూ సమస్యలు పరిష్కారం

- జిల్లా కలెక్టర్ మను చౌదరి



**కొండపాక, జూన్ 4(మనం న్యూస్):** ప్రభుత్వం అమలు చేస్తున్న భూభారతి చట్టం వల్ల భూ సంబంధిత సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయని జిల్లా కలెక్టర్ ఎం. మనుచౌదరి తెలిపారు. బుధవారం కొండపాక మండలం ఖమ్మం పల్లి గ్రామంలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో పాల్గొని దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూభూ సమస్యల తక్షణ పరిష్కారం కోసమే ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. అందుకోసం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తమ సమస్యల కోసం సదస్సుల్లో దరఖాస్తులు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగుతాయని పేర్కొన్నారు.సదస్సుల్లో పాల్గొన్న ప్రజల భూములకు సంబంధించిన సమస్యలను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకొని, దరఖాస్తులను పరిశీలించారు. రెవెన్యూ అధికారులు ప్రజల దరఖాస్తులను స్వీకరించి, వెంటనే రసీదులు ఇవ్వాలని ఆదేశించారు. సకాలంలో సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. మర్పడగ నుంచి ఖమ్మం పల్లి వరకు, సిద్దిపేట నుంచి ఖమ్మం పల్లి వరకు బి టి రోడ్డు వేయించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే గ్రామంలో పంపిణీ చేయకుండా ఉన్న 19 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులకు కేటాయించాలని కోరారు. అందుకు కలెక్టర్ తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కుకునూరుపల్లి మండల పరిధిలోని ఎల్లాయగూడ వెంకటాపూర్ గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుండి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, కొండపాక తహసీల్దార్ శ్యామ్, ఆర్ ఐ బాలకృష్ణ రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

# అర్హులందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు

**రాజకీయాలకతీతంగా నిరుపేదలకు**
**మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు**
**ఆర్థికంగా ఇబ్బందులు ఉన్న ప్రజా**
**సంక్షేమ కార్యక్రమాలు అమలు**
**ఇందిరమ్మ ఇళ్ల మంజూరి పత్రాల పంపిణీ**
**మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**



**ఖమ్మం, జూన్ 4(మనం బ్యూరో):** అర్హులైన నిరుపేదలందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని, నిరంతర ప్రక్రియగా ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమం కొనసాగుతుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. బుధవారం మంత్రివర్యులు టి.సి.వి. రెడ్డి ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో ఏదులాపురం మున్సిపాలిటీ ప్రాంత లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ₹మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారుల ముఖాలలో ఆనందం చూస్తుంటే తాను భావోద్వేగానికి లోనయ్యానని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే పని చేస్తే వారి నుంచి వచ్చే స్పందన అద్భుతంగా ఉంటుందని అన్నారు. గత పాలకులు ఎమ్మెల్యే నివాసాలు, ప్రభుత్వ భవనాల మీద పెట్టిన శ్రద్ధ పేద ప్రజల ఇండ్లపై పెట్ట లేదని, పేద ప్రజల సొంతింటి కలను విస్మరించిందని అన్నారు. 22 వేల 500 కోట్ల రూపాయలను పేద ప్రజల సొంతింటి కల కోసం ప్రజా ప్రభుత్వం ఈ సంవత్సరం కేటాయించిందని, ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ పేదల సంక్షేమం అజెండాగా పాలన కొనసాగిస్తున్నామని అన్నారు. గుడిసెలో ఉంటున్న నిరుపేదలకు మొదటి విడతలో ప్రభుత్వం ఇండ్లు మంజూరు చేస్తుందని అన్నారు.ఇందిరమ్మ ఇండ్ల పథకం పారదర్శకంగా అమలు చేయాలని, ఎక్కడ లంచాలకు ఆస్కారం లేకుండా ప్రతి నియోజకవర్గానికి 3 వేల 500 ఇండ్లు, చెంచులకు పూర్తి స్థాయిలో మంజూరు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాజకీయాలకు అతీతంగా నిరుపేదలకు మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం పెట్టె ప్రతి రూపాయి పేదలకు ఉపయోగపడాలని తాము ప్రయత్నిస్తున్నా మని అన్నారు. 20 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. గత పాలకులు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ పేద ప్రజలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్, 500 రూపాయ లకే గ్యాస్ సిలిండర్, రేషన్ ద్వారా సన్న బియ్యం సరఫరా, ఆరోగ్య శ్రీ పరిమితి 10 లక్షలకు పెంపు, గురుకులాల్లో డైట్, కాస్మొటిక్ చార్జీలు పెంపు, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. రైతులకు దాదాపు 21 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి 2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేశామని, సన్న వడ్లకు క్వింటాకు 500 రూపాయల బోనస్ అందించామని అన్నారు. రైతు భరోసా పథకం క్రింద పెట్టుబడి సహాయం ఎకరానికి 12 వేల రూపాయలకు పెంచామని అన్నారు. ప్రస్తుతం ప్రజలకు అందించే ఇండ్లు మొదటి విడత మాత్రమేనని, ప్రతి సంవత్సరం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు ఉంటుందని, ఏదులాపురం మున్సిపాలిటీ లో ప్రస్తుతం 520 మందికి ఇల్లులు మంజూరు చేసినట్లు, ఇంకా అర్హులున్నారని, వారికి కూడా ఇస్తామని, నిరంతర ప్రక్రియగా ఇందిరమ్మ ఇండ్ల పథకం కొనసాగుతుందని మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు అందాలని ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని, నాణ్యమైన ఇల్ల నిర్మాణంపై జిల్లా స్థాయి అధికారి నుంచి పంచాయతీ కార్యదర్శి వరకు అవసరమైన శిక్షణ అందించామని, పైలెట్ ప్రాజెక్టు క్రింద ముందస్తుగా ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ఇప్పటి వరకు 50 ఇండ్లు పూర్తి చేశామని, 500 ఇండ్లు వివిధ దశలలో ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ఇంటి నిర్మాణం పురోగతి ఆధారంగా లబ్దిదారుల ఖాతాలో డబ్బులు ప్రభుత్వం గ్రీన్ ఛానల్ ద్వారా విడుదల చేస్తున్నదని అన్నారు. ఖమ్మం జిల్లాలో మొదటి విడతలో 17 వేల పైగా లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని అన్నారు. ప్రజాధనం భారీగా ప్రభుత్వం వినియోగిస్తున్న నేపథ్యంలో పూర్తి స్థాయిలో సద్వినియోగం జరిగేలా చూస్తున్నామని, అనర్హులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇండ్లు మంజూరు చేయడం లేదని అన్నారు. పేదలకు ఇండ్లు మంజూరు చేస్తే వారి జీవితంలో మంచి మార్పు వస్తుందని, అటువంటి అవకాశం మంత్రి వర్యులు తనకు కల్పించడం అదృష్టంగా భావిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్దిదారులు మాట్లాడుతూ గత 10 సంవత్సరాల కాలంగా సొంతింటి కోసం అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ తమకు మంజూరు కాలేదని, ప్రజా ప్రభుత్వంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహాయంతో తమకు ఇండ్లు మంజూరు కావడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ నరసింహారావు, ఏదులాపురం మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్ రావు, ఖమ్మం రూరల్ తహసిల్దార్ రాంప్రసాద్, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యలకు 'భూ భారతి ' శాశ్వత పరిష్కారం



- **ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య**

**టేకులపల్లి, జూన్04,(మనం న్యూస్):** భూ సమస్యలకు' భూ భారతి ' శాశ్వత పరిష్కారమని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. బుధవారం టేకులపల్లి మండలంలో జరుగుతున్న భూ భారతి రెవిన్యూ సదస్సులను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్ తో కలిసి పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల భూ సమస్యల శాశ్వత పరిష్కారానికై ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి రెవిన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్. వీరభద్రం, రెవిన్యూ సిబ్బంది, నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి చట్టంతో రైతులకు ఎంతో మేలు



- **గత పాలకుల తప్పిదాలతో రైతులు ఎంతగానో ఇబ్బంది పడ్డారు**
- **ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయ అధికారి రాహుల్ రెడ్డి**

**మణుగూరు, జూన్ 4(మనం న్యూస్):** గత పాలకుల హయాంలో ధరణిలో ఎన్నో అవకతవకలు జరిగాయని, వాటి పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూ భారతి చట్టాన్ని అమలు పరుస్తుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం గుట్టమల్లారంలోని రైతువేదికలో జరిగిన భూ భారతి గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... భూ భారతి చట్టం రైతులందరికీ మేలు చేకూరుస్తుందన్నారు. భూ భారతి చట్టం కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. ఈ సదస్సుకు హాజరు కాలేని రైతులు నేరుగా తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం భూ భారతిలో దరఖాస్తు చేసుకున్న రైతులకు ఎమ్మెల్యే ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీటీ రామారావు, ఆర్పి గోపి, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది శ్రీనివాస్, మండల కాంగ్రెస్ నాయకులు పి.నవీన్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు తరుణ్ రెడ్డి, ఐతనబోయిన సతీష్, సామా శ్రీనివాసరెడ్డి, మండల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### రైతులకు విత్తనాల పంపిణీ...

మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు రైతువేదికలో రైతులకు విత్తనోత్పత్తి పథకం ద్వారా నాణ్యమైన విత్తనం రాయితీపై సిద్ధి రకం, పెసరలో ఎంజీజీ395. రకం పంట విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగ నాణ్యమైన విత్తనాలతో పంట పండించి అధిక దిగుబడి సాధించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాహుల్ రేడ్డి, ఏఈఓ లక్ష్మణరావు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలలో ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి పనులు పూర్తి

- **9 కోట్ల 63 లక్షల రూపాయలతో చేగొమ్మ గ్రామంలో అభివృద్ధి పనులు**
- **కూసుమంచిలో జూనియర్ కళాశాల నిర్మాణ స్థల పరిశీలన**
- **మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**కూసుమంచి, జూన్ 4(మనం న్యూస్):** గ్రామాలలో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రణాళిక బద్ధంగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం మంత్రివర్యులు కూసుమంచి మండలంలో పర్యటించి సి.ఎం.ఆర్.ఎఫ్. చెక్కుల పంపిణీ, పలు రోడ్డు నిర్మాణ పనులకు, పాఠశాల అదనపు గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. కూసుమంచి క్యాంప్ కార్యాలయంలో నేలకొండపల్లి, కూసుమంచి మండలానికి చెందిన 348 మంది లబ్ధిదారులకు దాదాపు కోటి 6 లక్షల రూపాయల విలువ గల సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. గట్టుసింగారం గ్రామంలో 23 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, చేగొమ్మ గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 13 లక్షల 50 వేలతో నిర్మించనున్న అదనపు తరగతి గది నిర్మాణానికి, గైగొల్లపల్లి గ్రామంలో గైగొల్లపల్లి నుండి బచ్చోడు వరకు 4 కోట్ల 20 లక్షలతో నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు, పాలేరు గ్రామంలో సీసీ రోడ్డు శంకుస్థాపన చేసిన అనంతరం, జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల లో 13 లక్షల 50 వేల రూపాయలతో నిర్మించనున్న అదనపు తరగతి గది నిర్మాణానికి, నాయకన్ గూడెం గ్రామంలో 90 లక్షల అంచనా వ్యయంతో సూర్యాపేట - అశ్వారావుపేట రోడ్డు మరమ్మత్తు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన ఒకటిన్నర సంవత్సర కాలంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి మాట చిత్తశుద్ధితో అమలు చేస్తుందని అన్నారు. చేగొమ్మ గ్రామానికి మొత్తం ఇప్పటి వరకు 9 కోట్ల 63 లక్షల అభివృద్ధి పనులను మంజూరు చేసామని అన్నారు. చేగొమ్మ నుంచి కొండాపురం వరకు 4 కోట్ల 40 లక్షల రూపాయలతో, చేగొమ్మ నుంచి చిలక గూడెం వరకు 2 కోట్ల 70 లక్షల రూపాయలతో బీటి రోడ్డు నిర్మాణ పనులు, జీళ్ల చెరువు నుంచి చేగొమ్మ వరకు 40 లక్షలతో రోడ్డు మరమ్మత్తు పనులు, చేగొమ్మ నుంచి ముత్యాల గూడ వరకు కోటి 43 లక్షలతో రోడ్డు మరమ్మత్తు పనులు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. చేగొమ్మ గ్రామంలోని ఎంపీపీఎస్ లో అదనపు తరగతి గది నిర్మాణ పనులకు 13 లక్షల 50 వేలతో, 20 లక్షలతో పంచాయతీ భవనం, 12 లక్షలతో అంగన్ వాడి కేంద్రం, 20 లక్షలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులు మంజూరు చేశామని అన్నారు. చేగొమ్మ గ్రామంలో మొదటి విడతగా 30 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసామని, విడతల వారీగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు వస్తుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. అనర్హులకు ఎవరికైనా ఇండ్లు పొరపాటున మంజూరు చేస్తే వెంటనే రద్దు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. గత పాలకులు అమలు చేసిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ, ప్రతి నెలా గత పాలకులు చేసిన అప్పులకు 6 వేల 500 కోట్ల రూపాయల కిస్తీ చెల్లిస్తూ, ప్రజలకు ఇచ్చిన ఒక్కో హామి అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. పేద ప్రజలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, ఉగాది నుండి రేషన్ ద్వారా సన్న బియ్యం సరఫరా, నూతన రేషన్ కార్డుల జారీ, రేషన్ కార్డులో కొత్త సభ్యుల చేరిక, ఆరోగ్య శ్రీ పరిమితి 10 లక్షలకు పెంపు, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశామని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏడాది కాలంలోనే దాదాపు 21 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి 2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేశామని, సన్న వడ్లకు క్వింటాకు 500 రూపాయల బోనస్ అందించామని అన్నారు. రైతు భరోసా పథకం క్రింద పెట్టుబడి సహాయం ఎకరానికి 10 వేల నుంచి 12 వేల రూపాయలకు పెంచామని అన్నారు. పాలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గది నిర్మాణానికి శంకుస్థాపన చేసిన తర్వాత మాట్లాడుతూ, ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల వేరు వేరుగా ఏర్పాటు చేసే దిశగా భూమి గుర్తించాలని, హైస్కూల్, ప్రాథమిక పాఠశాల నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరు కొరకు ప్రతిపాదనలు సమర్పించాలని, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ఫాలో అప్ చేసి ప్రభుత్వం నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. అంతకుముందు కూసుమంచి మండల కేంద్రంలో పాత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శిథిల భవనం స్థానంలో జూనియర్ కాలేజీ ఏర్పాటుకు ఎంపిక చేసిన స్థలాన్ని మంత్రి పరిశీలించి పలు సూచనలు అందించారు. పాత జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో ఉపయోగ పడే చెక్క ఉంటే పక్కకు పెట్టి ఉపయోగంలోకి తీసుకొని రావాలని అన్నారు. చెట్లను తొలగించకుండా జూనియర్ కళాశాల నిర్మాణ పనులు పకడ్బందీగా ప్లాన్ చేయాలని, పిల్లలకు ఓపెన్ గ్రౌండ్ పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీఓ నరసింహా రావు, ఎంపీపీఎస్ స్కూల్ హెడ్ మాస్టర్, కూసుమంచి మండల తహసీల్దార్ రవికుమార్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న శాంతినికేతన్ స్కూల్ పూర్వ విద్యార్థులు



**మరిపెడ, జూన్ 4 (మనం న్యూస్):** మరిపెడ మండల కేంద్రంలో బుధవారం మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని శాంతినికేతన్ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించిన 2004-05 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వవిద్యార్థులవారి బ్యాచ్ లో వీరాచారి చంద్రు తండాలో గుండెపోటుతో ఇటీవల మరణించారు. బిరెడ్డి. ఉమా ఎల్లంపేట వారు భర్తను కోల్పోవడం జరిగినది. వారి కుటుంబాలకు ఇద్దరూ ఆడపిల్లలు ఉన్నారు. వారి కుటుంబ పరిస్థితులను గమనించి తోటి విద్యార్థులు చెల్లించిపోయి వారికి తక్షణ సహాయం కింద ఒక్కొక్కరికి 20500 రూపాయలను ఆనాటి గురువులు పాఠశాల యాజమాన్యం వారు రేపాల.యాదయ్య, రాచకొండ. రామచంద్రయ్యల చేతులమీదుగా అందజేశారు. పిల్లలకు భవిష్యత్తులో విద్యను అభ్యసించడానికి అయ్యే ఖర్చులను మా క్లాస్మేట్స్ అందరూ కలిసి సహాయం చేస్తామని మీ కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో మీ కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటామని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు ఏర్పడిన మాకు వెంటనే తెలియచేయాలని కోరారు. గురువులు ఆ కుటుంబాలకు మనో ధైర్యాన్ని నింపారు. భవిష్యత్తులో పిల్లల ఉన్నతికి పాటుపడాలని కోరారు. శాంతినికేతన్ పాఠశాలలో చదివిన ప్రతి పదవ తరగతి ప్రతి సంవత్సర విద్యార్థులు ఈ విద్యార్థులను ఆదర్శంగా తీసుకొని మిగతావారు ఆర్థికంగావెనుకబడి ఇబ్బంది పడుతున్నతోటి విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవా లని కోరారు. కార్యక్రమంలో ఆనాటి విద్యార్థులు ఎనగందుల. దిలీప్ కుమార్ ,శ్రావణ్ శేఖర్, విజయ్ రమేష్, రామోజీ, విజయభాస్కర్, ప్రవీణ్ పాల్గొన్నారు. మానవత్వాన్ని ప్రదర్శించిన ఈ బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు అందరిని గురువులు అభినందించారు.

## ఐరన్ మ్యాన్ ఆఫ్ జెఎస్ జెబి-భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి. పాటిల్

- **ప్రశంసించిన గవర్నమెంట్ ఆఫ్ ఇండియా అధికారులు, కేంద్ర మంత్రి**
- **మండల స్థాయి అధికారులు, ఫీల్ సిబ్బందికే అభినందనలు**
- **కలెక్టర్ జితేష్ వి పాటిల్**



**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 4 (మనంప్రతినిధి):** భారత ప్రభుత్వం జల శక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ₹జల సంచాయి జన భాగిదారి₹ (జెఎస్ జెబి) కార్యక్రమంలో విజేత జిల్లాల సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రెజెంటేషన్కు ప్రత్యేకమైన ప్రశంసలు లభించాయని కలెక్టర్ కార్యాలయం తెలిపింది. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిపాదించిన 'ఓల్డ్ ఆఫ్ గవర్నమెంట్ ఓల్డ్ ఆఫ్ సొసైటీ ' భావనను అత్యంత ప్రభావవంతంగా ఆచరణలోకి తీసుకువచ్చిన జిల్లాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుర్తింపు పొందిందని, జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, అంగన్వాడీ కేంద్రాలు, హెల్త్ సబ్ సెంటర్లు, జూనియర్ కళాశాలలు, రైతు వేదికలు, పోలీస్ స్టేషన్లు, పాఠశాలలు, సంక్షేమ హాస్టల్స్, వాటర్ ట్యాంక్ ప్రాంతాలు, పల్లె ప్రకృతి వనాలు, బృహత్ ప్రకృతి వనాలు, రోడ్ల ఇరువైపులా - ఇలా వివిధ ప్రదేశాలలో మొత్తం 29,103 సోక్ పిట్లు పూర్తి చేయడం జరిగింది. ఇంకా 2,581 సోక్ పిట్లు నిర్మాణం ప్రగతిలో ఉన్నాయని కలెక్టర్ కార్యాలయం తెలిపింది. ఎంజిఎన్ ఆర్ ఇజిఎస్ ద్వారా అర్హులైన రైతులకు ఫాం పాండ్స్ (నీటి కుంటలు) మంజూరు చేయడం జరిగింది. ఇప్పటివరకు 1,100 మాస్ మార్కౌట్ చేసి, ఇందులో 399 కుంటలు నిర్మాణంలో ఉన్నాయి. పెద్ద రైతులు కూడా తమ స్వంత ఖర్చుతో ఫాం పాండ్స్ త్రవ్వి మద్దతు తెలియజేశారు. సింగరేణి వారు, ఐటీసీ వారు కూడా కొన్ని వాటర్ రీచార్జ్ స్ట్రక్చర్లు వారి నిధులతో పూర్తి చేశారు. కలెక్టర్ జితేష్ పాటిల్, అన్ని ప్రభుత్వ భవనాల వద్ద కనీసం 1 స్క్వేర్ మీటర్ల సోక్ పిట్లు క్రొత్తవి ఏర్పాటుచేయాలని ఆదేశించారు. వర్షాకాలంలో నీటి నిల్వలు లేకుండా ముందుగానే తగిన చర్యలు తీసుకోవాలన్న సంకల్పంతో అధికారులు స్వయంగా శ్రమదానం చేసి సోక్ పిట్లు నిర్మించారు. ఈ కృషిని చూసిన ప్రజలు ప్రేరణ పొందుతూ, తమ స్థాయిలో భాగస్వామ్యం చేశారు. ఫలితంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మొత్తం సోక్ పిట్లుతో నిండి కనిపిస్తోంది. ఇది ప్రభుత్వ యంత్రాంగం మరియు సమాజం కలిసినపుడు సాధ్యమయ్యే విజయానికి ఓ ప్రతీకగా నిలిచిందని కలెక్టర్ కార్యాలయం తెలిపింది. అలస్యంగా ప్రారంభించినా, 29,103 సోక్ పిట్స్ నిర్మించి కేటగిరీ 3లో నిలిచిన జిల్లాకు కేంద్రం నుంచి సిఎస్ఆర్ మద్దతు అందించబడుతుందని హామీ ఇచ్చారు. భారత ప్రభుత్వ అధికారులు, మంత్రుల ప్రశంసలు మండల స్థాయి అధికారులు, వారి ఫీల్ సిబ్బందికే చెందుతాయి. వారే ఈ విజయానికి శ్రమించిన నిజమైన శ్రేయోభిలాషులు. సోక్ పిట్ ప్రచారాన్ని అర్థంతో స్వీకరించి, అంకితభావంతో అమలు చేసిన వారందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నానని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పేర్కొన్నారు.

## పంట మార్పిడి పాటించండి సుస్థిర ఆదాయాన్నిపొందండి



**దమ్మపేట, జూన్ 4 (మనంన్యూస్):** వ్యవసాయ కళాశాల అశ్వరావుపేట శాస్త్రవేత్తలు డాక్టర్ జంపమ్మ మరియు డాక్టర్ శిరీష బుధవారం దమ్మపేట మండలం వడ్లగూడెం గ్రామం లోని ప్రాథమిక పాఠశాలలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమము నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు సూచించిన ఆరు ప్రధాన అంశాల గురించి రైతులకు వివరించారు. వ్యవసాయంలో రైతులు తక్కువ యురియ వాడి సాగు ఖర్చు తగ్గించాలి, అవసరం మేరకు రసాయనాలు వాడి నేల ఆరోగ్యం కాపాడండి, రసీదులు భద్రపరచి కష్ట కాలాల్లో నష్టపరిహారాన్ని పొందండి, సాగు నీటిని ఆదా చేయండి, పంట మార్పిడి పాటించండి- సుస్థిర ఆదాయాన్ని పొందండి, చెట్లని పెంచండి, పర్యావరణాన్ని కాపాడండి అనే అంశాల పై అవ గా హన కల్పించారు. వడ్లగూడెంలోని రైతులు తెల్ల దోమ ఉధృతి అధికంగా ఉందని తెలిపారు వాటి ఫలితాల అధారంగ సిఫారసు చేసిన ఎరువులు యాజమాన్యం చేపట్టాలని తెలిపారు. అనంతరం డా జంబమ్మ మాట్లాడుతూ, సిపారసు చేసిన మేరకు ఎరువులు వాడాలని, రసాయనాల వాడకంలో వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలను పాటించాలని కోరారు. సాగు నీటి యజమాన్యం గురుంచి వివరించారు.ఈ కార్యక్రం గురుంచి కళాశాల విద్యార్థులు దివాకర్, కుమారి ధరని మొదటి సంవత్సరం లో వ్యవసాయం గురుంచి తము తెలుసుకున్న విషయాల గురుంచి అభిప్రాయాలు రైతులతో పంచుకున్నారు.ఆ తరువాత వడ్లగూడెం రైతు భాను మరియు నూనె. నాగ శ్రీను మాట్లాడుతూ ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు ఆయిల్ పామ్ సాగు గురుంచి కావలని కోరారు. వ్యవసాయ మరియు ఉద్యాన వన శాకలు అందించే ప్రభుత్వ రాయితీల గురుంచి రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమాల ద్వారా రైతులకు ఎంతో ఉపయోగం ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు రైతులు కళాశాల విద్యార్థులు, గ్రామ పంచాయితీ కార్య దర్శి శ్రీ మురలి పాల్గొన్నారు.

## చేపల వేట కోసం చెరువులో నీటిని తొలగించారు

**చేపల కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్**



**వైరా,జూన్ 04 (మనం న్యూస్):** ధనార్జనే ధ్యేయంగా చేపల వ్యాపారులు నిండుకుండలా ఉన్న నల్ల చెరువులో ఉన్న నీరును తొలగించారు. చెరువులో ఉన్న 3.5 అడుగుల నీటిని తూము ద్వారా నిరుపయోగంగా బయటికి వదిలేశారు. దీంతో ఆ చెరువు ఆయకట్టు పరిధిలో ఉన్న సుమారు 230 ఎకరాల సాగు ప్రశ్నార్థకంగా మారనుంది. పొలాలు పండించుకోవడానికి సాగునీటిని అందిస్తున్న చెరువులోని నీటిని వృధాగా బయటకు వదిలేందుకు గ్రామ అభివృద్ధి పేరుతో అక్రమంగా లక్ష 50వేల రూపాయలు లంచంగా ఇచ్చామని కాంట్రాక్టర్ బహిరంగంగానే చెబుతున్నారు. ఇది వైరా ఇది ఎక్కడో జరిగింది కాదు ఖమ్మం జిల్లా వైరా మండలంలోని సోమవరం గ్రామంలో ఉన్న నల్ల చెరువు దుస్థితి. ఈ నల్ల చెరువులో ఒక కాంట్రాక్టర్ గతంలో చేప పిల్లలను పోశారు. అయితే గత వారం రోజుల క్రితం ఆయన చెరువులో చేపల వేట మొదలుపెట్టారు. ఆ సమయంలో వర్షం రావటంతో చెరువు పుష్కలంగా నిండింది. ఈ చెరువులో నీటి మట్టం ఎత్తు 5 అడుగులుగా ఉంది. అయితే చేపల వేట కోసం కాంట్రాక్టర్ చెరువులో నీటిని తొలగించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. సోమవరం గ్రామంలోని కొంతమంది గ్రామస్తులు గ్రామ అభివృద్ధి పేరుతో చెరువులో నీటిని తొలగించేందుకు సదరు కాంట్రాక్టర్ నుంచి లక్ష 50వేలు రూపాయలను తీసుకున్నారని గ్రామస్తులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. దీంతో సదరు కాంట్రాక్టర్ గత మూడు రోజులుగా చెరువులో సుమారు 3.5 అడుగుల లోతు నీటిని తూము ద్వారా బహిరంగంగా బయటకు పంపారు. ప్రస్తుత నల్ల చెరువులో 1.5 అడుగుల నీటిమట్టమే ఉంది. దీంతో బుధవారం ఈ చెరువులో చేపల కాంట్రాక్టర్ చేపల వేటను ప్రారంభించారు. నిండుకుండలా ఉన్న చెరువులో నీటిని తొలగించిన కాంట్రాక్టర్ పై కేసు నమోదు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. నల్ల చెరువులో గత మూడు రోజులుగా తూము ద్వారా అక్రమంగా నీటిని బయటకు పంపిన విషయం తమకు తెలియదని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. భవిష్యత్తులో వర్షాలు కురవకపోతే ఆయకట్టులోని 230 ఎకరాల సాగు ప్రశ్నార్థకంగా మారనుంది. ఈ విషయమై వైరా ఐబీ డీఈ శ్రీనివాస్ ని మనం దిన పత్రిక వివరణ కోరగా సోమవరం నల్లచెరువులో సాగునీటిని బయటకు తొలగించిన విషయం తన దృష్టికి రాలేదని స్పష్టం చేశారు. ఆ తరువాత తమ సిబ్బందితో తూమును మూసివేసామని ఆయన తెలిపారు.

# ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం



కరీంనగర్, జూన్ 4 (మనం ప్రతినిధి): యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టిఐ అభ్యర్థన మేరకు రాష్ట్ర ప్రభుత్వం సమాచార హక్కు చట్టం కమిషనర్లను నియమించిన సందర్భంగా ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ బుధవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టిఐ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ గూడూరి స్వామి రెడ్డి మాట్లాడుతూ... సమాచార హక్కు చట్టం-2005 అమల్లోకి వచ్చి వచ్చే అక్టోబర్ 12 నాటికి 20 సంవత్సరాలు పూర్తికావస్తున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాల్లో చట్టం అమలు తీరుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. సమాచార హక్కు చట్టం ప్రజలకు వజ్రాయుధం అని ఈ చట్టం ఎవరి చుట్టం కాదని అన్నారు. ప్రతి అధికార యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారీ తనం కోసం ఏర్పాటు చేసిందే సమాచార హక్కు చట్టం అని, ప్రభుత్వ కార్యాలయాల నుంచి, సంఘాల నుంచి మనకు కావాల్సిన సమాచారాన్ని అడిగి తీసుకునే అవకాశాన్ని సమాచార హక్కు చట్టం కల్పించిందన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో సమాచార అధికారుల పేరు ఫోన్ నంబర్లతో సహా ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ కార్యాలయాలలో సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 4(1)బీ నీ పక్కాగా అమలు చేయాలన్నారు. రాష్ట్ర కమిషన్ లో సంవచ్చరాల తరబడి పెండింగులో ఉన్న కేసులు తొందరగా పరిష్కరించాలని కోరారు. ప్రజల సంక్షేమం కోసం ప్రతినిత్యం ఆర్టిఐ ద్వారా సమాచారం కోరే కార్యకర్తల మీద పెట్టిన అక్రమ కేసులు వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టిఐ జిల్లా ప్రచార కార్యదర్శి లక్ష్మణమూర్తి తులసి , హుజురాబాద్ నియోజకవర్గం కన్వీనర్ రావుల రాజేశం, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆకుల రాజేశ్వర్ రావు, మాసం శుధాకర్, గూడూరి చైతన్య రెడ్డి, కాయితోజు విజయ్ కుమార్, దాసరి రామ కృష్ణ రెడ్డి, శ్రీరాముల రమేశ్, పల్లెల దేవరాజ్, మొగిలి సతీష్, ఈ డెల్లి సతీష్ గాలపెల్లి లక్ష్మయ్య , గాలపెల్లి జితేందర్, సందే తిరుపతి రెడ్డి తగితతులు పాల్గొన్నారు.



## యారన్ సబ్సిడీ రాని కార్మికులకు వెంటనే అందించాలి

- సిఐటియు పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మూషం రమేష్ డిమాండ్

సిరిసిల్ల టౌన్,జూన్ 4(మనం న్యూస్): 2023 సంవత్సరం బతుకమ్మ చీరలకు సంబంధించి స్థానిక కార్మికులకు , ఇతర రాష్ట్రాల కార్మికులకు , టెక్స్టైల్ పార్క్ కార్మికులకు రానటువంటి 10శాతం యారన్ సబ్సిడీ డబ్బులను కాలయాపన చేయకుండా వెంటనే అందించాలని, కలెక్టరేట్ కు మార్చిన చేనేత జౌళి శాఖ కార్యాలయాన్ని కార్మికులకు అందుబాటులో ఉండే విధంగా యధావిధిగా సిరిసిల్లకు మార్చాలని తదితరు డిమాండ్లతో సిఐపి పౌర్ణమి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి కలెక్టరేట్ ఏవో , చేనేత జౌళి శాఖ ఏడి కి వినతిపత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మూషం రమేష్ , జిల్లా అధ్యక్షుడు కోడం రమణ మాట్లాడుతూ 2023 సంవత్సరం బతుకమ్మ చీరలకు సంబంధించి మొదటి విడతగా గత నెల రోజుల క్రితం దాదాపు 3,000 మంది కార్మికుల అకౌంట్లలో సబ్సిడీ డబ్బులు జమ కావడం జరిగిందని ఇంకా దాదాపు 2200 మంది స్థానిక కార్మికులు , ఇతర రాష్ట్రాల కార్మికులు , టెక్స్టైల్ పార్క్ కార్మికులకు సంబంధించి రావలసిన సబ్సిడీ డబ్బులను కాలయాపన చేయకుండా వెంటనే అందించాలని అదేవిధంగా సిరిసిల్ల గత కొన్ని సంవత్సరాలుగా వేలాదిమంది పవర్లూమ్, అనుబంధ రంగాల కార్మికులకు సిరిసిల్లలో అందుబాటులో ఉండి కలెక్టరేట్ కు మార్చిన జిల్లా చేనేత జౌళి శాఖ కార్యాలయాన్ని యదావిధిగా సిరిసిల్లలో కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కోడం రమణ, పట్టణ అధ్యక్షులు నక్క దేవదాస్, కార్యదర్శి గుండు రమేష్, టెక్స్టైల్ పార్కు వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కూచన శంకర్ నాయకులు బెజుగం సురేష్, మూషం శంకర్, స్వర్గం శేఖర్, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.



## భూభారతితో సమస్యలు పరిష్కారం

జాజిరెడ్డిగూడెం, జూన్4 (మనం న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన కొత్త రెవిన్యూ చట్టం భూభారతితో భూముల సమస్యలు పరిష్కారం జరుగుతుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెలు అన్నారు. బుధవారం జాజిరెడ్డి మండలం కుంచమర్తి గ్రామంలో రెవెన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడారు. రైతులు రెవిన్యూ శాసనం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీకాంత్, పి ఎస్ ఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్ రెడ్డి, సామా అభిషేక్ రెడ్డి, ఎల్సాజి నరేష్, ఇందుర్తి వెంకటరెడ్డి, మాజీ జెడ్పిటిసి కొరపెడతా అవిలయ్య గుడిపల్లి మధుకర్ రెడ్డి, ఎంపీడీవో గోపి, తాటిపాముల జలంధర్, అధికారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సైదాపూర్ ఘటనపై కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం చర్యలు



కరీంనగర్, జూన్ 04(మనం ప్రతినిధి): గత నెల 8న సైదాపూర్ శివారులో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో జరిగిన ఘటనపై కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తక్షణ చర్యలు తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన నివేదిక ఆధారంగా సంబంధిత పోలీస్ సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నట్లు ఆయన బుధవారం తెలిపారు. గత నెల 8న సైదాపూర్ పోలీస్ స్టేషన్ ప్రొబెషనరీ ఎస్సై అగస్త్య భార్గవ్ మరియు కానిస్టేబుళ్లు ఆకాష్, అజయ్ రోజువారి విధుల్లో భాగంగా సైదాపూర్ శివారులో వాహన తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. అదే సమయంలో హుస్నాబాద్కు చెందిన బత్తుల మహేందర్ ద్విచక్ర వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా, మహేందర్ పోలీసులతో వాదనకు దిగి, దుర్భాషలాడుతూ విధులకు ఆటంకం కలిగించాడని కానిస్టేబుల్ అజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని అన్నారు. అదేవిధంగా, వాహనదారుడు బత్తుల మహేందర్ ఈ ఘటనపై కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. దీనిపై ఏసీపీ హుజురాబాద్ను పూర్తి స్థాయిలో పారదర్శకంగా, నిస్పక్షపాతంగా విచారణ జరిపి నివేదిక సమర్పించాలని కమిషనర్ ఆదేశించగా ఏసీపీ హుజురాబాద్ సమర్పించిన నివేదిక ఆధారంగా, వాహన తనిఖీలు జరుగుతున్నప్పుడు వాహనదారుడు బత్తుల మహేందర్ తన వాహనాన్ని ఎందుకు ఆపారని ప్రశ్నిస్తూ, పోలీసులను దూషిస్తూ, విధులకు ఆటంకం కలిగించారని, ఈ క్రమంలో పోలీసులు మరియు వాహనదారుడికి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుందని, పరిస్థితిని అదుపు చేయడానికి పోలీసులు అవసరానికి మించి బలప్రయోగం చేసారని తేలిందన్నారు.అయితే, బాధితుడి నుంచి అందిన ఫిర్యాదు మేరకు బాధితుడికి న్యాయం చేసేందుకు ఆ రోజు విధుల్లో ఉన్న కానిస్టేబుళ్లు ఆకాష్ మరియు అజయ్లపై క్రమశిక్షణా చర్యల్లో భాగంగా వారికి ఛార్జ్ మెమో జారీ చేసి పోలీస్ స్టేషన్ విధులనుండి తప్పిస్తూ హెడ్ క్వార్టర్స్కు అటాచ్ చేయడం జరిగిందని పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు. ఇక ట్రైనీ ఎస్సై అగస్త్య భార్గవ్పై క్రమశిక్షణా చర్యల నిమిత్తం మల్టీ జోన్ ఐజీపీ కి నివేదిక కూడా పంపినట్లు తెలిపారు. ఈ ఘటనపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని వార్తల్లో వస్తున్న కథనం పూర్తి అవాస్తవం అని కమిషనర్ స్పష్టం చేశారు. చట్టం ముందు అందరూ సమానమేనని, తప్పు చేసిన వారికీ శిక్ష తప్పదని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం పునరుద్ఘాటించారు.

## ఈ నెల 20వరకు రెవెన్యూ సదస్సులు



- చంద్రాస్ పల్లి పల్లె దావఖానను తనఖీ చేసిన జిల్లా కలెక్టర్

మహబూబ్ నగర్, జూన్4(మనం బ్యూరో): భూభారతి ద్వారా అన్ని మండలాల,గ్రామాల్లో ఈ నెల 20 వరకు భూసమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. బుధవారం కోయిల్ కొండ మండలం చంద్రాస్ పల్లి గ్రామం లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో జిల్లా కలెక్టర్ పాల్గొని భూ సమస్యలపై దరఖాస్తులను పరిశీలించారు. రైతులు భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో పాల్గొనేలా అవగాహన కలిగించాలని అన్నారు.గ్రామ రెవెన్యూ సదస్సులు షెడ్యూల్ గురించి విస్తృతంగా గ్రామాల్లో తెలియ చేయాలని కలెక్టర్ సూచించారు. రైతులు ,ప్రజలు భూ సమస్యలను పరిష్కారం చేసేందుకు గ్రామాల్లో నిర్వహించే భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో పాల్గొని దరఖాస్తులు అంద చేయాలని సూచించారు. రెవెన్యూ సదస్సులో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి దరఖాస్తు దారులకు ఏ విధంగా దరఖాస్తు పూరించాలి సూచనలు,సలహాలు అంద చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులు నిర్దేశిత గడువు లోగా పరిష్కారం చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అనంతరం చంద్రాస్ పల్లి గ్రామంలో పల్లె దవాఖాన ను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు.పల్లె దవాఖాన లో పరిధిలో ఎన్ని గ్రామాలు ఉన్నవి అని డాక్టర్,సిబ్బందిని అడిగారు ఐదు గ్రామాలు ఉన్నాయని తెలిపారు. గర్భిణీ లు ఎంత మంది నమోదు అయ్యారు, ఎంత మంది డెలివరీ కి ఉన్నారు అని కలెక్టర్ వైద్య సిబ్బందిని అడిగారు 33 మంది డెలివరీ ఉన్నారు. హై రిస్క్ కేసులు ఎన్ని ఉన్నాయి అని అడగగా 8 హై రిస్క్ కేసులు ఉన్నాయని కలెక్టర్ కు తెలిపారు. అన్ని డెలివరీలు పక్కాగా డేటా సిద్ధంగా ఉంచాలని అన్నారు మే నెలలో ఎన్ని డెలివరీలో అయ్యాయి మే నెలలో 7 డెలివరీలు జరిగాయని తెలిపారు. గర్భిణీ మహిళలు, మాతా శిశు ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మాతా,శిశు సంరక్షణ,గర్భిణీ స్త్రీల చెకప్,హై రిస్క్ కేసుల చికిత్స తదితర అంశాలపై వారికి అవగాహన కలిగించాలి అన్నారు. అదే విధంగా రక్త హీనత ఉన్న మహిళలకు కూడా ప్రత్యేక శ్రద్ధ కనపరచి చికిత్స అందించాలని అన్నారు. చిన్నపిల్లలకు టీకా లు వేసే కార్యక్రమం సక్రమంగా నిర్వహించాలి. డయాబెటిస్ పేషెంట్స్ ఎంతమంది ఉన్నారని అడిగింది. డయాబెటి పేషెంట్స్ 78 మంది ఉన్నారు బీపీ పేషెంట్స్ 101 ఉన్నారు అని ఇంకా ఏమైనా ఇబ్బంది ఉందా మందుల కొరత ఏమైనా ఉందా అని తెలుసుకున్నారు.జిల్లా కలెక్టర్ తో పాటు తహశీల్దార్,రెవెన్యూ,వైద్య సిబ్బంది ఉన్నారు.

## జూన్ 10 వరకు రెసిడెన్షియల్ పాఠశాలలు విద్యార్థుల కోసం సన్నద్ధం చేయాలి

- గురుకులాల పరిసరాలను పూర్తిస్థాయిలో పరిశుభ్రం చేయాలి
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి జూన్ 04 (మనం ప్రతినిధి): జూన్ 10 వరకు రెసిడెన్షియల్ పాఠశాలలు విద్యార్థుల కోసం సన్నద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో రెసిడెన్షియల్ పాఠశాలల, కేజీబీవి ల నిర్వహణ పై జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, జూన్ 10 తర్వాత రెసిడెన్షియల్ పాఠశాలలకు పిల్లలు వస్తారని, అప్పటి వరకు హాస్టల్స్ విద్యా సంస్థల వద్ద పారిశుధ్య పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వర్షా కాలం లో హాస్టల్స్ వద్ద నీటి నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. హాస్టల్స్ విద్యా సంస్థల్లో రెగ్యులర్ గా అన్ని రూమ్ లలో ఫాగ్గింగ్ జరిగేలా స్థానిక పంచాయతీ కార్యదర్శులు, అధికారులతో సమయం చేసుకుని పని చేయాలని కలెక్టర్ తెలిపారు. హాస్టల్స్ పరిసరాలు పిచ్చి మొక్కలు పూర్తి స్థాయిలో తొలగించాలని , పాములు, తేలు రాకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. హాస్టల్స్ బౌండరీ వాల్ వరకు పారిశుధ్య పనులు చేయాలని అన్నారు. సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేయాలని అన్నారు . హాస్టల్ కిటికిల మెష్ పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని, గోడలకు ఎక్కడైనా వాటర్ లీక్ అవుతుందో పరిశీలించాలని అన్నారు. హాస్టల్స్ సంప్ ట్యాంక్ శుభ్రం చేయాలని అన్నారు. పాఠశాలలో ఉన్న ఆర్వో ప్లాంట్, ఫిల్టర్ లేదా మిషన్ భగీరథ నీరు నాణ్యతతో వస్తుందో లేదో పరిశీలించాలని అన్నారు. మిషన్ భగీరథ ఏఈ ద్వారా రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవి లలో త్రాగునీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని అన్నారు. హాస్టల్స్ లో విద్యార్థులు చేరే ముందు అవసరమైన చర్యలు తీసుకోవాలని, హాస్టల్స్ లో అవసరమైన వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఒక చెక్ లిస్ట్ తయారు చేసి ప్రతి అంశం పూర్తి అయ్యేలా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి. మాధవి, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి వినోద్ కుమార్ , సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అటవీ శాఖ అధికారుల పై కేసు నమోదు చేయాలని ఎసిపికి పిర్యాదు



జైపూర్, జూన్ 4 (మనం న్యూస్): అటవీ శాఖ అధికారులపై కేసు నమోదు చేయాలని బిజెపి నాయకులు కలిసి జైపూర్ మండలంలోని ఏసిపి కార్యాలయంలో ఫిర్యాదు చేశారు,వేమనపల్లి మండలంలోని చామనపల్లి గ్రామానికి చెందిన దళిత రైతుల పై అటవీశాఖ అధికారులు అక్రమ కేసులు నమోదు చేసి జైలుకు పంపిన అధికారులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డిమాండ్ చేశారు,బిజెపి నాయకులతో కలిసి ఎసిపి వెంకటేశ్వర్ కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత యాభై సంవత్సరాల నుండి రైతులు చామనపల్లి శివారులోనీ సర్వే నెంబర్ 65, 67 లో సాగు చేస్తున్నారని అన్నారు. గత సంవత్సరం నుండి అటవీశాఖ అధికారులు ఈ భూములు అటవీ శాఖ కు చెందినవని రైతులపై దాడులు చేస్తూ, అక్రమంగా కేసులు నమోదు చేసి రైతులను జైలుకు పంపించారని తెలిపారు. అటవీశాఖ అధికారుల పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. అటవీశాఖ అధికారులు రైతుల భూముల్లో రావద్దని హెచ్చరించారనీ , పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఇప్పటికీ పోలీసులు అటవీశాఖ అధికారులపై కేసు నమోదు చేయలేదని ఏ సి పి నీ ప్రశ్నించారు. దీనికి స్పందించిన ఏసీపి రెవెన్యూ అధికారుల నుండి భూమి రికార్డులు, అటవీశాఖ రికార్డులు తెప్పిస్తున్నామని అన్నారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు పులగం తిరుపతి, జిల్లా కార్యదర్శి గోవర్ధన్, సీనియర్ నాయకులు కేశవ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రాజులాల్ యాదవ్, ఆదిలాబాద్ జిల్లా అధికార ప్రతినిధి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా భూసమస్యల పరిష్కారం



- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల, జూన్ 4 (మనం ప్రతినిధి): భూసమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి నూతన ఆర్.ఓ.ఆర్. చట్టంలో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల ద్వారా భూసమస్యలపై అందిన దరఖాస్తులను పరిష్కరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని జైపూర్ మండలం మిట్టపల్లి, నర్సింగాపూర్ గ్రామాలలోని గ్రామపంచాయతీ కార్యాలయాలలో కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులను మండల తహశిల్దార్ వనజారెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణలతో కలిసి సందర్శించి దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి నూతన ఆర్.ఓ.ఆర్. చట్టంలో భాగంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూసమస్యలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ దరఖాస్తులను రికార్డులతో సరి చూసి, క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే దిశగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం తొలుతగా రాష్ట్రంలోని 4 జిల్లాలో 4 మండలాలను పైలెట్ మండలాలుగా ఎంపిక చేయడంలో భాగంగా జిల్లాలోని భీమారం మండలాన్ని ఎంపిక చేసి రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూసమస్యల సంబంధిత దరఖాస్తులు స్వీకరించి దాదాపు పరిష్కరించడం జరిగిందని తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు జిల్లాలోని భీమారం మినహా అన్ని మండలాలలో కార్యచరణ ప్రకారం రెవెన్యూ సదస్సులు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. నూతన చట్టంలో రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం కల్పించడం జరిగిందని, రిజిస్ట్రేషన్, ముటేషన్ చేసేందుకు ముందు భూముల వివరాలు పూర్తి స్థాయిలో సర్వే చేసి, మ్యాప్ తయారు చేయడం జరుగుతుందని, పెండింగ్ సాదా బైనామా దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిష్కరించడం జరుగుతుందని, వారసత్వంగా వచ్చిన భూములకు విరాసత్ చేసే ముందు నిర్ణీత కాలంలో సమగ్ర విచారణ చేయడం, సంబంధిత వారసులకు నోటీసులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తుతో పాటు రిజిస్టర్డ్ దస్తావేజులు, రెవెన్యూ రికార్డులు జతపరిచినట్లయితే త్వరగా పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగవిరమణ పొందిన హోంగార్డ్

- సుదీర్ఘకాలం సేవలు అందించడం అభినందనీయం
- జిల్లా ఎస్పీ నరసింహ

సూర్యాపేట, జూన్ 4 (మనం ప్రతినిధి): కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు అబ్దుల్ సత్తార్ విధులు నుండి ఉద్యోగవిరమణ పొందినారు. ఈ సందర్భంగా హోంగార్డు ను ఆయన కుటుంబ సభ్యుల, స్నేహితుల సమక్షంలో బుధవారం జిల్లా పోలీస్ కార్యలయంలో ఎస్పి చేతుల మీదుగా సన్మానించారు. అబ్దుల్ సత్తార్ కుటుంబ సభ్యులకు ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..పోలీసు డిపార్ట్మెంట్ నందు 30 సం.రాలపాటు సుదీర్ఘకాలం సేవలు అందించడం గొప్పవిషయం అని, అభినందనీయం అని వారి సేవలను కొనియాడారు. ఈ ఉద్యోవిరమణ అనంతరము వారి కుటుంబ సభ్యుల అందరితో సుఖ సంతోషలతో గడపాలని అని, ప్రజా సేవలో పాల్గొనాలని కోరుకుంటున్నాము అని తెలిపినారు. ఎల్లప్పుడూ పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం కృషి చేస్తున్నాము అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఆర్.అదనపు ఎస్పీ జనార్ధన్ రెడ్డి, ఏ ఆర్ డీఎస్పీ నరసింహ చారి, ఐ టి కోర్ రాజశేఖర్, హోంగార్డు ఇంఛార్జ్ ఏ ఆర్ ఎస్ ఐ.వెంకన్న, హోంగార్డు కుటుంభం సభ్యులు పాల్గొన్నారు.



## భూ సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు

నేరేడుచర్ల,జూన్ 04 మనం న్యూస్: ఎన్నో సంవత్సరాల నుంచి పేరుకుపోయిన భూ సమస్యలు సైతం పరిష్కరించేందుకు రెవిన్యూ సదస్సులు ఉపయోగపడతాయని నేరేడుచర్ల మండల తహసిల్దార్ సురిగి సైదులు గౌడ్ అన్నారు. నేరేడుచర్ల మండలంలోని ఎల్లారం గ్రామంలో భూ భారతీ రెవెన్యూ సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ సురిగి సైదులు గౌడ్ మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా ఉన్న రైతులు భూభారతి రెవెన్యూ సదస్సులను వినియోగించుకొని తమ సమస్యలు పరిష్కరించుకోవాలని, భూ సమస్యలు పరిష్కారం కొరకే ప్రభుత్వం భూభారతి రెవిన్యూ సదస్సులు ఏర్పాటు చేసిందని,ఈ సదస్సులో 15 మంది రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దారు మౌనిక, మండల గిర్దావర్ సిహెచ్. నరసయ్య, రెవిన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



# నాణ్యమైన విత్తనం-రైతన్నకు నేస్తం

**కామారెడ్డి, జూన్ 4 ( మనంప్రతినిధి) :** కామారెడ్డి జిల్లా మద్నూర్ లో రైతు వేదిక యందు నాణ్యమైన విత్తనం - రైతన్నకు నేస్తం అనే వినూత్న కార్యక్రమం ద్వారా పంట సాగులో నాణ్యమైన విత్తనం యొక్క పాత్రను గుర్తించి, జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఈ సంవత్సరం నాణ్యమైన విత్తనం - రైతన్నకు నేస్తం అనే వినూత్న కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా రైతులకు వరి విత్తనాలు మరియు మొక్క జొన్న విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యం., ప్రతి పంటలో నాణ్యమైన విత్తనాన్ని వాడినపుడు దిగుబడులు కనీసం 10-15 శాతం వరకు పెరిగే అవకాశాన్ని రైతులకు తెలియజేయడం. రైతులు ఒకసారి నాణ్యమైన విత్తనాన్ని వ్యవసాయ పరిశోధన



స్థానం ద్వారా సేకరించి, కొన్ని సాగు సాంకేతికతలను పాటిస్తే అదే విత్తనాన్ని 2-3 సంవత్సరాల వరకు వాడుకోవచ్చు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రతి రెవెన్యూ గ్రామంలో ఎంపికైన ముగ్గురు నుండి ఐదుగురు అభ్యుదయ రైతులకు వ్యవసాయ పరిశోధన స్థానాల ద్వారా ఉత్పత్తి చేసిన నాణ్యమైన విత్తనం అందించబడుతుంది.

ఎంపికైన రైతులకు విత్తనోత్పత్తిపై వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు ఎప్పటికప్పుడు అందించబడతాయి. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజు, మద్నూర్ మండల మార్కెటింగ్ వైస్ చైర్మన్ పరమేష్ , మారుతి టెంపుల్ చైర్మన్ రామ్ పటేల్, తహసీల్దార్ ముజిబ్ , మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దరాస్ సాయిలు , నాయకులు వట్నాల రమేష్ , హన్మండ్లు స్వామి, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు సౌమ్య, సంయుక్త, సరోజ, అనిల్, సంపత్, విశాల్ మరియు మండల రైతులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లతో మా కల నెరవేరింది



**పిట్లం, జూన్ 04 ( మనం న్యూస్) :** పిట్లం మండలంలోని బుర్నాపూర్ గ్రామంలో బుధవారం నాడు ఇందిరమ్మ ఇళ్లకు ఎంపీడీవో ముగ్గు వేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ., ఇందిరమ్మ ఇండ్లతో మా సొంతింటి కల నెరవేరిందని సంతోషం వ్యక్తం చేశారు. బుర్నాపూర్ గ్రామంలో అందరిలాగా కాకుండా ఊర్లో స్థలం లేకపోవడంతో తన సొంత పొలంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకుంటున్నామని లబ్ధిదారులు తెలిపారు. చేన్లో ఇల్లు కట్టడం కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లుతో ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్మించుకుంటున్నామని అన్నారు. ఇంటికి సంబంధించిన అన్ని పర్మిషన్లు తీసుకుని ఇక్కడ నిర్మించుకుంటున్నామని లబ్ధిదారు తెలిపారు. మా సొంత భూమి ఉండడంతో ఊర్లో కాకుండా ఊరి బయట నిర్మాణంతో ఆహ్లాదకరమైన జీవితాన్ని పొందచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ గంగ ప్రసాద్, కార్యదర్శి రజిత, ప్రజలు ఉన్నారు.

# రెండోరోజు రెవెన్యూ సదస్సులు

**పిట్లం, జూన్ 04 ( మనం న్యూస్):** పిట్లం మండలంలోని బుర్నాపూర్, కిష్టాపూర్ గ్రామాలలో రెండవ రోజు రెవెన్యూ సదస్సులు అధికారులు నిర్వహించారు. గ్రామాలలో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించడానికి రెవెన్యూ సదస్సులు ఉపయోగించుకోవాలని డిప్యూటీ తాసిల్దార్ సత్యనారాయణ రైతులను సూచించారు. బుర్నాపూర్ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 11 భూ సమస్యల దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు. కిష్టాపూర్ గ్రామంలో నిర్వహించిన సదస్సులో 15 దరఖాస్తులు వచ్చాయని వాటిని అధికారులు తీసుకొని సంబంధిత విచారణ చేసి సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేస్తామని అన్నారు. రైతులు మాత్రం సమస్యలను త్వరగా పూర్తి చేయాలని



అధికారులను కోరారు. ఎప్పటినుండో పరిష్కారం కానీ ఈ సమస్యలు ఈ రెవెన్యూ సదస్సులో పరిష్కారం అయితే ఎంతో లాభదాయకమని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ సత్యనారాయణ, ఆర్ ఐ శీతల్, సీనియర్ అసిస్టెంట్ గోపాల్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

# 1500 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- **సభకు వేలాదిగా తరలిరండి**
- **ప్రభుత్వం బీర్ల ఐలయ్య**

**యాదగిరిగుట్ట, జూన్ 4 (మనం న్యూస్) :** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం తిరుమలపురం గ్రామ వేదికగా సుమారు 1500 కోట్ల రూపాయల నిధులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు రానున్న నేపథ్యంలో బహిరంగ సభ స్థలాన్ని, ఏర్పాట్లను ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ జూన్ 6 వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అలేరు నియోజకవర్గ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడం కోసం వస్తున్న సందర్భంగా సభ స్థలాన్ని, ఏర్పాట్లను పరిశీలించడం జరిగిందన్నారు.తెలంగాణలోని ప్రతి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపి వాటిని ఆచరణలో చూపిస్తున్నారనిఅన్నారు.ఈ మెరకు ప్రతి ఎమ్మెల్యే తో మాట్లాడి కొన్ని సంవత్సరాలుగా శాశ్వతంగా నిలిచిపోయిన అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలపడం జరిగిందన్నారు. ఆలేరు నియోజకవర్గానికి 1500 కోట్ల రూపాయల తో అభివృద్ధి పనుల కోసం



శంకుస్థాపన చేయడం జరుగుతుందని. ఈ సందర్భంగా ఆలేరు నియోజకవర్గ ప్రజల తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రివర్యులు ఉత్తంకుమార్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి మంత్రులు అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

ఈ మేరకు ఆలేరు నియోజకవర్గం నుండి 6 తారీకు జరగబోయే బహిరంగ సభలో పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా ప్రజలు పాల్గొని విజయవంతం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆలేరు నియోజకవర్గ వ్యాప్తంగా కాకుండా భువనగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో పెద్ద ఎత్తున భువనగిరి నియోజకవర్గం నుండి యువకులు కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున వస్తున్నట్లు తెలిపారు.30 ఏళ్ల నుండి ఎదురుచూస్తున్న గంధమల్ల ప్రాజెక్టు 700 కోట్లతో, ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థుల కోసం ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి 200 కోట్లు, యాదాద్రి మెడికల్ కాలేజీ నిర్మాణం కోసం 183 కోట్లు, యాదగిరిగుట్ట దేవస్థానం అభివృద్ధి కోసం 100కోట్లు , సిఆర్ఆర్ - ఎంఆర్ఆర్, ఆర్అండ్బి నిధులు 80 కోట్ల రూపాయలతో, యాదగిరిగుట్టలో వేద పాఠశాల నిర్మాణానికి 46 కోట్లతో, వేర్ హౌస్ గోదాములకు 20 కోట్లతో, కొలనుపాక, కాల్వపల్లి, హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణాల కోసం 15 కోట్లతో, అదేవిధంగా మోటకొండూరును కేవలం మండలంగా చేసి గత ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి చేయలేదని, అందుకే ఈ ప్రజా పాలన ప్రభుత్వంలో ప్రజల కోసం మూడు ప్రభుత్వ కార్యాలయాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు.

వీటన్నింటిని శంకుస్థాపన చేసేందుకు జూన్ 6వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు తుర్కపల్లి మండలం తిరుమలపురం గ్రామానికి రానున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆలేరు నియోజకవర్గం ఉమ్మడి నల్గొండ నుండి పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులు ,ప్రజాప్రతినిధులు, యువకులు, తరలివచ్చి ఈ సభను విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రజలకు పిలుపునిచ్చారు.

## జాతీయం- అంతర్జాతీయం

# ఉక్రెయిన్‌కు లక్ష డ్రోన్లు..

- **అందజేయనున్న బ్రిటన్**

**లండన్, జూన్ 4 :** ఉక్రెయిన్‌కు 2026 ఏప్రిల్ నాటికి లక్ష డ్రోన్లు అందజేస్తామని బ్రిటన్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇటీవల రష్యాలోని వైమానిక స్థావరాలే లక్ష్యంగా ఉక్రెయిన్ భారీగా డ్రోన్ దాడులకు పాల్పడడంతో మాస్కోకు చెందిన 41 యుద్ధ విమానాలు ధ్వంసమయిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో కీవ్కు భారీ సంఖ్యలో డ్రోన్లను సరఫరా చేయడానికి బ్రిటన్ ముందుకువచ్చింది. 2026 ఏప్రిల్ నాటికి ఉక్రెయిన్‌కు లక్ష డ్రోన్లు అందజేస్తామని హామీ ఇచ్చింది. ఆ దేశానికి ఇచ్చే 4.5 బిలియన్ పౌండ్ల మిలిటరీ మద్దతులో ఈ 350 మిలియన్ పౌండ్ల డ్రోన్ ప్యాకేజీ భాగమని పేర్కొంది. స్వతంత్రంగా ఉత్పత్తి చేసిన స్ట్రాటజిక్ డిఫెన్స్ రివ్యూను బ్రిటన్ ప్రభుత్వం ఆమోదించింది. రష్యన్ దురాక్రమణతో సహా ఉద్భవిస్తున్న మరిన్ని ముప్పులను



ఎదుర్కోవడానికి కీవ్‌కు మిలిటరీ మద్దతు ఇస్తున్నట్లు తెలిపింది. బ్రస్సెల్స్‌లో నిర్వహించనున్న 50 దేశాల ఉక్రెయిన్ డిఫెన్స్ కాంటాక్ట్ గ్రూప్ సమావేశంలో బ్రిటన్ రక్షణ కార్యదర్శి జాన్ హీలీ ఈ ప్రకటన చేయనున్నారు. రష్యా వద్ద అపారమైన క్షిపణి సంపద ఉంది. ఆ దేశంతో పోలిస్తే ఉక్రెయిన్ దగ్గర భారీ ఆయుధాలు లేకపోవడంతో కీవ్‌ను ఆయుధాల కొరత వెంటాడుతోంది. ముఖ్యంగా గగనతల రక్షణ వ్యవస్థ లేకపోవడంతో రష్యా చేసే క్షిపణులు, డ్రోన్ల దాడులను తట్టుకోలేకపోతోంది. దీంతో రిమోట్ సాయంతో సుదీర్ఘంగా ప్రయాణించగలిగే డ్రోన్ల వ్యవస్థను అభివృద్ధి చేసుకుంది. వీటితో తాజాగా రష్యాలోని అనేక ప్రాంతాల్లో భారీ దాడులకు పాల్పడింది. గతంలోనూ రష్యా సైనిక స్థావరాలు, చమురు బావులపై దాడులు చేసేందుకు ఉక్రెయిన్ వీటిని ప్రయోగించింది. భవిష్యత్తులో రష్యా ఆక్రమణలను ఎదుర్కోవడానికి మరిన్ని డ్రోన్లు సరఫరా చేయాలని మిత్ర దేశాలను కోరింది. మాస్కో కీవ్‌పై భీకర దాడులకు పాల్పడుతుండడంతో.. రష్యా దాడుల నుంచి తమ దేశాన్ని రక్షించుకోవడానికి పలు పశ్చిమ దేశాలు, బ్రిటన్, అమెరికా ఉక్రెయిన్‌కు ఆయుధాలను పంపిణీ చేస్తున్నాయి. ఇటీవల రష్యాపై దీర్ఘశ్రేణి ఆయుధాలు ప్రయోగించకుండా ఉక్రెయిన్‌పై ఉన్న ఆంక్షలను పశ్చిమ దేశాలు తొలగించడంతో కీవ్‌కు దీర్ఘశ్రేణి ఆయుధాలు ప్రయోగించే అవకాశం లభించింది.

# గూఢచర్యం కేసులో మరో యూట్యూబర్ట్

**ఛండీగఢ్, జూన్ 4:** పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తున్న ఆరోపణలపై యూట్యూబర్ జస్బీర్ సింగ్‌ను పంజాబ్ పోలీసులు అరెస్టు చేశారు. పహల్గాంలో ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్‌తో సంబంధం ఉన్న గూఢచర్య నెట్‌వర్క్‌పై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తున్న ఆరోపణలతో మరో యూట్యూబర్‌ను పంజాబ్ పోలీసులు అరెస్టు చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రూపనగర్ జిల్లాలోని మహలాన్ గ్రామానికి చెందిన జస్బీర్ సింగ్ 'జాన్ మహల్' అనే పేరుతో ఓ యూట్యూబ్ ఛానెల్ నిర్వహిస్తున్నాడు. ఇతడి ఛానెల్‌కు 1.1 మిలియన్ల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. నిందితుడికి పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ అధికారి, ఐఎస్ఐకు పనిచేస్తున్నాడనే ఆరోపణలు ఎదుర్కొంటున్న షకీర్ అలియాస్ జట్ రాంధావాతో సంబంధాలు కొనసాగిస్తున్నాడు. పాక్ రాయబార కార్యాలయ అధికారి ఎహసాన్ ఉర్ రహీం అలియాస్ డానిష్‌తో కూడా సంబంధంలో ఉన్నాడు. ఇటీవల గూఢచర్యం కేసులో అరెస్టయిన హరియాణా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాతో ఇతడికి దగ్గరి సంబంధాలు ఉన్నట్లు తేలింది. డానిష్ ఆహ్వానం మేరకు ఢిల్లీలోని పాక్ రాయబార కార్యాలయంలో జరిగిన జాతీయ దినోత్సవానికి కూడా సింగ్ హాజరయినట్లు గుర్తించాం. 2020, 21, 24లలో శత్రుదేశంలో ఇతడు పర్యటించాడు. నిందితుడికి సంబంధించిన ఎలక్ట్రానిక్ పరికరాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించగా.. దాయాది దేశానికి చెందిన అనేకమంది నంబర్లు బయటపడ్డాయి. జ్యోతి అరెస్టు నేపథ్యంలో వాటిని తొలగించేందుకు ప్రయత్నించాడనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై కేసు నమోదు చేసుకొని పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తున్నాం. కాగా.. పాకిస్థాన్‌కు గూఢచర్యం కేసులో పంజాబ్‌లో ఇప్పటివరకు ఏడుగురు అరెస్టు అయ్యారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి




- **కాలుష్యం వల్ల అనేక సమస్యలు వస్తున్నాయి**
- **ప్లాస్టిక్ వల్ల అనేక అనర్థాలు జరుగుతాయి**
- **జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**నల్గొండ, జూన్ 4( మనం ప్రతినిధి) :** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు. కాలుష్యం వల్ల కలిగే అనర్థాలు, పర్యావరణ పరిరక్షణ పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం జూన్ 5 న నిర్వహించనున్న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన గోడ పత్రికను జిల్లా కలెక్టర్ బుధవారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు.వివిధ రకాల కాలుష్యాల వల్ల ప్రతి నిత్యం సమాజం అనేక రకాల సమస్యలను ఎదుర్కొంటున్నదని, అందువల్ల అన్ని రకాల కాలుష్యాలను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. వాయు, జల ,శబ్ద,భూమి , ప్లాస్టిక్ వంటి ఎన్నో హానికర కాలుష్యాలు సమాజంలో విచ్చలవిడిగా ఉన్నాయని , ఇవి పర్యావరణంతో పాటు, జీవ,జంతు జాలాల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తాయని తెలిపారు. వీటి గురించి ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని ప్లాస్టిక్ స్థానంలో పేపర్ ,గుడ్డ కు సంబంధించిన పరికరాలు వాడాలని, స్టీల్ బాటిళ్లు, టిఫిన్ బాక్సులు, క్లాత్ బ్యాగుల వంటివి ఉపయోగించాలని కోరారు. పారిశ్రామిక వ్యర్థాలను నదుల్లోకి, చెరువులోకి వదల వద్దని, నదులు చెరువులను శుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని నదులే దేశానికి జీవనాడులని అన్నారు. అలాగే వాయుకాలుష్యం లేకుండా ,శబ్ద కాలుష్యం లేకుండా చూసుకోవాలని, ఎక్కడపడితే అక్కడ చెత్త, చెదారం వేయడం వల్ల వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందని అన్నారు. కాలుష్య నియంత్రణ మండలి నల్గొండ జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకన్న ,సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కమల్ హాసన్ రాజ్యసభ నామినేషన్ వాయిదా

- **భాషా వివాద నేపథ్యం**

**చెన్నై, జూన్ 4 :** మక్కల్ నీది మయ్యం పార్టీ అధ్యక్షుడు కమల్ హాసన్ రాజ్యసభ స్థానానికి వేయాల్సిన నామినేషన్‌ను వాయిదా వేసుకున్నారు. 'థగ్ లైఫ్' సినిమా ఈవెంట్‌లో కన్నడ భాషపై మక్కల్ నీది మయ్యం పార్టీ అధినేత, ప్రముఖ నటుడు కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగిన సంగతి తెలిసిందే. ఈ భాషా వివాదం నేపథ్యంలో ఆయన రాజ్యసభ స్థానానికి నామినేషన్ దాఖలు చేయడాన్ని వాయిదా వేసుకున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. త్వరలో విడుదల కాబోయే తన చిత్రం 'థగ్ లైఫ్' వ్యవహారాలు పూర్తయిన తర్వాతే నామినేషన్ వేయాలని భావిస్తున్నట్లు తెలిపాయి. కమల్ 2018లో ఎంఎన్ఎం పార్టీని స్థాపించారు. విపక్ష ఇండియా కూటమిలో ఇది భాగం. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తమిళనాడులో డీఎంకే, కాంగ్రెస్ కూటమికి మద్దతు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఒప్పందంలో భాగంగా రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలు, పుదుచ్చేరిలోని ఒక స్థానంలో ఎంఎన్ఎం ప్రచారం చేసింది. 2025 ఎగువసభ ఎన్నికల్లో ఎంఎన్ఎం పార్టీకి రాజ్యసభ స్థానం ఇచ్చేందుకు డీఎంకే నేతృత్వంలోని కూటమి అంగీకరించింది. 2024 లోక్‌సభ ఎన్నికల



సమయంలో డీఎంకేతో కుదిరిన ఈ ఒప్పందం ప్రకారం ఎంఎన్ఎంకు ఎగువసభ స్థానం కేటాయించారు. దీంతో కమల్ హాసన్ రాజ్యసభకు వెళ్లనున్నారనే విషయాన్ని డీఎంకే-ఎంఎన్ఎం ఇటీవల ఖరారు చేశాయి. ఇటీవల నిర్వహించిన 'థగ్ లైఫ్' సినిమా ఈవెంట్‌లో తమిళం నుంచే కన్నడ పుట్టిందని కమల్ వ్యాఖ్యానించడంతో భాషా వివాదం మొదలయ్యింది. కమల్ వ్యాఖ్యలను కన్నడ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో కర్ణాటకలో 'థగ్ లైఫ్' చిత్రాన్ని నిషేధించాలని కోరుతూ ఆ రాష్ట్ర ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ హైకోర్టును ఆశ్రయించింది. ఆ పిటిషన్‌ను మంగళవారం విచారించిన న్యాయస్థానం కమల్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. క్షమాపణ చెబితే అన్నీ పరిష్కారమయ్యేవని వ్యాఖ్యానించింది. దీంతో ఈ చిత్రాన్ని కర్ణాటకలో ప్రస్తుతానికి విడుదల చేయకూడదని కమల్ హాసన్ నిర్ణయించారు. అనంతరం, తన వ్యాఖ్యలను అపార్థం చేసుకున్నారంటూ కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కి కమల్ లేఖ రాశారు. అయితే, అందులోనూ సారీ చెప్పకపోవడం గమనార్హం.

# జర్మనీలో బయటపడ్డ రెండో ప్రపంచ యుద్ధం నాటి బాంబులు..

**బెర్లిన్, జూన్ 4:** జర్మనీలోని ఓ నగరంలో రెండో ప్రపంచ యుద్ధం సమయంలోని మూడు బాంబులను గుర్తించినట్లు అధికారులు పేర్కొన్నారు. జర్మనీ లోని కొలోన్ నగరంలో రెండో ప్రపంచ యుద్ధం సమయంలోని మూడు బాంబులను కనుగొన్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. దీంతో అప్రమత్తమయిన అధికారులు బాంబులు ఉన్న ప్రాంతానికి సమీపంలోని 20వేల మందికి పైగా ప్రజలను ఇతర ప్రాంతాలకు తరలించారు. వారికి నగరానికి సమీపంలోని పలు చర్చిలు, క్రీడా మైదానాల్లో ఆశ్రయం కల్పించినట్లు పేర్కొన్నారు. కొలోన్ నగరానికి కొంత కాలం పాటు రవాణా మార్గాలు కూడా మూసివేసినట్లు తెలిపారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా నగర వ్యాప్తంగా అంబులెన్సులు, భద్రతా బలగాలను మోహరించామన్నారు.

రెండో ప్రపంచ యుద్ధం సమయంలో జర్మనీపై వేసిన బాంబుల్లో పేలని మూడు బాంబులను సోమవారం గుర్తించినట్లు అధికారులు పేర్కొన్నారు. వీటిని అమెరికా తయారు చేసినట్లుగా భావిస్తున్నారు. వీటిలో రెండు బాంబుల బరువు



చెరో 1,000 కిలోలు ఉండగా.. మరొకటి 500 కిలోలు ఉన్నట్లు గుర్తించామన్నారు. బాంబులను నిర్వీర్యం చేయడానికి ప్రత్యేక బృందాలు ప్రయత్నిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రాంతానికి 1,000 మీటర్ల వరకు డేంజర్ జోన్‌గా ప్రకటించామన్నారు. ప్రమాదవశాత్తు ఈ బాంబులు పేలితే... కిలో మీటర్ల మేర తీవ్ర ప్రభావం ఉంటుందని తెలిపారు.

1939లో పోలండ్‌పై జర్మనీ దాడితో రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే హిట్లర్ ఆధ్వర్యంలోని నాజీ సేనలను అణచివేసేందుకు అమెరికా, బ్రిటన్ దళాలు.. జర్మనీపై వేలకొద్ది బాంబులు వేశాయి. ఇప్పటికీ జర్మనీలో పెద్దసంఖ్యలో పేలని బాంబులు అప్పుడప్పుడు బయటపడుతుంటాయి. 2017లో ఫ్రాంక్‌ఫర్ట్‌లో 1.4 టన్నుల బాంబు లభ్యమైంది. 2024లో 31 బాంబులను కనుగొన్నట్లు అధికారులు పేర్కొన్నారు. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో జర్మన్ నగరాలపై 1.5 మిలియన్ బాంబులు వేయగా..వాటిలో 20శాతం బాంబులు పేలకుండా అలాగే ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు.

# మనీశ్ సిసోడియా, సత్యేంద్ర జైన్‌లకు సమన్లు

- **రూ.2 వేల కోట్ల స్కామ్..**

**ఢిల్లీ, జూన్ 4 :** తరగతి గదుల నిర్మాణాల్లో అవినీతి ఆరోపణల కేసులో ఆమ్‌ఆద్మీ పార్టీ నేతలైన మనీశ్ సిసోడియా, సత్యేందర్ జైన్‌లకు ఏసీబీ నోటీసులు జారీ చేసింది.

ఢిల్లీలోని పాఠశాల భవనాలు, తరగతి గదుల నిర్మాణాల్లో అవినీతికి పాల్పడ్డారంటూ ఇటీవల ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు మనీశ్ సిసోడియా, సత్యేందర్ జైన్‌లపై కేసు నమోదైన సంగతి తెలిసిందే. తాజాగా ఈ కేసులో అవినీతి నిరోధక శాఖ వీరికి సమన్లు జారీ చేసింది. ఈనెల 6న సత్యేందర్, 9న సిసోడియా ఢిల్లీలోని బ్యూరో కార్యాలయానికి రావాలని అందులో పేర్కొంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆప్ ప్రభుత్వ హయాంలో సిసోడియా విద్యాశాఖ మంత్రిగా, సత్యేందర్ జైన్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ మంత్రిగా ఉన్నారు. వారి నేతృత్వంలో ఢిల్లీలో 12,748 పాఠశాల భవనాలు, తరగతి గదుల నిర్మాణం తలపెట్టారు.





ఈ నిర్మాణంలో రూ.2వేల కోట్ల అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వచ్చాయి. 34 మందికి దీని కాంట్రాక్టులు దక్కగా.. వారిలో చాలామందికి ఆప్‌తో దగ్గర సంబంధాలు ఉన్నట్లు తేలింది. నిర్ణీత గడువులోగా నిర్మాణాలు పూర్తికాకపోగా, భారీగా ఖర్చు చేశారు. తరగతి గదులను 30 సంవత్సరాలు ఉండేలా కడితే.. వాటికి అయిన ఖర్చు మాత్రం చాలా ఎక్కువగా ఉంది. గడువు ప్రక్రియను పాటించకుండా కన్సల్టెంట్లు, ఆర్కిటెక్ట్‌లను నియమించుకోవడంతో వ్యయం దాదాపు ఐదు రెట్లు పెరిగిపోయింది. ఇటీవల సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) ఇచ్చిన నివేదికలో తరగతి గదుల నిర్మాణ ప్రాజెక్టులో అవకతవకలు జరిగాయని పేర్కొంది. కొత్త టెండర్లు తీసుకోకపోవడంతో ఈ ప్రాజెక్టు వ్యయం రూ.326 కోట్లు పెరిగిందని రిపోర్టులో తెలిపింది. సిసోడియా, జైన్‌లను విచారించేందుకు మార్చిలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలపడంతో ఏప్రిల్లో వీరిపై కేసు నమోదైంది.

## భూ సమస్యలపై దరఖాస్తు తక్షణమే పరిష్కారిస్తాం



తిరుమలగిరి, జూన్4 (మనంన్యూస్): రైతులు తమ భూ సమస్యలను భూ బారతీలో దరఖాస్తు చేసుకుంటే సమస్యలను వెంటనే పరిష్కారం చేస్తామని తహసిల్దార్ హరిప్రసాద్ చెప్పారు. బుధవారం తిరుమలగిరి మండలాలోని గుండెపురి గ్రామంలో జరిగిన భూ బారతీ రెవిన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ రైతులు భూ బారతి రెవిన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోని తమ భూమి సమస్యలను పరిష్కారించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# శిశు మరణాలు తగ్గించడానికి సవాలుగా తీసుకోవాలి

- వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలు బాగా కృషి చేయాలి
- శిశు మరణాలను తగ్గించడానికి అన్నిరకాలుగా సహకారం అందిస్తాం
- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ,జూన్ 4( మనం ప్రతినిధి): శిశు మరణాలు తగ్గించడాన్ని వైద్య ఆరోగ్య ,మహిళా శిశు సంక్షేమ, అనుబంధ శాఖలు సవాల్ గా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. ఈ విషయంలో అన్ని శాఖలు,వారి ప్రతినిధులు చిత్తశుద్ధితో కృషి చేయాలని పిలుపునిచ్చారు. శిశు మరణాలను తగ్గించేందుకు ఆస్కారమున్న ప్రతి కేసు విషయంలో మొదటి నుండి కృషి చేయాలని, ఒక శిశువుని కాపాడడం వల్ల ఒకరి జీవితాన్ని రక్షించిన వారమవుతామని అన్నారు. ఈ బాధ్యతను ఒక ఉద్యోగిగా కాకుండా, ఒక మనిషిగా ఇతరుల ప్రాణాలు రక్షించే అవకాశం మనకు దక్కడం అదృష్టంగా భావించి పని చేయాలని చెప్పారు .బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నల్గొండ, మిర్యాలగూడ డివిజన్ల లో సంభవించిన శిశు మరణాల పై నిర్వహించిన సమీక్ష సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...శిశు మరణాలను తగ్గించేందుకు మహిళ గర్భం దాల్చినప్పటి నుండి శిశువు పుట్టిన తర్వాత ఒక సంవత్సరం వరకు నిరంతరం పరీక్షలు నిర్వహిస్తూ, పర్యవేక్షిస్తూ తల్లి, బిడ్డ ఆరోగ్యాన్ని పరిరక్షించాలన్నారు.మొదటి కానుపుకే కాకుండా రెండు, మూడు ఎన్ని కాన్పులైనా సరే తప్పనిసరిగా ఈ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు .జిల్లాలో శిశు మరణాలు సంభవించకుండా ఉండేందుకుగాను జిల్లా యంత్రాంగం తరఫున అవసరమైన పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని, ప్రత్యేకించి శిశు మరణాలు తగ్గించడంలో వైద్యాధికారులు, ఆశ అంగన్వాడీ ల బాధ్యత ఎక్కువగా ఉంటుందని,సాధ్యమైనంత వరకు శిశు మరణాలు లేకుండా చూసుకోవాలని అన్నారు. ఎక్కడైనా కుటుంబ సమస్యలు ఉన్నట్లయితే ఈ కేసులను సిసిఎంబి,టిఫ్ఫా పరీక్షలకు పంపించాలనితెలిపారు. భవిత కేంద్రాల ద్వారా మానసిక వైకల్యం కలిగిన , విభిన్న సామర్థ్యాలు కలిగిన పిల్లలకు అందించే సేవలపై జిల్లా కలెక్టర్ సమీక్షిస్తూ జిల్లాలో సుమారు 700 మంది పిల్లలు మానసిక వైకల్యంతో బాధపడుతున్నారని, జన్యుపరమైన లోపాల వల్ల కొంతమంది మానసిక వికలాంగులుగా జన్మిస్తే, మరికొందరు పుట్టిన తర్వాత వైకల్యం , మానసిక వైకల్యం, ఇతర వ్యాధులకు గురవుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన భవిత కేంద్రాల ద్వారా వారి మానసిక వైకల్యానికి చికిత్స అందించడంతో పాటు, వారిని అందరిలా తీర్చిదిద్దడంలో భాగంగా భవిత కేంద్రాల నిర్మాణం చేపట్టడం జరిగిందని, జిల్లాలో ప్రతి మండలానికి ఒక భవిత కేంద్రాన్ని నిర్మిస్తున్నామని, మానసిక వికలాంగుల వికలాంగతను దృష్టిలో ఉంచుకొని వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం, వారి ప్రత్యేక అవసరాలు దృష్టిలో పెట్టుకుని మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు. గర్భధారణ సమయంలోనే కొన్ని లోపాలు ఉంటున్నాయని, మానసిక వైకల్యంతో పుట్టిన వారి మానసిక వికాసానికి చికిత్స చేయడం ఒక ఎత్తయితే, అసలు వారు ఇలాంటి మానసిక వైకల్యానికి గురి కాకుండా చూడాల్సిన బాధ్యత వైద్య ,శిశు సంక్షేమ శాఖల పై ఉందని అన్నారు. ఇందులో భాగంగా విద్యార్థి దశ నుండి విద్యార్థినులకు అన్ని విషయాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. జూన్ 12 నుండి జిల్లా వ్యాప్తంగా ఒక షెడ్యూల్ ను స్పందించి ఈ షెడ్యూల్ ప్రకారం ఆశ ,అంగన్వాడీ, సైన్సు టీచర్లు పాఠశాలల్లోని విద్యార్థినిలకు అవగాహన కల్పించాలని చెప్పారు . శుక్రవారం లోగా జాబితా తయారు చేసి సమర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆమె ఆదేశించారు .ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నల్గొండ, మిర్యాలగూడ డివిజన్ల లో సంభవించిన శిశు మరణాలపై కేసుల వారీగా సమీక్ష నిర్వహించారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, జిల్లా ఏరియా ఆస్పత్రిల కో-ఆర్డినేటర్ డాక్టర్ మాత్రు నాయక్ ,డీఈఓ ,డిప్యూటీ డి ఎం హెచ్ వో లు, ఈ సమావేశానికి హాజరయ్యారు.




## ప్రైవేటు స్కూళ్లలో జర్నలిస్టు పిల్లలకు 50శాతం ఇవ్వాలి



- టీయూడబ్ల్యూజే, (ఐజేయు) జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డి

నల్లగొండ,జూన్ 4( మనం ప్రతినిధి): నల్గొండ జిల్లా పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న వారి పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని పియూడబ్ల్యూజే (ఐజేయు)జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డి, జర్నలిస్టు సంఘాల నాయకుల ఆధ్వర్యంలో బుధవారం డీఈవో బిక్షపతికి వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన డిఈఓ మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం రాయితీ ఇప్పించేందుకు అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో అమలయ్యేందుకు కృషి చేస్తానని డిఇఓ హామీ ఇచ్చారు. ఏదైనా పాఠశాల యజమాన్యం వినకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వెంటనే ప్రొసీడింగ్ ఇవ్వాలని అధికారులను వెంటనే ఆదేశించారు.

డీఈఓ కు వినతి పత్రం సమర్పించిన వారిలో ప్రెస్ క్లబ్ జిల్లా అధ్యక్షులు మాదరి యాదగిరి, జిల్లా నాయకులు పులిమామిడి మహేంద్ర రెడ్డి, టౌన్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఏరెడ్ల చంద్రశేఖర్ రెడ్డి, జర్నలిస్టులు గంగాధర్ వెంకటేశ్వర్లు, సోమ చంద్రశేఖర్, జిల్లా యాదయ్య, అంజయ్య, అశోక్, తెలుగ మల్ల దశరథ, రాంప్రసాద్, ఊర రమేష్ తదితరులు ఉన్నారు.

# బాధిత కుటుంబాలకు జనసేన చేయూత

- ప్రమాదంలో మృతి చెందిన కార్యకర్త కుటుంబానికి ఐదు లక్షల బీమా చెక్కు అందించిన జనసేన
- కంటతడి పెట్టుకున్న కుటుంబ సభ్యులు



గరిడేపల్లి,జూన్ 4 (మనం న్యూస్): పవన్ కళ్యాణ్ అభిమానులకు జనసేన పార్టీ కార్యకర్తలకు పార్టీ అండగా ఉండి కంటికి రెప్పలా కాపాడుకుంటుందని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి సరికొప్పుల నాగేశ్వరరావు అన్నారు.జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వం కలిగి ఉండి ఇటీవల మండలంలోని వెంకట్రాంపురం గ్రామానికి చెందిన కుర్ర సైదులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు.మృతుని కుటుంబానికి బుధవారం 5 లక్షల ప్రమాద బీమా చెక్కును పార్టీ శ్రేణులతో కలిసి మండల కేంద్రంలో వారికి అందజేశారు.అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.భారతదేశ చరిత్రలోనే అభిమానుల కుటుంబాల కోసం ఏ పార్టీ కూడా చేయని విధంగా కార్యకర్తలకు అండగా ప్రమాద బీమా పథకాన్ని ఏర్పాటు చేసి పార్టీ శ్రేణుల కుటుంబాలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న ఘనత ఒక పవన్ కళ్యాణ్ కి తగ్గిందని వారన్నారు.కుటుంబంలో పెద్దదిక్కుని కోల్పోయిన ఆ కుటుంబానికి కొండంత అండగా పార్టీ ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రమాదంలో మరణించిన పార్టీ శ్రేణుల కుటుంబానికి జనసేన అధినేత ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఐదు లక్షల ప్రమాద బీమా చెక్కును మంజూరు చేయడం జరిగిందని,తెలంగాణ రాష్ట్ర ఇన్చార్జి శంకర్ గౌడ్ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాల ఇన్చార్జి మేకల సతీష్ రెడ్డి సూచనల మేరకు ఈ చెక్కును ఆయన కుటుంబ సభ్యులకు అందించినట్లు తెలిపారు.జనసేన సభ్యత్వం నమోదు చేయించిన అందే శ్రీను ను తోడ్పాటు అందించిన కీసర నరేష్ ని ఆయన అభినందించారు.కార్యక్రమంలో గరిడేపల్లి పట్టణ అధ్యక్షులు సామోజు నరసింహ చారి,మండల అధ్యక్షులు పిల్లుట్ల రమేష్,మామిడి కాశి,గిరి,గోపి,వీరబాబు,అంజి,తోట సైదులు,శివ పలువురు పార్టీ కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మనం కథనానికి స్పందించిన అధికారులు




దేవరకొండ, జూన్ 4(మనం న్యూస్): మనం దిన పత్రికలో మే 20న తాటికొల్ గ్రామంలో జోరుగా రియల్ దందా అన్న కథనానికి అధికారులు స్పందించారు. దేవరకొండ మండల కేంద్రంలోని తాటికల్ గ్రామంలో అనుమతులు లేకుండా వెంచర్ పనులు కొనసాగిస్తున్న అక్రమదారుల పట్ల అదికారులు నిర్లక్ష్యం వహించడంతో 'మనం' దిన పత్రికలో వెలువడిన వెంటనే అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి గ్రామ సెక్రెటరీ వెంచర్ డెవలపర్ ని మందలించడం జరిగింది . దేవరకొండ నియోజకవర్గం సంబంధించిన అధికారి డిఎల్పిఓ తాటికొల్ గ్రామంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న వెంచర్ ని పరిశీలించి అందులో ఉన్న సమస్యలను పరిశీలించడం జరిగింది.

## భూ భారతితోనే భూ సమస్యల పరిష్కారం





తుంగతుర్తి,జూన్ 4,(మనం న్యూస్): ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి తోనే భూ సమస్యల పరిష్కారం జరుగుతుందని తహసిల్దార్ దయానందం అన్నారు బుధవారం మండల పరిధిలోని కరివిరాల మానాపురం గ్రామాల లో ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సులను ప్రారంభించి మాట్లాడారు. రైతులు ప్రజలు ఈ సదస్సులను సద్వినియోగ పరుచుకొని తమ భూ సమస్యలను కొరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సదస్సుల్లో పలువురు రైతులు, ప్రజలు తమ యొక్క భూ సమస్యల పరిష్కారానికై రైతులు కరివిరాల లో మొత్తం 121 దరఖాస్తులు సమర్పించగా అందులో మిస్సింగ్ సర్వే నెంబర్లు 13, డిఎస్ పెండింగ్ 01, వారసత్వం 12 సాదా బైనామా 90 సాధారణ తెల్ల పేపర్ దరఖాస్తులు 05 వచ్చాయి. మానాపురం లో మొత్తం 46 దరఖాస్తులు సమర్పించారు. అందులో మిస్సింగ్ సర్వే నెంబర్లు 15 ,సాదా బైనామా 31, దరఖాస్తులు సమర్పించారు. వీటన్నిటిని పరిశీలించి పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ రవీందర్ రెడ్డి రెవెన్యూ సిబ్బంది, రైతులు, ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కల్తీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవు

- ఏడీఏగా బాధ్యతలు స్వీకరించిన ఎల్.రమేష్ బాబు
- విత్తనాల దుకాణాల్లో ప్రతి రైతు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలి
- రైతులు ప్రభుత్వ అనుమతి పొందిన దుకాణాలలో మాత్రమే ఎరువులు, మందులు తీసుకోవాలి



తుంగతుర్తి, జూన్ 4(మనం న్యూస్): మండల పరిధిలోని రైతులకు మెరుగైన సేవలందించేందుకు ప్రత్యేక చొరవ చూపుతామని వ్యవసాయ అధికారి ఎల్ రమేష్ బాబు తెలిపారు బుధవారం నూతన వ్యవసాయ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. గద్వాల నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చానన్నారు.ఇప్పటివరకు వ్యవసాయ ఇంచార్జ్ అధికారిగా పనిచేసిన బాలకృష్ణ బాధ్యతలు అప్పగించిన అనంతరం నూతన బాధ్యతలు స్వీకరించిన వ్యవసాయ అధికారి స్థానిక వ్యవసాయ సిబ్బందితో సమావేశమై మాట్లాడుతూ సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించి రైతులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి రైతుకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు క్షేత్రస్థాయిలో ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉంటూ ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించాలన్నారు . కల్తీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు నకిలీ విత్తనాలు వాడితే భూసారం దెబ్బతింటుందని రైతులకు వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. కల్తీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని, రైతులు ప్రభుత్వం గుర్తింపు పొందిన దుకాణాల వద్దనే ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులను కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసేటప్పుడు రైతులు తప్పనిసరిగా రసీదు తీసుకొని పంట పూర్తయ్యే వరకు అట్టి రసీదును భద్రపరుచుకోవాలని, రైతులు ఒకే రకం పంటలు పెట్టకూడదని, రెండు, మూడు రకాల పంటలు పెట్టుకుంటే దిగుబడి ఎక్కువగా వస్తుందని, నకిలీ విత్తనాలతో భూసారం దెబ్బతింటుందన్నారు. అనంతరం ఏడీఏ రమేష్ బాబును వ్యవసాయ శాఖ సిబ్బంది పూలమాలలు శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యాలయ సిబ్బంది, ఎరువుల దుకాణాల డీలర్లు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో వివిధ మండలాల ఏవోలు, ఏఈవోలు, డీలర్లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారాన్నికై రెవిన్యూ సదస్సులు



- రేషన్ దుకాణాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

మేళ్లచెరువు, జూన్ 4 (మనం న్యూస్): భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించటానికే రెవిన్యూ సదస్సులను నిర్వహించటం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు అన్నారు. బుధవారం మేళ్లచెర్వు మండలం రేవూరు జరుగుతున్న రెవిన్యూ సదస్సులో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... క్షేత్ర స్థాయి లో సమస్యలు తెలుసుకునేందుకు జూన్ 3 నుంచి జూన్ 20 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సదస్సుల ద్వారా రైతులు తమ సమస్యను ధరఖాస్తు రూపంలో సమర్పించాలని తదుపరి క్షేత్ర స్థాయి లో విచారణ చేసి సమస్య పరిష్కరించటం జరుగుతుందని హామీ ఇచ్చారు. భూభారతి చట్టం ఏప్రిల్ 14న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా భూభారతి చట్టాన్ని అమల్లోకి తీసుకొనిరాగా ఆ తర్వాత మొదటి దశలో ఏప్రిల్ 17 నుంచి రాష్ట్రములోని 4 మండలాల్లో పైలెట్ ప్రాజెక్ట్ గా , రెండో దశలో మే 5 నుంచి జిల్లాకి ఒక మండలం పైలెట్ ప్రాజెక్ట్ లో భాగంగా గరిడేపల్లి మండలంలో 11 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రజల నుండి దగఖాస్తులని స్వీకరించామని స్పష్టం చేశారు. అట్టి ధరఖాస్తులు క్షేత్ర స్థాయి లో పరిశీలించి సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే రేవూరు, మేళచెర్వు గ్రామంలోని రేషన్ దుకాణాలు తనిఖీ చేసి ప్రజలు ఇబ్బందిపడకుండా సన్నబియ్యం పంపిణి చేయాలని రేషన్ డీలర్లను ఆదేశించారు. అనంతరం మేళ్లచెరువు లోని శ్రీనివాస సాయి శివయ్య రైస్ మిల్లుని, అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ రాజేందర్ రెడ్డి, నాగార్జున రెడ్డి,ఆర్ ఐ లు సుశీల, మోషీన్ బాబా, జానకిరాంరెడ్డి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి గొప్ప వేదిక భూభారతి చట్టం



వలిగొండ, జూన్ 4(మనం న్యూస్): భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి గొప్ప వేదిక భూభారతి చట్టం అని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు సూచించారు. బుధవారం రోజు న వలిగొండ మండలం నాగారం గ్రామంలో భూభారతి రెవెన్యూ సదస్సులలో కలెక్టర్ పాల్గొన్నారు. రెవెన్యూ సదస్సులో జిల్లా కలెక్టర్ పాల్గొని భూ సమస్యలపై దరఖాస్తులను పరిశీలించారు. ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. భూ భారతి చట్టంలోని అంశాలను వివరిస్తూ, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. భూ సమస్యలు పరిష్కరించి, రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకే ప్రభుత్వం భూభారతి చట్టం అమలు చేస్తోందని కలెక్టర్ స్పష్టం చేశారు. భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు సదస్సులలో స్వీకరించి ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా భుభారతి కింద వచ్చిన అన్ని అర్జీలను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని అన్నారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన, విచారణ కోసం వచ్చే రెవెన్యూ బృందాలకు సహకరించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో వలిగొండ మండల తాసిల్దార్ దశరథ, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## రైతులకు ప్రభుత్వ సబ్సిడీ కింద పచ్చిరొట్టి విత్తనాలు



అడవిదేవులపల్లి, జూన్ 4(మనం న్యూస్): వానాకాలం 2025-2026 కు గాను అడవిదేవులపల్లి మండల రైతులకు జీలుగా మరియు జనము పచ్చిరొట్టి విత్తనాలు 50శాతం సబ్బిసిడి తో ప్రభుత్వం రైతులకు అందజేస్తున్నదని మండల వ్యవసాయ అధికారిణి జి. సరిత ఓ ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిలుగ విత్తనాలు 30 కేజీల ప్యాకేజి పూర్తి ధర 4275 రూపాయలు కాగా సబ్బిసిడి ధర 2137 పోను, రైతు చెల్లిొచేది 2137.50 సర్వీస్ చార్జీలు 32.10 బస్తా చెల్లిొచవలసి ఉంటుందని అన్నారు.జనము విత్తనాలు 40కేజీ ల బస్తా 5020 రూపాయలు సబ్సిడీ ధర 2510 రూపాయలు పోను రైతు చెల్లించాల్సిన ధర 2510 రూపాయలు, బస్తా సర్వీస్ చార్జీ 37.60 కలిపి చెల్లించాలని అన్నారు.కావున రైతులు ఈ అవకాశంను సద్వినియోగం చేసుకునేందుకు వారి యొక్క పట్టా పాస్ పుస్తకం,ఆధార్ కార్డ్ జిరాక్స్ పత్రులను పిఏసీఎస్ దామరచర్ల మండలం నద్దు సమర్పించి విత్తనాలు కొనుగోలు చేయాలనీ ఆమె తెలిపారు.

## మోటకొండూరు వాసి బొబ్బల జ్యోతికి గవర్నర్ చేతుల మీదుగా పీహెచ్డీ డిగ్రీ ప్రదానం




మోటకొండూర్, జూన్ 4 (మనం న్యూస్): జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్టీయూ), హైదరాబాద్లో నిర్వహించిన 13వ స్నాతకోత్సవ కార్యక్రమంలో మోటకొండూరు మండలానికి చెందిన బొబ్బల జ్యోతికి గౌరవనీయులు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శ్రీ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా ప్రతిష్టాత్మక డాక్టరేట్ (పీహెచ్డీ) డిగ్రీ ప్రదానం చేయడం జరిగింది. భౌతిక శాస్త్రంలో ఆమె చేసిన పరిశోధనలు జాతీయ, అంతర్జాతీయ స్థాయి జర్నల్స్లో విశేష గుర్తింపు పొందాయి. 'క్యారెక్టరైజేషన్ ఆఫ్ మెటీరియల్స్ యూజింగ్ ముల్లర్ మెట్రిక్స్ ఫార్మాలిజం అండ్ స్టోక్స్ వెక్టార్స్' అనే అంశంపై ఆమె చేసిన పరిశోధనల దృష్ట్యా ఈ గౌరవప్రదమైన పీహెచ్డీ డిగ్రీని ఆమెకు జేఎన్టీయూ అందజేసింది. ఆమె సాధన యువ శాస్త్రవేత్తలకు ఆదర్శంగా నిలుస్తోంది. ఈ ఘనతకు గాను ఆమెకు కుటుంబ సభ్యులు, గురువులు, సహచరులు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

# భూభారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



వరంగల్, జూన్ 4 (మనం ప్రతినిధి): భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు.బుధవారం వరంగల్ మండలం యెనుమాముల, ఖిలా వరంగల్ మండలం అల్లిపూర్ గ్రామాలలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులలో కలెక్టర్ పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. భూ భారతి చట్టంలోని అంశాలను వివరిస్తూ, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. భూ సమస్యలు పరిష్కరించి, రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకే ప్రభుత్వం భూభారతి చట్టం అమలు చేస్తోందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇప్పటికే వర్ధన్నపేట మండలంలో పైలెట్ ప్రాతిపదికన రెవెన్యూ సదస్సులు జరిపి, క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేశామని అన్నారు. ప్రస్తుతం జిల్లాలోని 12 మండలాలోని రెవెన్యూ గ్రామాలలో ఈ నెల 20వ తేదీ వరకు సదస్సులు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్ల నేతృత్వంలో రెండు బృందాలను నెలకొల్పి, ప్రతి రోజు ప్రతి మండలంలో రెండు గ్రామాలలో రెవెన్యూ సదస్సులు జరిపేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు.భూ రికార్డులలో పేరు తప్పులు, విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారసత్వ భూములు, భూ స్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్స్ లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్-బిలో చేర్చిన భూముల సమస్యలు, భూసేకరణ కేసులు తదితర భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు సదస్సులలో స్వీకరించి భూభారతి కొత్త చట్టం ప్రకారం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్దేశిత గడువు లోపు సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. నిర్ణీత షెడ్యూల్ ను అనుసరిస్తూ ఆయా గ్రామాలలో అధికారులు ఉదయం నుండి సాయంత్రం వరకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రభుత్వపరంగా నిర్ణీత ప్రొఫార్మాలో ప్రింట్ చేసిన దరఖాస్తులను అందజేయడం జరుగుతుందన్నారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన, విచారణ కోసం వచ్చే రెవెన్యూ బృందాలకు సహకరించాలని కలెక్టర్ సూచించారు.ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్ డెస్క్, జనరల్ డెస్క్ ల వద్ద సదుపాయాలు, సిబ్బంది పనితీరును కలెక్టర్ పరిశీలన జరిపి, సమర్ధ నిర్వహణకు అధికారులకు పలు సూచనలు చేశారు. అర్జీలు సమర్పించేందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. భూ సంబంధిత సమస్యలు ఉన్న వారు నిర్ణీత ప్రొఫార్మా లో సరైన విధంగా దరఖాస్తు చేసుకునేలా సహకారం అందించాలని హెల్ప్ డెస్క్ సిబ్బందిని ఆదేశించారు.ఈ కార్యక్రమాల్లో తహశీల్దార్లు ఇక్బాల్, నాగేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## రేషన్ షాప్ తనిఖీ చేసిన కలెక్టర్



వరంగల్,జూన్ 4 (మనం ప్రతినిధి): రేషన్ షాపుల ద్వారా సకాలంలో వినియోగదారులకు రేషన్ బియ్యం ఇతర వస్తువులు పంపిణీ చేయాలని ఎప్పటికప్పుడు సంబంధిత రికార్డులను నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు.బుధవారం వరంగల్ మండలంలోని ఏనుమాముల భూభారతి గ్రామసభలో పాల్గొని తిరిగి వెళుతున్న క్రమంలో వరంగల్ మండలంలోని బాలాజీ నగర్ లో చౌక ధరల దుకాణం వద్ద ఎక్కువ మంది గుమ్మిగూడి ఉనట్లు గమనించిన కలెక్టర్ వెంటనే తన వాహనాన్ని ఆపి బాలాజీనగర్ రేషన్ షాప్ ను తనిఖీ చేశారు. ఎండాకాలం దృష్ట్యా వినియోగదారులకు ఇబ్బందులు కలుగకుండా వారి సౌకర్యార్థం ప్రతిరోజు 15 చొప్పున టోకెన్లు ముందుగానే అందజేసి క్రమ పద్ధతిలో బియ్యం, ఇతర వస్తువులు పంపిణీ చేయాలని డీలర్ ను కలెక్టర్ ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వం 3 నెలల బియ్యం ఒకేసారి అందిస్తున్న నేపథ్యంలో బయోమెట్రిక్ ద్వారానే రేషన్ పంపిణీ జరగాలన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ వినియోగదారులతో నేరుగా మాట్లాడుతూ రేషన్ సక్రమంగా అందుతున్నదా అని అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్న బియ్యం నాణ్యతను పరిశీలించారు.

పేదవారికి కూడా సన్న బియ్యం పంపిణీ చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం సన్న బియ్యం కార్యక్రమం పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నదని, పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తప్పవని రేషన్ డీలర్ ను హెచ్చరించారు. షాప్ కు సంబంధించిన స్టాక్ వివరాలు బోర్డులు, ఫ్లెక్సీల ద్వారా ప్రజలకు కనిపించే విధంగా ప్రదర్శించాలని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు.

## రెవెన్యూ సదస్సును పరిశీలించిన అదనపు జిల్లా కలెక్టర్



మహబూబాబాద్,జూన్ 4 (మనం ప్రతినిధి): బుధవారం బయ్యారం మండలం గ్రామంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సును అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.వీరబ్రహ్మాచారి, పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి నూతన ఆర్ఓఆర్ చట్టం-అని, భూ సమస్యలు పరిష్కారానికి మంచి పథకం ద్వారా రైతులకు సులభతరమైన న్యాయమైన విస్తృత సేవలు అందించాలని మంచి ఉద్దేశంతో ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు.ఈ సదస్సులో సమస్యలు ఉన్న రైతులు, ప్రజలు వినియోగించుకోవాలి సూచించారు. దరఖాస్తు ఇవ్వడం కోసం వచ్చే వారికి కేంద్రంలో అన్ని ఏర్పాట్లు సమకూర్చాలన్నారు. రెండు బృందాలుగా రెవెన్యూ సిబ్బందిని నియమించి క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక తాహిసిల్దార్ నాగరాజు, ఉన్నారు.

## విత్తనాలు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు

- ప్రభుత్వం గుర్తించిన నాణ్యమైన విత్తనాలను మాత్రమే రైతులకు అమ్మాలి
- కల్తీ, నాణ్యత లేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు
- జిల్లా కలెక్టర్ దివాకర



ములుగు, జూన్ 4(మనం ప్రతినిధి): ప్రభుత్వం గుర్తించిన నాణ్యమైన విత్తనాలను మాత్రమే రైతులకు అమ్మాలని, విత్తనాలు అధిక ధరలకు,కల్తీ, నాణ్యత లేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సూచించారు.బుదవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ములుగు జిల్లాలోని సమస్త విత్తన ఎరువుల, పురుగు మందుల డీలర్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విత్తన డీలర్లు అందరూ కూడా ప్రభుత్వ ఆదేశానుసారము వ్యవసాయ శాఖ సూచనలు మేరకు విత్తన కొనుగోలు చేసిన ప్రతి రైతుకి బిల్ ఇవ్వవలసిందిగా అట్టి బిల్లు మీద లాట్ నెంబర్, ఎక్స్‌ఫరీ డేట్ రైతు యొక్క పూర్తి వివరాలు రాయాలని దాని మీద తప్పకుండా విత్తన షాపు యజమాని, రైతు సంతకము తీసుకోవాలని ఆదేశించారు. ఇట్టి బిల్లును పంట కాలువ అయ్యే వరకు కూడా భద్రపరుచుకోవాలని ప్రభుత్వ అనుమతి పొందిన విత్తనాలను మాత్రమే అమ్మకాలు చేయాలని అదేవిధంగా వరి పంటకు సంబంధించి కేఎన్ఎం 1638,ఎంటుయు 1224 రకాలు అవుట్ టన్ను సరిగా రావడం లేదని, నూక శాతం ఎక్కువగా వస్తున్న వలన అట్టి రకాలను తక్కువ విస్తీర్ణంలో సాగు చేసే విధంగా చూడవలసిందిగా కోరారు. పోలీస్, వ్యవసాయ శాఖలతో టాస్కోఫర్స్ ఏర్పాటు చేయడం జరిగిందని ఫోర్స్ బృందాలు ములుగు జిల్లాలోని ప్రతి విత్తన షాపులని విధిగా తనిఖీ చేయాలని ఆకస్మిక దాడులు నిర్వహించాలని ఏదైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు వారి దృష్టికి వచ్చినచో కఠినమైన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి సురేష్ కుమార్ మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలు గాని చట్ట ఉల్లంఘన చేసినచో కఠిన చర్యలు తీసుకోబడతాయని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, గ్రా.రవీందర్ డిఎస్పీ, సహాయ వ్యవసాయ సంచాలకులు అవినాష్ వర్మ, ఏటూరు నాగారం, టాస్క్‌ఫోర్స్ సిఐ రమేష్, సమస్త మండల వ్యవసాయ అధికారులు, ఫర్టిలైజర్ సీడ్, పెస్టిసైడ్ దుకాణ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

## పిఎంఎస్ఎస్‌వై సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి బలోపేతానికి కృషి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



వరంగల్, జూన్ 4 (మనం ప్రతినిధి): రోగులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు పి ఎం ఎస్ ఎస్ వై సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో శాశ్వత ప్రాతిపదికన అవసరమగు మౌళిక సదుపాయాల కల్పనకు వెంటనే నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. బుధవారం కేఎంసీలోని పి ఎం ఎస్ ఎస్ వై సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆకస్మికంగా సందర్శించి హాజరు రిజిస్టర్ పరిశీలించి, ఆలస్యంగా విధులకు విధులకు హాజరై ఇద్దరు డాక్టర్లు, హెడ్ నర్స్ నుండి సంజాయిషీ కోరాలని పర్యవేక్షకులను ఆదేశించారు.ఆసుపత్రి మొత్తం డాక్టర్లు, అధికారులతో కలియతిరిగి ఆసుపత్రికి కావలసిన అవసరాల గురించి ఆరా తీశారు. అందుతున్న వైద్య సేవల గురించి రోగులను నేరుగా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రిలో శానిటేషన్, సివిల్, ఎలక్ట్రికల్, వాటర్, ఎక్విప్మెంట్, తదితర సమస్యలను అధిగమించుటకు, వివిధ విభాగాల ప్రభుత్వ ఇంజనీరింగ్ అధికారులతో నియమించిన బృందం, పీఎంఎస్ఎస్ వై ఆసుపత్రిలో శాశ్వత ప్రాతిపదికన అవసరమగు సదుపాయాల కల్పనతో పాటు ఎంజీఎం ఆసుపత్రిలో అత్యవసరంగా కావలసిన అవసరాలపై క్షేత్రస్థాయిలో కూలంకషంగా పరిశీలించి జూన్ 6వ తేదీ నాటికి నివేదిక సమర్పించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఫార్మసీలో ఈ ఔషధీ ప్రకారం మందుల నిల్వలను పరిశీలించారు. ఆసుపత్రిలో హీటింగ్ వెంటిలేషన్ ఏర్ కండిషన్ సిస్టం మరమ్మత్తులతోపాటు ఆపరేషన్ థియేటర్లలో ఏయిర్ కండిషన్లు ఏర్పాటు చేయాలని, 5 అంతస్తులు గల ఆపరేషన్ థియేటర్ జూన్ 10వ తేదీ లోగా రోగులకు సేవలు అందించుటకు అందుబాటులోకి రావాలని ఆదేశించారు. డయాలసిస్ కేంద్రంలో అదనంగా పెంచిన ఏడు పడకలు, బ్లడ్ ప్యూరిఫైయింగ్ థియేటర్, రోగులు వారి అటెండెన్స్ ల కొరకు షెడ్, ఇందిరా మహిళా క్యాంటీన్ ను ఏర్పాటు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో కేఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ రామ్ కుమార్ రెడ్డి, డాక్టర్ మురళి, జడ్పీ సీఈఓ రామిరెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి పుష్పలత,ఎన్పిడిసిఎల్ ఎస్ ఈ గోపాల్ రెడ్డి టీజీ ఈడబ్ల్యూఐడిసి, టీజీఎంఐడిసి, ఇరిగేషన్ శాఖల ఈ ఈ లు ప్రసాద్ రవీందర్ సునీత, సంబంధిత శాఖల అధికారులు డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ పాలన లో అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు



మంగపేట,జూన్ 4(మనం ప్రతినిధి): ఇందిరమ్మ పాలనలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ గృహాలను అందజేస్తామని మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మైలా జయరామ్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఇందిరమ్మ గృహాల లబ్ధిదారులకు నిర్మాణ పట్టాలను అందజేసిన సందర్భంగా బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు రాష్ట్ర ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టత్మకంగా ప్రవేశపెట్టిన 6 గ్యారంటీ సంక్షేమ పథకం లో ఒకటి ఇందిరమ్మ ఇల్లులను మొదట విడుత గా ప్రతి మండలం లో ఒక గ్రామాన్ని పైలేట్ ప్రాజెక్టు క్రింద ఆదర్శ గ్రామం ను తీసుకొని ఇండ్లు నిర్మాణం చేస్తున్నారు అదేవిధంగా రెండో విడుత గా మన మంగపేట మండలం లో పార్టీ లకు అతీతంగా అర్హులు అయినా సుమారుగా 583 ఇండ్ల ను రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఇందిరమ్మ కమిటీ చే ప్రొసీడింగ్స్ (ఇండ్ల పట్టాలను) ఇవ్వడం జరుగుతుంది మూడు, నాలుగు విడుతల్లో కూడ ఇండ్ల పంపిణీ చేపట్టడం జరుగుతుందన్నారు. మొదటి, రెండవ, విడుతల్లో రానీ ప్రజలు ఎవ్వరు కూడ మాకు రాలేదు, రాదు అని నిరాశకు గురి కావొద్దన్నారు. మంత్రి సీతక్క చొరవ తో అర్హత కలిగిన ప్రతి కుటుంభానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించే దిశ గా ప్రజా ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు.

## జనగామ బ్యూటిఫికేషన్ పనులను పరిశీలించిన కలెక్టర్




జనగామ,జూన్ 4(మనం ప్రతినిధి): 30 లక్షలతో చేపట్టిన జనగామ పట్టణ సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.బుధవారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ తో కలిసి జనగామ పట్టణానికి సంబంధించి హనుమకొండకు వెళ్లే దారిలో సి.బి.ఎఫ్. నిధులు 30 లక్షలతో నిర్మిస్తున్న ఆర్చి, విద్యుద్దీకరణ పనులను సంబంధిత మునిసిపల్ అధికారులతో కలెక్టర్ సందర్శించి పరిశీలించారు.జనగామ ముఖద్వారం ప్రయాణికులకు పట్టణ ప్రజలకు ఆకర్షణీయంగా కనిపించే విధంగా సుందరీకరణ పనులను చేపట్టాలని అన్నారు. విద్యుద్దీకరణతో హైవేపై వెళ్లే వారికి కూడా జనగామ ముఖద్వారం అందంగా కనిపించే విధంగా రూపొందించాలన్నారు. స్వాగతం తో పాటు ప్రభుత్వ చిహ్నాన్ని కూడా ఏర్పాటు చేయాలన్నారు.అంతేకాకుండా పరిసరాల్లోని చెత్తాచెదారాన్ని తొలగింపజేయాలని అందమైన చెట్లను నాటింపచేయాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ మహిపాల్ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుంది

- అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు
- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు



పెద్దపల్లి, జూన్ 4 (మనం ప్రతినిధి): పెద్దపెల్లి జిల్లా ఓదెల మండలం, గుండ్లపల్లి గ్రామంలో బుధవారం రోజున 8 లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణల కోసం స్థానిక నాయకులతో శంకుస్థాపన చేసి అనంతరం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు పట్టాలను అందజేసి నూతన ఇండ్ల నిర్మాణాలకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గంలో ప్రభుత్వం 3,500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిందన్నారు. ఈ గ్రామంలో 25 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా 15 ఇండ్లకు ముగ్గురు పోయడం జరిగింది అన్నారు. స్పెషల్ డెవలప్మెంట్ కింద 8 లక్షలతో సిసి రోడ్లకు శంకుస్థాపన చేయడం జరిగింది అన్నారు. 15 నెలల కాలంలోనే ఈ గ్రామంలో 40 లక్షలతో సిసి రోడ్లు కు నిధులు ఇవ్వడం జరిగింది అన్నారు. ఈ గ్రామంలో ప్రతి గల్లీకి సీసీ రోడ్లు నిర్మించడంతో పాటు డ్రైనేజీ నిర్మాణాలు కూడా చేపడుతామన్నారు. దశలవారీగా గ్రామాలను అభివృద్ధి చేయడం జరుగుతుంది అన్నారు. 17 నెలల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులు, ఇండ్లు, అభివృద్ధి విషయంలో ఎలాంటి రాజి పడకుండా అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. బిఆర్ఎస్ పదేళ్ల కాలంలో ఇంతవరకు నిరుపేదలకు ఇల్లు ఇవ్వకుండా మోసం చేసింది అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుంది అన్నారు. శానకొండ గ్రామంలో పైలట్ ప్రాజెక్టు కింద 42 ఇళ్ల వరకు బేస్ మెట్లు కాగా వారందరికీ లక్ష రూపాయలు ఇవ్వడం జరిగింది అన్నారు. ఇల్లు కట్టుకున్న వారికి ప్రభుత్వం ఐదు లక్షలు ఇస్తుంది అన్నారు. నేను శాసనసభ్యుడిగా ఎన్నికైన తర్వాత గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నాను అన్నారు. ప్రభుత్వం సన్నవడ్లకు బోనస్ ఇచ్చి రైతులను ఆదుకుంటుంది అని గత 30 సంవత్సరాలుగా ఎన్నడు లేని విధంగా ఈ వేసంగి ఘనమైన వరి పంట పండిందని రైతులకు 10 నుంచి 15వేల రూపాయలు అదనపు లాభం వచ్చిందన్నారు. ఈ వేసవిలో సన్న ధాన్యం పండించిన రైతులకు 31కోట్లు ఆపైన రూపాయలు ఈ వారం రోజుల్లో ప్రభుత్వం బోనస్ వేస్తుంది అని ప్రభుత్వం బోనస్ ఇవ్వడంతో సీడ్ కంపెనీలు కూడా రైతులకు అదనంగా వడ్లకు ధర పెంచింది అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, పుప్పాల శంకర్, గ్రామ శాఖ అధ్యక్షులు పెద్దిరెడ్డి రఘుపతి రెడ్డి,పడాల రాజు, సింగిల్ విండో అధ్యక్షులు ఆళ్ల సుమన్ రెడ్డి, ఆకుల మహేందర్, చీకట్ల మొండయ్య, రెడ్డి రజనీకాంత్, సాగర్ రెడ్డి మరియు మాజీ సర్పంచ్, ఎంపీటీసీ లు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



- బల్దియా కమిషనర్ డా. అశ్విని తానాజీ వాకడే

వరంగల్, జూన్ 4 (మనం ప్రతినిధి): పరిసరాలను పరిశుభ్రం గా ఉంచుకోవాలి బల్దియా కమిషనర్ డా. అశ్విని తానాజీ వాకడే అభిప్రాయ పడ్డారు.వంద రోజుల ప్రణాళిక అమలులో భాగం గా బుధవారం 6,9 వ డివిజన్ లోని కిషన్ పుర కాకతీయ కాలనీ ప్రాంతాల్లో కార్పొరేటర్ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయి లో సందర్శించి నిర్వహించిన స్వచ్ఛ ర్యాలీ లో పాల్గొన్నారు.ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య అవగాహన లో భాగం గా వర్షాకాలం నేపథ్యం లో సీజనల్ వ్యాధులు ప్రబల కుండా పరిసరాలను శుభ్రం గా ఉంచుకోవాలని తడి పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ స్వచ్ఛ ఆటో లకు అందించడం దిన చర్యగా అలవాటు చేసుకోవాలని వ్యాపారాలు నిర్వహించే దుకాణ దారులు ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని ప్రతి రోజు నగర వ్యాప్తం గా పరిశుభ్రమైన నీటిని అందజేయడానికి నీటి సరఫరా సిబ్బంది క్లోరిన్ పరీక్ష లు నిర్వహించి నీటి లో పి పి ఎం స్థాయి లను నిర్ధారించిన తరువాతే నీటి సరఫరా చేస్తారని జీ డబ్ల్యూ ఏం సి పరిధిలోని ప్రాంతాలను నివాస యోగ్యమైన స్థిరమైన కార్యాచరణకు అనుకూలమైన నగరంగా తీర్చిదిద్దేందుకు వంద రోజుల కార్యచరణ ప్రణాళిక కొనసాగుతుందని పరిసరాలను శుభ్రంగా ఉంచడానికి స్థానిక ప్రజలను భాగస్వాములను చేసి స్వచ్ఛ ప్రతిజ్ఞ లను నిర్వహించి ప్రజలకు అవగాహన కలిగించడం జరుగుతుందని కమిషనర్ తెలిపారు.ఈ సందర్భంగా పారిశుద్ధ్య సిబ్బంది గోడ ప్రతులు కరపత్రాల ద్వారా శానిటేషన్ తీరు పై అవగాహన కలిగించి ఇందుకు సంబంధించిన స్టికర్ లను గృహాలకు అతికించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చీకటి శారద సి ఎం హెచ్ ఓ డా. రాజారెడ్డి బల్దియా వెటర్నరీ వైద్యులు డా. గోపాల్ రావు ఎం.హెచ్.ఓ డా. రాజేష్ ఏ ఈ హరికుమార్ పాల్గొన్నారు.

## ఫార్మసీ ఆఫీసర్లు అందరూ మందులను పోర్టల్‌లో ఎంట్రీ చేయాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి రవి రాథోడ్

మహబూబాబాద్, జూన్ 4 (మనం ప్రతినిధి): బుధవారం జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో ఫార్మసీ ఆఫీసర్లకు 'ఫ్యామిలీ ప్లానింగ్ లాజిస్టిక్ మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం' పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ జిల్లాలో ఫార్మసీ ఆఫీసర్లు అందరూ ఫ్యామిలీ ప్లానింగ్ సంబంధించిన, తాత్కాలిక పద్ధతులైన అంతరా ఇంజక్షన్స్, ఓరల్ పిల్స్, ఐ యు సి డి, జిల్లాకు వచ్చిన మందులు, అన్నీ కూడా పోర్టల్ లో, అప్లోడ్ చేయాలని అన్నారు. అదేవిధంగా వర్షాకాలంలో మందులన్నీ మూడు నెలల స్టాక్ ఉంచుకోవాలని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ లక్ష్మీనారాయణ డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ సారంగం, డిప్యూటీ డెమో కొప్పు ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ కవి రాజు, సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, లో కియా, ఫార్మసీ ఆఫీసర్ రామారావు, డిపిఓ నీలోహన, డిడిఎం సౌమిత్, సూపర్వైజర్ రవి, రాజ్యలక్ష్మి విసిసిఎం, ఫార్మసీ ఆఫీసర్లు పాల్గొన్నారు.



# వీరి ఆటతీరే కాదు.. మాటతీరూ అదుర్స్!

## ఆర్సీబీ.. వీళ్లనూ మర్చిపోకూడదు

సుదీర్ఘ నిరీక్షణ అనంతరం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐపీఎల్ టైటిల్ విజేతగా నిలిచింది. రజత్ పటీదార్ నేతృత్వంలోని ఆ జట్టు తొలిసారిగా ఐపీఎల్ కప్ ను ముద్దాడింది. ఇక ఆర్సీబీ విజయమనగానే మనకు విరాట్ కోహ్లీ నే గుర్తుకువస్తాడు. అంతగా ఆ జట్టును ప్రభావితం చేశాడు అతడు. అయితే.. విరాట్ తోపాటు ఈ విజయంలో కీలకంగా నిలిచిన పలువురు ఆటగాళ్లూ ఉన్నారు.

**తొలిసారిగా ఆర్సీబీకి..**

బెంగళూరు విజయాల్లో కృనాల్ పాండ్య అద్భుత ప్రదర్శనను మరువలేం. తొలిసారిగా ఆర్సీబీకి ఆడుతున్న ఈ ఆల్ రౌండర్.. జట్టులో కీలకంగా నిలిచాడు. ఇక ఫైనల్ లో పంజాబ్ విజయం దిశగా వెళ్తున్న సమయంలో.. ఆ జట్టుకు పగ్గాలు వేసి నిలువరించాడు. అద్భుతంగా బౌలింగ్ చేసి రెండు కీలక వికెట్లు పడగొట్టడమే కాకుండా, పరుగుల ప్రవాహాన్ని అడ్డుకొని పంజాబ్ను దెబ్బతీశాడు. ఇక లీగ్ దశలో ఢిల్లీతో జరిగిన మ్యాచ్ లో 73* పరుగులతో అజేయంగా నిలిచి జట్టును గెలిపించాడు. ఇక బంతితోనూ రాణించి ఈ సీజన్ లో 17 వికెట్లు పడగొట్టాడు.

**ఓపెనర్ గా కీలకంగా నిలిచి..**

గత సీజన్ వరకూ కోల్ కతాకు ఆడిన ఫిల్ సాల్ట్.. ఈసారి వేలంలో బెంగళూరుకు మారాడు. ఓపెనింగ్ బ్యాటర్ గా వచ్చి



అద్భుతంగా రాణించాడు. కోహ్లీతో కలిసి విలువైన భాగస్వామ్యాలు నెలకొల్పాడు. మొత్తం 13 ఇన్నింగ్స్ ల్లో 403 పరుగులు చేశాడు. గాయంతో రెండు మ్యాచ్ లకు దూరమయ్యాడు.

**ఫినిషర్ గా జితేశ్ శర్మ..**

వికెట్ల వెనక ఉన్న జితేశ్ శర్మ జట్టులో ఫినిషర్ పాత్రను అద్భుతంగా పోషించాడు. రజత్ పటీదార్ అందుబాటులో లేని సమయంలో రెండు మ్యాచ్ లకు కెప్టెన్ గానూ వ్యవహరించాడు. లఖ్ నవూపై కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడి 85 పరుగులతో అజేయంగా నిలిచి జట్టును గెలిపించాడు.

**హేజిల్ వుడ్.. ఎంత చెప్పినా తక్కువే**

ఈసారి ఆర్సీబీ బౌలింగ్ అంత పటిష్ఠంగా ఉందంటే అందుకు కారణం హేజిల్ వుడ్. ప్రత్యర్థులను నిలువరిస్తూ.. ఈ సీజన్ లో మొత్తం 22 వికెట్లు పడగొట్టి పర్పుల్ క్యాప్ రేసులో మూడో బౌలర్ గా నిలిచాడు.

వీరితోపాటు భువనేశ్వర్ కుమార్ (17 వికెట్లు), యశ్ దయాల్ (13 వికెట్లు), సుయాశ్ శర్మ(8 వికెట్లు) కూడా రాణించారు. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్.. అన్ని విభాగాల్లో అద్భుత ప్రదర్శనతో ఈసారి ఆర్సీబీ కప్ ను ముద్దాడింది. తమ అభిమానుల కలను నెరవేర్చి వారిలో జోష్ నింపింది.



ఐపీఎల్ 2025 సీజన్ ముగిసింది. 17 ఏళ్ల నిరీక్షణ తర్వాత 18వ సీజన్ లో ఆర్సీబీ విజేతగా నిలిచింది. అయితే ఈ ఐపీఎల్ మెగా టోర్నీలో పలువురు ఆటగాళ్లు తమ ఆట తీరుతోనే కాకుండా.. మాట తీరుతోనూ ఆకట్టుకున్నారు. తాము స్ఫూర్తి పొందుతూ.. ఇతరుల్లోనూ ప్రేరణ కలిగించే ప్రయత్నం చేశారు. వాటిలో కొన్ని వ్యాఖ్యల మీద ఓ లుక్కేద్దామా!

**ఒకప్పుడు కష్టం.. ఇప్పుడు సులభం!**

'నేను గత మూడు, నాలుగు సంవత్సరాలుగా సన్నద్ధమవుతున్నాను. దాని ఫలితాలను కూడా చూశా. ఒకప్పుడు కష్టంగా అనిపించిన విషయాలన్నీ ఇప్పుడు సులభంగా మారాయి. దృష్టి కేంద్రీకరించడం ముఖ్యమని నేను గ్రహించాను. జట్టుకు అవసరమైన మేరకు మాత్రమే ఆడాలి. ఈ స్థాయిలో అవసరం లేని పనులు చేయడానికి అస్సలు ప్రయత్నించకూడదు' అని టీనేజ్ థండర్, రాజస్థాన్ రాయల్స్ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ తాను ఐపీఎల్లో గుజరాత్ టైటాన్స్ మీద 35 బంతుల్లోనే సెంచరీ చేసిన అనంతరం అన్నాడు.

**వర్తమానంలో ఉంటాను!**

'ఫైనల్ లో ఆర్సీబీ లాంటి జట్టుకు నాయకత్వం వహిస్తున్నప్పుడు సహజంగానే ఎన్నో అంచనాలుంటాయి. కానీ, నేను ఎల్లప్పుడూ నా నియంత్రణలో ఉన్న వాటిపైనే దృష్టి సారిస్తాను. వర్తమానంలో ఉండటానికి ప్రయత్నిస్తాను. ఈ కెప్టెన్సీ ప్రయాణం నాకు గొప్ప అనుభవం. కొంతమంది అత్యుత్తమ కెప్టెన్ లు, విదేశీ ఆటగాళ్లతో కలిసి ఆడటం వల్ల ఎన్నో విషయాలు నేర్చుకున్నా. ప్రశాంతమైన, సురక్షితమైన జట్టు వాతావరణాన్ని సృష్టించడంపై దృష్టిసారించాను. మా జట్టులో దేశవాళీ ప్లేయర్సోపాటు అంతర్జాతీయ ఆటగాళ్లు ఆత్మవిశ్వాసంతో ఉంటారు' అని ఆర్సీబీ కెప్టెన్ రజత్ పటీదార్ ఐపీఎల్ ఫైనల్ కు ముందు అన్నాడు.

**పసిపాపలా నిద్ర పోతాను!**

'ఆర్సీబీ జట్టుకు నా యవ్వనం, శక్తి, ఉత్సాహం, అనుభవం ఇచ్చా. ప్రతి సీజన్ లో గెలవడానికి ప్రయత్నించా. ఈరోజు వస్తుందని ఎప్పుడూ అనుకోలేదు. గెలిచిన తర్వాత భావోద్వేగంలో మునిగిపోయాను. ఇది చాలా ఇంటెన్సిటీ ఉన్న టోర్నమెంట్. ఇక ఈ రాత్రి, నేను పసిపిల్లాడిలా హాయిగా నిద్రపోతాను' అని విరాట్ కోహ్లీ ఐపీఎల్ టోర్నీ గెలిచిన అనంతరం అన్నాడు.

**మానసికంగా మెరుగయ్యా**

'బ్యాటర్ గా నాలో పెద్దగా మార్పు రాలేదని నేను అనుకుంటున్నాను. కానీ మానసికంగా నేను మెరుగుపడ్డాను. దిగ్గజ ఆటగాళ్లతో పోటీ పడటం ఎప్పుడూ గొప్పగా అనిపిస్తుంది. దీన్ని నేను ఆస్వాదిస్తున్నా. కానీ జట్టుకు ఉత్తమ సేవలు అందించడమే నా ప్రథమ ప్రాధాన్యం' అని ఈ ఐపీఎల్ సీజన్ లో అత్యధిక పరుగులు చేసిన గుజరాత్ టైటాన్స్ బ్యాటర్ సాయిసుదర్శన్ అన్నాడు.

**క్రికెట్ చాలా త్యాగాలను కోరుకుంటుంది**

'నా ఆట, ఆలోచనలు, సామర్థ్యాలపై నాకు చాలా నమ్మకం ఉంది. అంతిమంగా, నా కెరీర్ ను ముందుకు తీసుకెళ్లడం నా బాధ్యత. నేను ఎంత కష్టపడి పనిచేయాలో నాకు తెలుసు. క్రికెట్ చాలా త్యాగాలను కోరుతుంది. కానీ మీరు ఏదైనా సాధించినప్పుడు లేదా బాగా రాణించినప్పుడు మాత్రమే ప్రజలు వాటిని గమనిస్తారు. నాకు, నేను విజయం సాధించాలనుకుంటే, నేను ప్రతి అంశంలోనూ కష్టపడి పనిచేయాలి. మీరు పగలు, రాత్రి అలుపెరగకుండా ప్రయత్నం చేసినప్పుడు ఫలితాలు వస్తాయి. నా మీద నేను నమ్మకం ఉంచుకోవడం పైనే ఎప్పుడూ నా దృష్టిని పెడతాను' అని రాజస్థాన్ రాయల్స్ యువ ఆటగాడు యశస్వి జైస్వాల్ అన్నాడు.



## రవితేజ చిత్రానికి ముహూర్తం ఫిక్స్

మాస్ రాజా రవితేజ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'మాస్ జాతర' ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమా తర్వాత రవితేజ తన నెక్స్ట్ చిత్రాన్ని ప్రారంభించేందుకు సిద్ధమయ్యాడు. అయితే, రవితేజ కెరీర్లో 76వ చిత్రంగా రాబోతున్న ఈ సినిమాపై మేకర్స్ తాజాగా సాలిడ్ అప్డేట్ ఇచ్చారు. రవితేజ తన నెక్స్ట్ చిత్రాన్ని దర్శకుడు కిషోర్ తిరుమల డైరెక్షన్లో తెరకెక్కించబోతున్నట్లు తెలుస్తోంది. అయితే, ఈ సినిమా పూజా కార్యక్రమానికి మేకర్స్ ముహూర్తం ఫిక్స్ చేశారు. జూన్ 5న ఉదయం 9.02 గంటలకు పూజా కార్యక్రమాలతో ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ఈ సినిమాను SLV సినిమాస్ బ్యాన్ర్ సుధాకర్ చెరుకూరి ప్రొడ్యూస్ చేస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన నటీనటులు, సాంకేతిక వర్గం గురించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.




## సిద్ధూ జొన్నలగడ్డ గొప్ప మనసు.. సగం రెమ్యూనరేషన్ వెనక్కి ఇచ్చిన హీరో!

టాలీవుడ్ లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకొని వరుస సినిమాలతో అలరిస్తున్నారు యంగ్ హీరో సిద్ధూ జొన్నలగడ్డ. ఇటీవల ఈ నటుడు 'జాక్'తో ప్రేక్షకుల ముందుకువచ్చిన విషయం తెలిసిందే. అయితే ఆ సినిమా ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయింది. దీంతో సిద్ధూ ఓ గొప్ప నిర్ణయం తీసుకున్నారు. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో సిద్ధు జొన్నలగడ్డ, వైష్ణవి చైతన్య నటించిన చిత్రం 'జాక్'. ఈ సినిమా కోసం ఈ హీరో రూ.8 కోట్లు రెమ్యూనరేషన్ తీసుకున్నారట. అయితే, సినిమా విజయం సాధించకపోవడంతో అందులో సగం పారితోషికాన్ని (రూ.4 కోట్లు) వెనక్కి ఇచ్చేయాలని నిర్ణయించుకున్నారు. ఈవిషయం తెలిసిన నెటిజన్లు గొప్ప మనసు చాటుకున్నారని అంటూ హీరోపై ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రస్తుతం సిద్ధూ జొన్నలగడ్డ 'తెలుసు కదా'లో నటిస్తున్నారు. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి కథానాయికలు. నీరజ కోన దర్శకత్వం వహిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై రూపొందుతోన్న ఈ సినిమా అక్టోబర్ 17న ప్రేక్షకుల ముందుకురానుంది. మనసుని తాకే భావోద్వేగాలతో, ఊహించని మలుపులతో సాగే కథ ఇదని సినీ వర్గాలు వెల్లడించాయి.



తెలుగు సినిమా ఇండస్ట్రీ.. పైకి కనిపించేంత అందంగా అయితే ఉండదు. ఎప్పటికప్పుడు పలువురు యంగ్ హీరోయిన్లు, యువతులు.. తమకు ఎదురైన చేదు అనుభవాల్ని బయటపెడుతుంటారు. శారీరకంగా ఎంతలా ఇబ్బంది పడ్డామనే విషయాన్ని చెబుతుంటారు. ఇప్పుడు కూడా మోడల్ కమ్ నటి అయిన మౌనీషా చౌదరి.. ఓ తెలుగు దర్శకుడి వల్ల తాను ఇబ్బంది పడిన విషయాన్ని బయటపెట్టింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ దీని గురించి పంచుకుంది.

## అప్పుడు నాతో అసభ్యంగా.. ఇప్పుడు స్టార్ డైరెక్టర్‌గా చెలామణీ

'టాలీవుడ్ కి చెందిన ఓ దర్శకుడు.. నాకు ఫోన్ చేసి ఆయన తీస్తున్న సినిమాలో నటించమని కోరాడు. అవకాశం ఇస్తానని కూడా చెప్పాడు. నాకు ఆ మూవీలో నటించడం ఇష్టం లేదు. ఇదే ఆయనకు చెప్పినా సరే వినకుండా నా తొడల సైజ్(కొలతల) గురించి అడిగి ఇబ్బంది పెట్టాడు. అసలు సినిమా అవకాశానికి, దానికి సంబంధం ఏంటి? ప్రస్తుతం ఆ దర్శకుడు స్టార్ అయిపోయాడు. పెద్ద పెద్ద యాక్టర్స్ తో మూవీస్ చేస్తున్నాడు' అని మౌనీషా చౌదరి చెప్పుకొచ్చింది. మోడల్ గా గుర్తింపు తెచ్చుకున్న మౌనీషా చౌదరి.. ప్రస్తుతం అమెరికాలోని ఉతాలో ఉంటుంది. 2016లో 'మిస్ ఆసియా ఉతా'గా కిరీటం గెలుచుకుంది. స్నో అక్కగా గుర్తింపు తెచ్చుకున్న ఈమెకు ఇన్ స్టాలో మంచి ఫాలోయింగ్ ఉంది. రీసెంట్గానే అమెరికా వెళ్లిన మంచు విష్ణుతో కలిసి 'కన్నప్ప' టూర్లో పాల్గొంది. సినిమాను ప్రమోట్ కూడా చేసింది. అలాంటి ఈమె.. తనకెదురైన క్యాస్టింగ్ కౌచ్ అనుభవాన్ని బయటపెట్టింది. కానీ సదరు దర్శకుడు పేరేంటి అనేది మాత్రం చెప్పలేదు.





## హరిహర వీరమల్లు వల్ల మిగతా సినిమాలకి ఇక్కట్లు?

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నిధి అగర్వాల్ హీరోయిన్ గా దర్శకులు జ్యోతి కృష్ణ, క్రిష్ జాగర్లమూడి కలయికలో తెరకెక్కించిన భారీ చిత్రం హరిహర వీరమల్లు కోసం అందరికీ తెలిసిందే.

అయితే ఈ చిత్రం రిలీజ్ ఇక ఈసారి కన్ఫర్మ్ అయ్యిపోయింది అనుకుంటే మళ్ళీ ఏదొక అవాంతరం వస్తుంది.

అయితే ఇది వరకు ఇచ్చిన పలు డేట్స్ లో అప్పటికే ఉన్న ఇతర సినిమాలకి వీరమల్లు ఎఫెక్ట్ తగిలింది. ఇక మళ్ళీ జూన్ 12 నుంచి వాయిదా పడుతుండడం అనే మాట గట్టిగా వినిపిస్తున్న నేపథ్యంలో మళ్ళీ కొత్త డేట్స్ ఆ డేట్స్ లో ఇది వరకే ఉన్న సినిమాలకి వీరమల్లు వల్ల ఇక్కట్లు తప్పేలా కనిపించడం లేదు.

ఇప్పటికే పలు సినిమాలు వాయిదాలు పడ్డాయి కానీ ప్రతీ సారి ఇదే తంతు కనిపిస్తుంది. దీనితో ఈసారి మాత్రం వీరమల్లు సినిమా వచ్చినా కూడా ఇతర సినిమాలు వెనక్కి వెళ్లే ఛాన్స్ లేదు అన్నట్టు టాక్. దీనితో ఇక పవన్ సినిమానే కొత్త పోటీ లేని డేట్ ని వెతుక్కోవాల్సి ఉందని టాక్. మరి ఇందులో ఎంతవరకు నిజం ఉంది అనేది వేచి చూడాలి.

**'హరిహర వీరమల్లు' నిర్మాతకు 11 కోట్లు ఇచ్చిన పవన్!**

ప్రస్తుతం మన టాలీవుడ్ నుంచి రిలీజ్ కి రాబోతున్న లేటెస్ట్ చిత్రాల్లో భారీ పాన్ ఇండియా చిత్రం హరిహర వీరమల్లు కూడా ఒకటి. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నిధి అగర్వాల్ హీరోయిన్ గా దర్శకుడు జ్యోతి కృష్ణ తెరకెక్కించిన ఈ సినిమా పరిస్థితి ఏంటో అభిమానులకి కూడా అంతగా అంతుపట్టడం లేదు.

అయితే ఈ చిత్రం కోసం ఎదురు చూస్తున్న ఫ్యాన్స్ కి ఒకోసారి ఒకో ట్విస్ట్ తగులుతుండగా ఈ సినిమా ప్రమోషన్స్ కూడా ఈ మధ్యనే మొదలయ్యాయి. కానీ ఇంతలోనే మళ్ళీ వాయిదా రూమర్స్ కమ్ముకున్నాయి. అయితే ఈ చిత్ర నిర్మాత ఏ ఎం రత్నం భారీగా ఈ సినిమా కోసం ఖర్చు చేసిన సంగతి తెలిసిందే. అలాగే రీసెంట్ గానే ప్రమోషన్స్ ని కూడా తానే ముందుండి నడిపించారు.

అయితే సడెన్ గా ఈ నిర్మాత ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారు అనే వార్త షాకింగ్ గా మారింది. దీనితో పవన్ తాను తీసుకున్న అడ్వాన్స్ మొత్తం 11 కోట్లు మళ్ళీ వెనక్కి ఇచ్చి ఆర్థిక ఇబ్బందులు నుంచి తప్పుకోవడానికి తోడ్పడతాయి అని చెప్పారట. అలాగే సినిమా రిలీజ్ ని ఎలాంటి ప్రెజర్ లేకుండా ముందు రిలీజ్ చేసుకోవాలని సూచించినట్టుగా తెలిపారని ఇపుడు సినీ వర్గాల్లో టాక్. దీనితో ఈ టాక్ వైరల్ గా మారింది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.